
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 122

SUNDAY Special | ఆదివారం 23-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇనుములో.. హృదయం మొలిచెనా?!

ఓ చిన్న ప్లాటినం ముక్క తనలో పుట్టుకొచ్చిన పగుళ్లను తనంత తానుగా నయం చేసుకుంది. అదీ ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలంతా కళ్లారా చూస్తుండగా!

- వివరాలు 6లో



మరో టైటిల్‌కు అడుగు దూరంలో...

భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి కొరియా ఓపెన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లారు. సెమీస్‌లో చైనాపై గెలుపొందారు.

- వివరాలు 12లో



జాతి క్షేమాన్ని మించిన పదవీకాంక్ష

గత యూపీఏ ప్రభుత్వం జాతి ప్రయోజనాలను పక్కనబెట్టిందని, బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేసిందని మోదీ ఆరోపించారు.

- వివరాలు 6లో



మహిళా ఐఏఎస్ అరెస్ట్

ఛత్తీస్‌గఢ్ బొగ్గు లెవీ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ.. మహిళా ఐఏఎస్ అధికారి రానూ సాహూను అరెస్ట్ చేసింది.

- వివరాలు 6లో



రష్యా దాడి.. 8 మంది మృతి

ఉక్రెయిన్ వ్యాప్తంగా రష్యా సాగించిన వివిధ దాడుల్లో ఎనిమిది మంది పౌరులు మృతి చెందగా పలువురు గాయాలపాలయ్యారు.

- వివరాలు 6లో



సీజే జస్టిస్ అలోక్ ప్రమాణం నేడు

తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

- వివరాలు 5లో



ఎన్నా'రైస్' క్యూ

భారత్ నుంచి బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతుల నిషేధంతో అమెరికాలోని రిటైల్ ఔట్‌లెట్లు ఎన్నారైలతో కిటకిటలాడుతున్నాయి. తెలుగువారు ఎక్కువగా నివసించే డాలస్, అట్లాంటా, కాలిఫోర్నియా తదితర ప్రాంతాల్లోని స్టోర్ల దగ్గర భారీ క్యూలు కనిపిస్తున్నాయి. నిషేధానికి ముందు వరకు 9.07 కిలోల బ్యాగ్‌ను 16–18 డాలర్ల (రూ.1,312–రూ.1,476)కు విక్రయించిన స్టోర్ల నిర్వాహకులు తాజాగా దాదాపు మూడు రెట్లు అధికంగా 47 డాలర్ల (రూ. 3,854) వరకు బ్యాగ్‌ను విక్రయిస్తున్నారు. కేంద్రం నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లో సుమారు రూ.8,200 కోట్ల విలువైన 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించే ఒప్పందాలను రద్దు చేసుకొనే పరిస్థితి తలెత్తిందని వ్యాపారులు అంటున్నారు.

5 లో

హోరు గోదావరి!

శ్రీరాంసాగర్ నుంచి భద్రాచలం దాకా జలకళ

- ఎగువనుంచి పోటెత్తుతున్న ప్రవాహాలు
- ప్రాణహిత శాంతించినా.. కడెం, ఇతర వాగులతో నదిలో చేరుతున్న వరద
- ఉగ్రరూపం దాల్చిన పెన్‌గంగ
- భద్రాచలానికి మళ్లీ వరద ఉధృతి
- అటు కృష్ణా నదిలోనూ పెరుగుతున్న ప్రవాహం
- జూరాల, తుంగభద్రకు వరద
- ఈ నెలాఖరు నాటికి శ్రీశైలానికి ఇన్‌ఫ్లో మొదలయ్యే అవకాశం



హిమాయత్ 'సాగరం'

ఐదు గేట్లు ఎత్తడంతో దిగువకు పరవళ్లు తొక్కుతున్న నీళ్లు

గోదావరికి జలకళ.. కృష్ణా వెలవెల

గోదావరి నది పరీవాహకంలోని ప్రాజెక్టులన్నీ జలకళతో తొణికిసలాడుతున్నాయి. కృష్ణా, దాని ఉపనదులపై ప్రాజెక్టులకు మాత్రం స్వల్పంగా ఇన్‌ఫ్లో ఉంది.

- 2, 3లో

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: ఎగువన శ్రీరాంసాగర్ నుంచి దిగువన భద్రాచలం ఆవలి దాకా గోదావరి నది హోరెత్తి ప్రవహిస్తోంది. ప్రధాన నది పొడవునా జలకళ ఉట్టిపడుతోంది. ప్రాణహిత నుంచి ప్రవాహం కాస్త తగ్గినా.. ఎగువ నుంచి వస్తున్న నీరు, కడెం, ఇతర వాగులు, వంకలు కలసి మళ్లీ వరద పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద నీటి మట్టం మెల్లగా పెరుగుతూ వస్తోంది.

ఎగువ గోదావరి ఉరకలేస్తూ..

శనివారం రాత్రి 7 గంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 1,57,496 క్యూసెక్కుల వరద చేరుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వ 56.94 టీఎంసీలకు పెరిగింది. మరో 34 టీఎంసీలు చేరితే

మిగతా 2వ పేజీలో ▶

ఎక్కడ.. ఎంతెంత వరద? (క్యూసెక్కులలో)

శ్రీరాంసాగర్	1,57,496
ఎల్లంపల్లి	1,92,529
మేడిగడ్డ (లక్ష్మి బ్యారేజీ)	6,10,250
సమ్మక్క బ్యారేజీ	8,79,450
భద్రాచలం	సుమారు 9 లక్షలు
జూరాల (కృష్ణా నది)	30,000
తుంగభద్ర డ్యామ్	34,071

రేప్ చేసి, రంపాలపై పడేసి..



ఇద్దరు యువతులపై అత్యాచారం, హత్య!

మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించిన రోజునే మరో దారుణం

మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటన జరిగిన రోజే అక్కడికి 40 కిలోమీటర్ల దూరంలో మరో దారుణం చోటుచేసుకుంది. కుకి–జోమి తెగకు చెందిన ఇద్దరు యువతుల్ని సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేసినట్టుగా పోలీసు స్టేషన్‌లో నమోదైన జీరో ఎఫ్ఐఆర్ ద్వారా వెల్లడైంది. బాధిత యువతుల్ని దౌర్జన్యంగా లాక్కెళ్లిన అల్లరిమూక.. వారిపై అత్యాచారానికి పాల్పడిన అనంతరం ఓ మిల్లులోని రంపాలపై పడేశారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఇద్దరు యువతులు ప్రాణాలు విడిచారు. ఘటనపై బాధితుల్లోని ఓ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


- వివరాలు 6లో

రేపు విపక్షాల నిరసన ప్రధాని ప్రకటన చేయాలని విపక్షాల పట్టు 6 లో

దారి తప్పిన సీబీఐ దర్యాప్తు

వివేకా హత్యపై చార్జ్‌షీట్‌లో అభియోగాలన్నీ నిరాధారం

1,226 రోజుల దర్యాప్తులో సీబీఐ సాధించింది శూన్యం



- దేశంలోనే ప్రముఖ న్యూస్ వెబ్‌సైట్ 'ద వైర్' విశ్లేషణ
- వివేకా అప్పట్లో రాజకీయాల్లో క్రియాశీలకంగా లేరు
- 2011 ఉప ఎన్నికలతోనే ఆయన ప్రాభవం ముగిసింది..
- కడప ఎంపీ అభ్యర్థిని నిర్ణయించే స్థాయిలో లేరు
- షర్మిలను ఎంపీగా పోటీ చేయాలని వివేకానందరెడ్డి కోరారనడానికి ఆధారం లేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమిపై సీబీఐది కట్టుకథే
- వివేకా రెండో వివాహాన్ని, బయటి శక్తుల పాత్రను పట్టించుకోని సీబీఐ

10 లో



26% డైట్ చార్జీలు పెంపు

అన్ని గురుకులాలతో సహా పలు శాఖలకు అనుబంధంగా నడుస్తున్న హాస్టళ్లలోని విద్యార్థుల డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం 26% పెంచింది. పెరిగిన చార్జీలు జూలై నుంచి అమలులోకి రానున్నాయి.

- 3లో

దివ్యాంగుల పింఛన్ రూ.4,016

ఇప్పటివరకు రూ.3,016 చొప్పున దివ్యాంగులకు నెలవారీగా పింఛన్ ఇస్తుండగా.. జూలై నుంచి రూ.4,016 చొప్పున ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు శనివారం జీఓ విడుదల చేసింది.

- 2లో



హెల్పింగ్ హ్యాండ్స్



పెన్‌గంగలో చిక్కుకుని... గంటసేపు బిక్కుబిక్కు..

తాంసి: పెన్‌గంగ నదిలో నాటుపడవ ద్వారా రోజూ ప్రయాణికులను ఇరువైపులా ఒడ్డుకు సురక్షితంగా చేరుస్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా పెరిగిన నది ఉధృతిలో చిక్కుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. తాంసి మండలం వడూర్ గ్రామానికి చెందిన రావుల దార్ధీప పెన్‌గంగలో నాటుపడవ నడిపిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ప్రయాణికులను వడూర్–మహారాష్ట్ర వైపు ఉన్న నదీతీరాలకు చేరుస్తుంటాడు. అయితే శనివారం కురిసిన భారీవర్షానికి పెన్‌గంగ ప్రవాహం పెరిగింది. నదిలో ఉన్న పడవను బయటకు తీయడానికి దార్ధీప, స్నేహితులు అగు కుశల్, రేండ్ల శ్రీను ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగింది. పడవలోనే ఉండిపోయిన ఈ ముగ్గురు ఒడ్డుకు చేరే మార్గం కానరాక భయాందోళన చెందారు. హాహాకారాలు చేయడంతో స్థానిక యువకులు గమనించి వెంటనే నదిలోకి దిగి ఈదుకుంటూ వెళ్లి కుశల్, శ్రీనును బయటకు తీసుకువచ్చారు. అయితే దార్ధీప పడవలోనే కొంతదూరం కొట్టుకుపోయి ఓ చోట చెట్ల కొమ్మలను పట్టుకున్నాడు. గంటకుపైగా బిక్కుబిక్కుమంటూ గడిపాడు. సమాచారం అందుకున్న భీంపూర్ ఎస్సై రాధిక అక్కడికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. గంగపుత్రులు, స్థానిక యువకులు టైర్లు, తాళ్ల సాయంతో అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దార్ధీప ప్రాణాలతో బయటపడగా పడవ మాత్రం నీటి ప్రవాహంలోనే కొట్టుకుపోయింది.



తాళ్లకు అమర్చిన టైరును పట్టుకొని బయటకు వస్తున్న దార్ధీప



పెద్దవాగులో చిక్కుకున్న రైతు

కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం వర్ధలగూడకు చెందిన మంత్రి రాజయ్య శనివారం ఉదయం 8 గంటలకు వ్యవసాయ పనుల కోసం వెళ్లి వస్తూ పెద్దవాగులో చిక్కుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో రాజయ్యను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు.



తన ప్రాణాలను కాపాడిన కలెక్టర్, ఎమ్మెల్యేలకు నమస్కరిస్తున్న బాధిత రైతు రాజయ్య



త్వరలో అంటే ఈ సంవత్సరమేనా సార్!

దివ్యాంగుల పింఛన్ రూ.4,016



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న దివ్యాంగులు. చిత్రంలో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు

- జూలై నుంచి అమలు
- ప్రస్తుతం ఇస్తున్న దానికి ఒకేసారి వెయ్యి పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దివ్యాంగులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతలో భాగంగా నెలవారీగా ఇస్తున్న పింఛన్ పరిమితిని పెంచింది. ఇప్పటివరకు రూ.3,016 చొప్పున దివ్యాంగులకు నెలవారీగా పింఛన్ ఇస్తుండగా... జూలై నుంచి రూ.4,016 చొప్పున ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు శనివారం జీఓ. 25 జారీ చేసింది. ఇప్పటివరకు ఇస్తున్న పింఛన్‌కు మరో వెయ్యి రూపాయల పరిమితిని పెంచిన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సెర్ప్ సీఈఓను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ ఆదేశించారు. దివ్యాంగుల పింఛన్ పెంపునకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇటీవల మంచిర్యాలలో జరిగిన బహిరంగ సభ వేదికగా ప్రకటన చేశారు. అందుకు సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేయడంతో సంబంధిత శాఖ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. పింఛన్ పెంపుదలతో రాష్ట్రంలో దాదాపు 5,11,656 మందికి అదనపు లబ్ధి కలగనుంది.

ముఖ్యమంత్రికి మంత్రుల కృతజ్ఞతలు

రాష్ట్రంలోని దివ్యాంగులకు ఆసరా పింఛన్లలో భాగంగా నెలవారీగా ఇస్తున్న మొత్తాన్ని పెంచినందుకు రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సీఎం కె.చంద్రశేఖర్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ దేశంలో సామాజిక పింఛన్ల పథకాన్ని ఇంత పెద్ద మొత్తంలో అమలు చేస్తున్న రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమేనని అన్నారు.

పెన్‌గంగ ఉగ్రరూపం



ఆదిలాబాద్ వద్ద జాతీయ రహదారి బ్రిడ్జి అంచుకు చేరుకున్న పెన్‌గంగ వరద ఉధృతి

- ప్రమాదం అంచున కోరాట–చనాఖా పంపుహౌస్
- బ్యాక్ వాటర్‌తో పది గ్రామాలు జలదిగ్బంధం
- 20 వేల ఎకరాల్లో నీట మునిగిన పంట

సాక్షి, ఆదిలాబాద్: గోదావరి ఉప నది పెన్‌గంగ ఉగ్రరూపం దాల్చింది. ఎగువన మహారాష్ట్ర నుంచి భారీగా వరద పోటెత్తింది. ఆదిలాబాద్ జిల్లాలో నిర్మిస్తున్న కోరాట–చనాఖా బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 213 మీటర్లుకాగా.. దాన్ని మించి 215.7 మీటర్ల ఎత్తున ప్రవాహం వస్తోంది. దీనితో బ్యారేజీ సమీపంలో నిర్మించిన పంపుహౌస్ ప్రమాదం అంచున నిలిచింది. మరో రెండు మీటర్ల ప్రవాహం పెరిగితే పంపుహౌజ్‌లోకి వరద పోటెత్తే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెన్‌గంగ ఉధృతికి భీంపూర్, జైనథ్, బేల మండలాల్లోని 10 జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుమారు 20 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. డొల్లార సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జిని తాకుతూ పెన్‌గంగ ప్రవహిస్తుండటంతో.. శనివారం రాత్రి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

హోరు గోదావరి!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ ప్రాజెక్టు నిండిపోతుంది. శ్రీరాంసాగర్ దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 1,92,529 క్యూసెక్కుల ప్రవాహాలు వస్తున్నాయి. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకోవడంతో 20 గేట్లు ఎత్తి 2,55,320 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరదకు ప్రాణహిత జలాలు కలసి.. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీలోకి 6,10,250 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక్కడ వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు వదులుతున్నారు. మధ్యలో ఇంద్రావతి ఉపనది నీరూ తోడై.. తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజీలోకి 8,79,450 క్యూసెక్కుల భారీ ప్రవాహం వస్తోంది. ఈ నీటిని అలాగే మొత్తంగా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాలు, మధ్యలో ఉప నదులు, వాగుల నుంచి కలుస్తున్న జలాలు మొత్తం భద్రాచలం, పోలవరం ప్రాజెక్టు, ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా సముద్రంలో కలుస్తున్నాయి.

భద్రాచలం వద్ద మళ్లీ అప్రమత్తం

శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం దాకా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. ఆ నీరంతా వాగులు, వంకల ద్వారా ప్రాణహితలోకి చేరి గోదావరికి వరద పెరగనుంది. దీనితోపాటు, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలు కలసి.. సోమవారం నాటికి భద్రాచలం వద్ద వరద 11 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే గోదావరిలో నీటి మట్టం మెల్లగా పెరుగుతూ వస్తోంది. భద్రాచలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 39 అడుగుల వద్ద నిలిచిన నీటిమట్టం.. రాత్రి 8 గంటలకు 41.01 అడుగులకు చేరింది. మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ మాలోత్ కవిత, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఇతర నేతలు గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కృష్ణాలో పెరుగుతున్న ప్రవాహం

పశ్చిమ కనుమల్లో వర్షాలతో కృష్ణా ప్రధాన పాయలో వరద మెల్లగా పెరుగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 83,945 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, నీటి నిల్వ 45.50 టీఎంసీలకు చేరింది. మరో 84 టీఎంసీలు వస్తే ఈ డ్యామ్ నిండుతుంది. ఆల్మట్టి దిగువన ఉన్న నారాయణపూర్‌లోకి ఇన్‌ఫ్లో ఏమీ లేదు. ఇక కృష్ణా ఉప నది అయిన తుంగభద్రలో వరద కొంత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 34,071 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ 16.65 టీఎంసీలకు పెరిగింది. ఆల్మట్టి, తుంగభద్ర జలాశయాలు నిండితే.. దిగువకు వరద రానుంది. ఈ నెలాఖరులోగా శ్రీశైలం జలాశయానికి ప్రవాహాలు మొదలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

దిగువన వరద మొదలు

పులిచింతలకు దిగువన కృష్ణా నదిలో ప్రవాహం ప్రారంభమైంది. ఖమ్మం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో మున్నేరు పరవళ్లు తొక్కుతోంది. ఆ నీరంతా కృష్ణాలోకి చేరుతుండటంతో శనివారం ప్రకాశం బ్యారేజీలోకి 17,377 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో కృష్ణా డెల్టాకు 7,087 క్యూసెక్కులను విడుదల చేస్తూ.. మిగతా నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

కోతకు గురైన కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన

తెలంగాణ–మహారాష్ట్రల మధ్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సమీపంలో ఉన్న అంతర్రాష్ట్ర వంతెన కోతకు గురైంది. శుక్రవారం అర్ధరాత్రి వచ్చిన భారీ వరద తాకిడికి మహారాష్ట్ర వైపు ఉన్న చివరిభాగం దెబ్బతిన్నది. అక్కడ వంతెనకు ఆనుకుని పోసిన గ్రావెల్, ఎర్రమట్టి కుంగిపోయింది. గత ఏడాది జూలైలో కూడా ఇదే ప్రాంతంలో కోతకు గురై 20 రోజుల పాటు రాకపోకలు నిలిచిపోవడం గమనార్హం.

సింగరేణికి వాన దెబ్బ

భారీ వర్షాలతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. 14 ఓపెన్ కాస్ట్‌లలో బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ (బొగ్గుపొరలపై ఉన్న మట్టి) వెలికితీత పూర్తిగా నిలిచిపోయాయి. దీనితో రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓసీపీల్లో చేరుతున్న వరద నీటిని తోడిపోసేందుకు భారీ మోటార్లను వినియోగిస్తున్నారు.



కడెం.. జనం గుండెల్లో సైరన్!

గేట్ల మొరాయింపుపై ప్రాజెక్టు దిగువన గ్రామాల్లో ఆందోళన

- పరీవాహకం పరిధిలో భారీగా కురుస్తున్న వానలు
- శనివారం కూడా గణనీయంగానే ప్రవాహం
- ప్రాజెక్టు నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు



వరద గేటు వద్ద తేనె తుట్టె వల్ల గేటును ఎత్తడం లేదు

కడెం: నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు దిగువన గ్రామాల ప్రజల గుండెల్లో సైరన్ మోగుతోంది. ఓ వైపు వరుస వానలతో వరద పోటెత్తుతుండటం, మరోవైపు ప్రాజెక్టు గేట్లు మరమ్మతులకు గురై నీటిని సరిగా విడుదల చేయలేని పరిస్థితి తలెత్తడంపై ఆందోళన మరింతగా పెరుగుతోంది. శనివారం కూడా ప్రాజెక్టుకు గణనీయ స్థాయిలో ప్రవాహం కొనసాగింది. ఇలాంటిది అకస్మాత్తుగా భారీ వరద వస్తే ప్రాజెక్టు తట్టుకుంటుందా? అన్న భయం కనిపిస్తోంది.

మరమ్మతులు చేపట్టేదెప్పుడు?

గతేడాది జూలైలో వచ్చిన వరదతో కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. 2, 3 నంబర్ గేట్ల కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోయాయి. రక్షణ గోడలు, స్పిల్ వే, వరద గేటు మోటార్లు దెబ్బతిన్నాయి. కానీ పూర్తి స్థాయి మరమ్మతులకు సరిపడా నిధులు కేటాయించకపోవడం, అదీ సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇటీవలి వరకు మరమ్మతుల పనులు ప్రారంభమే కాలేదు. ప్రాజెక్టు దెబ్బతిన్న పదినెలల తర్వాత అంటే మే నెలలో రూ.1.44 కోట్లను మరమ్మతుల కోసం మంజూరు చేశారు. రెండుసార్లు టెండర్లు నిర్వహించారు. టెండర్ పూర్తయ్యే సమయానికి వానాకాలం మొదలవడంతో పనులు చేపట్టలేదని అధికారులు తెలిపారు.

అరకొర నిర్వహణతో..

ఏటా ప్రాజెక్టు గ్రీసింగ్, జనరేటర్ నిర్వహణ, చిన్నస్థాయి మరమ్మతుల కోసం ప్రభుత్వం ఏటా రూ.8 లక్షలు కేటాయిస్తుంది. అవి పైపై పనులకే సరిపోతాయి. అయితే 2018లో ప్రాజెక్టుకు కేటాయించిన 5 కోట్ల నిధుల్లో మిగిలిన మొత్తంతో అధికారులు గేట్ల కౌంటర్ వెయిట్‌లను తయారు చేయిస్తున్నారు. ఇక వానాకాలం మొదలయ్యే ముందే వరద గేట్లు సరిగా పనిచేస్తున్నాయా, లేదా అని ట్రయల్ రన్ చేసి పరిశీలించాలి. కానీ అధికారులు ఏదో ఒక గేటును పరిశీలించి తూతూమంత్రంగా ప్రక్రియ ముగిస్తున్నారు. అసలు సమయానికి లోపాలు బయటపడితే.. సాంకేతిక కారణాలు అని చెప్తున్నారన్న విమర్శలున్నాయి. ఇక కనీసం ప్రాజెక్టు గేట్ల వద్ద తేనెతుట్టెలనూ తొలగించలేదు. శుక్రవారం వరద పోటెత్తినప్పుడు గేట్లు ఎత్తడానికి వెళ్లిన సిబ్బందిపై తేనెటీగలు దాడి చేయడంతో గాయపడ్డారు. తేనెతుట్టెల కారణంగా 18వ నంబర్ గేటును ఎత్తడం లేదని సమాచారం.

ఏడాదిగా నిర్లక్ష్యమే..

కడెం ప్రాజెక్టు మరమ్మతులను ఏడాదైనా పూర్తి చేయించకపోవడం దురదృష్టకరం. స్థానిక ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు అధ్వానంగా మారింది. ఇప్పటికైనా వేగంగా మరమ్మతులు చేయించాలి.

– అలెగ్జాండర్, ఎంపీపీ, కడెం

ప్రాజెక్టుకు ముప్పు లేదు

ప్రాజెక్టులో టెక్నికల్ ప్రాబ్లంతో కొన్ని గేట్లు మొరాయించాయి. మెకానికల్ సిబ్బందితో గేట్ల మోటార్లకు మరమ్మతు చేయిస్తున్నాం. ప్రాజెక్టుకు ఎలాంటి ముప్పు లేదు. ప్రజలు ఆందోళన చెందవద్దు.

– శ్రీనివాస్, ప్రాజెక్టు సీఈ

మళ్లీ మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు

- 24న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణశాఖ అంచనా
- రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ
- రాష్ట్రవ్యాప్తంగా 2.26 సెం.మీ. సగటు వర్షపాతం నమోదు

సాక్షి, హైదరాబాద్: వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగిన అల్పపీడనం శనివారం బలహీనపడటంతో వానలు తగ్గుముఖం పట్టాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే దక్షిణ ఒడిశా, ఉత్తర ఏపీ సమీపంలోని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 24న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని.. దాని ప్రభావంతో ఈ నెల 25, 26 తేదీల్లో విస్తారంగా వానలు పడతాయని అంచనా వేసింది. పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవొచ్చని హెచ్చరించింది. ఈ మేరకు 25, 26 తేదీలకు సంబంధించి రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. ఇక శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 2.26 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 10 సెంటీమీటర్లు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 6.8 సెంటీమీటర్ల సగటు వాన కురిసింది. మిగతా జిల్లాల్లోనూ అక్కడక్కడా మోస్తరు వానలు పడ్డాయి.

హరగోపాల్ భార్య శిరీష అరెస్టు



సాక్షి, అమరావతి: కుల నిర్మూలన పోరాట సమితి నేత దుడ్డు ప్రభాకర్‌తో పాటు దివంగత మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్(ఆర్కే) భార్య కందుల శిరీష అలియాస్ పద్మక్కను కూడా అరెస్టు చేసినట్లు ఎన్‌ఐఏ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019లో ఛత్తీస్‌గఢ్‌లోని ట్రియ గ్రామంలో భద్రతా దళాలపై మావోయిస్టులు జరిపిన దాడి కేసులో వారిద్దరినీ అరెస్టు చేసినట్టు వెల్లడించింది. దీనిని ఆర్కే డైరీ కేసుగా ఎన్‌ఐఏ పరిగణిస్తోంది. శిరీష, దుడ్డు ప్రభాకర్‌తో పాటు ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురిని ఎన్‌ఐఏ అరెస్టు చేసింది. శిరీషను ప్రకాశం జిల్లా ఆలకూరపాడులోని ఆమె నివాసంలో, ప్రభాకర్‌ను విజయవాడలో ఆయన నివాసంలో ఎన్‌ఐఏ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మావోయిస్టుల నుంచి నిధులు పొందుతూ.. ఆ పార్టీ భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు వీరిద్దరూ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని ఎన్‌ఐఏ తెలిపింది. మావోయిస్టు పార్టీ అనుబంధ విభాగాల పటిష్టత కోసం పనిచేస్తున్నారని పేర్కొంది.

గోదావరిలో జలకళ.. కృష్ణాలో వెలవెల..

ఐదు రోజులుగా కురుస్తున్న వానలతో రాష్ట్రంలో గోదావరి నది పరీవాహకంలోని ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకుంటే.. కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. మహారాష్ట్రతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఉప నదులు, వాగులు పోటెత్తుతుండటంతో చిన్న ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. వాటి నుంచి విడుదలవుతున్న నీరంతా గోదావరి నదిలోకి చేరి.. ప్రధాన ప్రాజెక్టులూ కళకళలాడుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలో కృష్ణా, దాని ఉపనదులపై ఉన్న ప్రాజెక్టులకు మాత్రం స్వల్పంగా ఇన్‌ఫ్లో ఉంది. మొత్తంగా రెండు నదీ బేసిన్ల పరిధిలోని ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటి మట్టం, ప్రస్తుతం ఉన్న నీటిమట్టం వివరాలివీ..

(సముద్రమట్టాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టుల్లో నీటిమట్టాన్ని లెక్కిస్తారు. అందువల్ల ఎత్తైన-కొండ ప్రాంతాల్లో ఉన్న చిన్న ప్రాజెక్టుల నీటి మట్టం స్థాయిలు అధికంగా, మైదాన-పల్లంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రాజెక్టుల నీటిమట్టం స్థాయిలు తక్కువగా ఉంటాయి)

– సాక్షి, నెట్‌వర్క్



శ్రీరాంసాగర్ – నిజామాబాద్ జిల్లా	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
	1,091	1081.80



నిజాంసాగర్ – కామారెడ్డి జిల్లా	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
	1,405	1,398.8



ఎల్లంపల్లి – పెద్దపల్లి జిల్లా	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
	485	479



మిడ్ మానేరు – రాజన్న సిరిసిల్ల జిల్లా	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
	1,043.3	1,025.6



లోయర్ మానేరు – కరీంనగర్ జిల్లా	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
	920	875.51



కిన్నెరసాని – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
	407	402.7



తాలిపేరు – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
	242.7	236.22

నీటిమట్టం అడుగుల్లో..

క్లుప్తంగా...

కొడుక్కు టికెట్ కోసం పాకులాడను: గుత్తా

జగదీశ్‌రెడ్డితో విభేదాల్లేవని వెల్లడి



నల్లగొండ టూటౌన్: తన కొడుక్కు టికెట్ కోసం పాకులాడటం కానీ, పైరవీలు గానీ చేయబోనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అధిష్టానం అవకాశం ఇస్తేనే తన కొడుకు అమిత్ పోటీలో ఉంటాడని స్పష్టం చేశారు. శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తన కుమారుడు అమిత్‌రెడ్డి టికెట్ విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయం అని చెప్పారు. 'జిల్లా అధికారిక వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకోను.. ఉద్యోగుల బదిలీలు, నామినేటెడ్ పదవుల విషయంలో నేను ఎక్కడా కలుగజేసుకోలేదు'అని తెలిపారు. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో ఎలాంటి విభేదాల్లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి వారు విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారని.. రాజకీయాల్లో హుందాతనం అవసరం అని అన్నారు.

పాలన మీద నమ్మకముంటే గజ్వేల్ నుంచి పోటీ చెయ్

సీఎం కేసీఆర్‌కు పొంగులేటి సవాల్




సత్తుపల్లి: సీఎం కేసీఆర్‌కు తన పరిపాలనపై నమ్మకం ఉంటే కామారెడ్డి నుంచి కాకుండా సొంత నియోజకవర్గమైన గజ్వేల్ నుంచి పోటీ చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయా సభల్లో పొంగులేటి మాట్లాడుతూ యువకుల బలిదానాలకు చలించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో డబ్బు, అధికార మదంతో గెలవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నారు.

ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌కి నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఉద్యోగ కల్పనపై కేసీఆర్ 54 లక్షల మంది నిరుద్యో గులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం ఈ మేరకు ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన నిరుద్యో గులు.. ప్రాణాలకు తెగించి పోరాడి తెలంగాణ తెచ్చుకున్నారని, అమరవీరుల బలిదానాలపై ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన కేసీఆర్, ఉద్యో గాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల ఉసురు తీసుకుంటున్నాడని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడిన తొలి నాళ్లలో ఇంటికో ఉద్యోగమిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని ఊదరగొట్టే మాటలు మాట్లాడారని, తొమ్మిదేళ్లు దాటినా ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను గద్దెదించాలి: ప్రవీణ్‌కుమార్



ఎలిగేడు(పెద్దపల్లి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దెదించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేట, సుల్తాన్‌పూర్, లాలపల్లి, ఎలిగేడు, ధూళికట్ట, ముప్పిరితోట తదితర గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించారు. ఎలిగేడులో ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనున్నట్లు కొన్ని పత్రికల్లో కథనం చూశానని, అయితే ఇక్కడి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష చేతిలో ఆయన ఓటమి ఖాయమని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గిరిజనులపై దాడులు చేస్తూనే మరోవైపు తెలంగాణలో బీజేపీ అధి కారంలోకి వస్తే గిరిజనులకు రిజర్వేషన్లు పెంచుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

మతవిద్వేషాల సృష్టికి బీజేపీ కుట్రలు: దాసోజు

సాక్షి, హైదరాబాద్: మత విద్వేషాలు సృష్టించేందుకుయత్నిస్తున్న బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేతలు చలపతిరావు, రాజారాం యాదవ్‌తో కలిసి ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత కుంభకర్ణ నిద్ర నుంచి లేచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డబుల్ బెడ్‌రూం ఇళ్ల సందర్శన అంటూ డ్రామా మొదలుపెట్టారన్నారు.

కమలంలో ఆగని లుకలుకలు



సాక్షి, హైదరాబాద్: బీజేపీలోని అసంతృప్త స్వరాలు ఏదో ఒక రూపంలో బయటపడుతూనే ఉన్నాయి. బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జరిగిన సభలో వేదికపై కొందరు నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరు, ఆ తర్వాత ట్వీట్ల ద్వారా స్పందించిన వైఖరిపై పార్టీలో చర్చ జరుగుతోంది. తన విషయంలో వ్యవహరించినట్టుగా కాకుండా కిషన్‌రెడ్డినైనా ప్రశాంతంగా పనిచేసుకోనివ్వాలని, ఢిల్లీకి వెళ్లి లేనిపోని ఫిర్యాదులు, రిపోర్టులు ఇవ్వొద్దని మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇక ఈ కార్యక్రమంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొనడంపై బీజేపీ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి ట్విట్టర్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే ఒరవడి శుక్రవారం అర్ధరాత్రి దాకా సాగిన రాష్ట్ర పార్టీ కోర్‌కమిటీ సమావేశంలోనూ కొనసాగినట్టు పార్టీవర్గాల సమాచారం.

తెలంగాణకు కిరణ్‌కు సంబంధమేమిటి?

తెలంగాణ ద్రోహిగా ముద్రపడ్డ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని తెలంగాణకు సంబంధించిన పార్టీ కార్యక్రమానికి ఎలా పిలుస్తారని విజయశాంతి ప్రశ్నించినట్టు తెలిసింది. ఇది తెలంగాణ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పోయే ప్రమాదం ఉందని ఆమె అసహనం వ్యక్తం చేశారని అంటున్నారు. ఈ విషయంలో జాతీయ, రాష్ట్ర నేతలను హెచ్చరించి, ఆమె తన నిరసన వ్యక్తం చేసినట్టు సమాచారం.

అలా ఎలా సంజయ్?

కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సభలో బండి సంజయ్ మాట్లాడిన తీరు బాగా లేదని రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. బండి వ్యాఖ్యలు పార్టీకేడర్‌ను గందరగోళంలో పడేసే విధంగా ఉన్నాయని పేర్కొన్నట్టు తెలిసింది. ఏవైనా ఇలాంటి అభిప్రాయాలుంటే పార్టీ అంతర్గత సమావేశాల్లో మాట్లాడాలే తప్ప, బహిరంగంగా మాట్లాడడం ఏమిటని సంజయ్ తీరును తప్పు పట్టినట్టు సమాచారం. ఈ మేరకు కోర్ కమిటీ మీటింగ్‌లో వారు సంజయ్‌కి క్లాస్ తీసుకున్నట్లు చెబుతున్నారు. గతం నుంచే బండి సంజయ్, ఎమ్మెల్యే ఎం. రఘునందన్‌రావుల మధ్య కొంత గ్యాప్ ఉండడంతో ఈ సమావేశంలోనూ అది బయట పడినట్టు తెలిసింది. దీంతో ఆయన సమావేశం మధ్య నుంచే వెళ్లిపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆగస్టు 1 నుంచి ఉద్యమ కార్యాచరణ...

➤ శుక్రవారం రాత్రి పొద్దుపోయే దాకా సాగిన రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రజాసమస్యలపై ఉధృతంగా ఉద్యమించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ సర్కారు అవినీతి, అక్రమాలు, సీఎం కేసీఆర్ వైఫల్యాలు, హామీల అమల్లో వైఫల్యంపై ప్రధానంగా కార్యాచరణను రూపొందించుకోవాలని భావించారు. తొలిసారిగా కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కోర్ కమిటీ భేటీలో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. అందరినీ కలుపుకుని ముందుకెళ్తూ బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. అలాగే ముఖ్యనేతలు ఎవరొచ్చినా.. దళితవాడల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. బీఆర్ఎస్ సర్కారు వారికి చేసిన మోసాన్ని తెలియజేసేలా చైతన్యం తీసుకురావాలని తీర్మానించారు. బీజేపీ మాత్రమే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని ఓడించగల దనే విశ్వాసం ప్రజల్లో బలంగా ఉందని.. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ.. మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపట్టాలని కోర్ కమిటీ సమావేశంలో తీర్మానించారు.

వందరోజుల్లో ఏం చేద్దాం?

- పార్టీ నేతల నుంచి బీజేపీ అభిప్రాయ సేకరణ
- చేయాల్సిన కార్యక్రమాలు, సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలు సూచించాలని విజ్ఞప్తి
- సమావేశంలో పాల్గొన్న ప్రకాశ్ జవదేకర్, బన్సల్, కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఇంద్రసేనారెడ్డి, ప్రకాశ్ జవదేకర్, సునీల్ బన్సల్

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సర్కార్‌ను ఓడించేందుకు అనుసరించాల్సిన వ్యూహం ఖరారుపై బీజేపీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోను న్నట్టు పార్టీ నాయకత్వం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో రాబోయే వంద రోజుల్లో ఎలాంటి వ్యూహాలు, కార్యాచరణ చేపడితే బావుంటుందనే దానిపై అభిప్రాయసేకరణ చేపట్టింది. గత 2, 3 ఏళ్లలో పార్టీలో చేరిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మె ల్యేలు, మాజీ చైర్ పర్సన్లు, ఇతర నాయకులతో రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ శనివారం పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీపరంగా చేపట్టాల్సిన కార్య క్రమాలు, ముఖ్యమైన సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై సూచించాలని వీరు కోరినట్టు తెలిసింది. బీఆర్ఎస్ నుంచి వెలమ, కాంగ్రెస్ నుంచి రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం అభ్యర్థులను ప్రకటించే అవకాశమున్నందున, రాష్ట్రంలో అధికశాతం ఓటర్లను ఆకర్షించేలా బీసీ నేతను బీజేపీ సీఎం అభ్యర్థిగా ముందుగానే ప్రకటించాలని కొందరు సూచించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పలు సందర్భాల్లో కేసీఆర్ సర్కార్ అవినీతిపై, ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత ప్రమేయంపై బీజేపీ అగ్ర త్రయం మోదీ, అమిత్ షా, నడ్డా తీవ్ర విమర్శలు చేసి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తప్పుడు సంకేతాలిస్తున్నట్టు కొందరు నేతలు ప్రస్తావించినట్టు తెలిసింది. ఈ విషయంపైనే కిందిస్థాయిలో ఎక్కువగా తమను ప్రశ్నిస్తున్నారని చెప్పినట్టు సమాచారం. దీనిపై చర్యలు ఉండాలంటూ సూచించగా, వారు చేసిన సూచనలను ముఖ్యనేతలు పరిగణనలోకి తీసుకున్నట్లు చెబుతున్నారు.

ఏ పని బాగా చేస్తారో చెప్పండి...

తాము ఇక్కడే అందుబాటులో ఉంటామని, వ్యక్తిగతంగా ఎవరైనా వచ్చి తమ అభిప్రాయాలు చెప్పవచ్చని జవదేకర్, బన్సల్ పేర్కొన్నట్టు తెలిసింది. ఎన్నికల్లో పోటీకి ఆసక్తిలేని వారు పార్టీ కోసం తాము ఏయే రంగాల్లో, విధుల్లో బాగా పనిచేయగలరో చెబితే వారికి ఆయా బాధ్యతలు అప్పగిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తాను అందుబాటులో లేకపోతే కార్యాలయంలోనే ఉండే సీనియర్‌నేత నల్లు ఇంద్రసేనారెడ్డికి చెప్పొచ్చన్నారు. పార్టీ గ్రాఫ్ పడిపోయిందని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని, నేటికి కూడా బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయంగా ఉందని మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పినట్టు తెలిసింది. తాను పార్టీలో చేరాక మూడేళ్లకు ఇలాంటి సమావేశానికి తొలిసారి పిలిచారని ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పేర్కొన్నట్టు తెలిసింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, గరికపాటి మోహన్‌రావు, డా.జి.విజయరామారావు, మర్రి శశిధర్‌రెడ్డి, కపిలవాయి దిలీప్‌కుమార్, కుంజా సత్యవతి, మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వంతోనే ప్రజల జీవితాల్లో మార్పు

- ముఖ్యమంత్రి కేసీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర నేతలు



సాక్షి, హైదరాబాద్: రైతు ప్రభుత్వం ఏర్పడితేనే దేశ ప్రజల జీవితాల్లో పూర్తి మార్పు సాధ్యమవుతుందని భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్రాలకు అను గుణంగా దేశ పాలకులు నిర్ణయాలు తీసుకోనంత వరకు అభివృద్ధి సాధ్యం కాదన్నారు. మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడుతూ.. తాగు నీరు, సాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించేందుకు తెలంగాణలో ఎంతో కష్టపడి విధానాలు రూపొందించామన్నారు. రాష్ట్రం కాళేశ్వరం ఫలితాలు అందుకుంటోందని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ కూడా త్వరలో పూర్తవుతుందని చెప్పారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన మహారాష్ట్ర నేతల అభిప్రాయాలను కేసీఆర్ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు.

ఇలాంటి అద్భుతాన్ని చూడలేదు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అద్భుతమని, తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని పార్టీలో చేరిన నేతలు వెల్లడించారు. దళితబంధు, సాగునీరు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు.బీఆర్ఎస్‌లో చేరిన వారిలో అహ్మద్‌నగర్ జిల్లా శ్రీరాంపూర్ మాజీ ఎమ్మెల్యే భానుదాస్ కాశీనాథ్ ముర్కుటేతో పాటు అశోక్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్లు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ కీలక భేటీ

- గాంధీభవన్‌లో సమావేశం కానున్న రాజకీయ వ్యవహారాల కమిటీ
- బస్సు యాత్ర, ప్రియాంక సభ, ఇతర పార్టీల నుంచి చేరికలపై చర్చ
- త్వరలోనే మేనిఫెస్టో కమిటీతోపాటు మరికొన్ని కమిటీలను ప్రకటించనున్న ఏఐసీసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల భేటీ ఆదివారం జరగనుంది. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చించేందుకు గాను ఆదివారం సాయంత్రం 4 గంటలకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) గాంధీభవన్‌లో సమావేశం కానుంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, పీఏసీ కన్వీనర్ షబ్బీర్‌అలీ, ఇతర సభ్యులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సుయాత్ర, ఇతర పార్టీల నుంచి నేతల చేరికలు, ప్రియాంకా గాంధీ హాజరు కానున్న కొల్లాపూర్ సభ అంశాలే ప్రధాన ఎజెండాగా ఈ భేటీ జరుగుతుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

బస్సుయాత్రపై నిర్ణయం

రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలందరూ ఐక్యంగా ఉన్నామని చాటేందుకు గాను రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నేతలతో కలిసి బస్సుయాత్ర చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ యాత్ర విధివిధానాలను ఖరారు చేసుకోవడంతో పాటు ఎప్పుడు యాత్ర చేపట్టాలనే దానిపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే స్థాయి నేతలు పార్టీలో చేరేందుకు మొగ్గుచూపుతున్న నేపథ్యంలో వారి చేరికలకు సంబంధించిన చర్చ కూడా జరగనుంది. దీంతో పాటు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చేరిక సందర్భంగా ఈనెల 30న కొల్లాపూర్‌లో జరిగే సభకు హాజరు కావాలంటూ పార్టీ అధిష్టానాన్ని టీపీసీసీ ఇప్పటికే కోరింది. ఈ సభ ఏర్పాట్లపై కూడా సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం.

నేడు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తోన్న తెలంగాణ ఉద్యమకారులు నేడు సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ ఉద్యమకారులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై చర్చిస్తారు. రాష్ట్ర సాధన ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీని వేదికగా చేసుకుని ఎలా పనిచేయాలన్న దానిపై ఈ సమావేశంలో కార్యాచరణ రూపొందిస్తారని నిర్వాహకులు చెబుతున్నారు.

పొన్నంకు చైర్మన్ పదవి?



మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర స్థాయిలో ఏర్పా టు చేసే ఓ కమిటీకి చైర్మన్‌గా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ఏఐసీసీ నియమించిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ)లో చోటు లభించకపోవడంతో పొన్నం కొంత అసంతృప్తితో ఉన్నారన్న వాదనలు విని పిస్తున్నాయి. అయితే ఆయనకు కమిటీ చైర్మన్ హోదా ఇవ్వాలన్న ఆలోచనతోనే పీఈసీ సభ్యునిగా చేర్చలేదనే చర్చ గాంధీభవన్‌లో జరుగుతోంది. పార్టీ మేనిఫెస్టో, కోఆర్డినేషన్, ఎలక్షన్ మేనేజ్‌మెంట్, ఏఐసీసీ కార్యక్రమాల అమలు, శిక్షణ, మీడియా కమిటీలను ఏఐసీసీ ప్రకటించాల్సి ఉంది. ఈ కమి టీల్లో ఏదో ఒక కమిటీకి సీనియర్ నేత పొన్నంను చైర్మన్‌గా ప్రకటించే అవకా శాలు కనిపిస్తున్నాయి. కాగా, ఈ కమిటీ లను మరో వారం, పది రోజుల్లోగా ఏఐసీసీ ప్రకటిస్తుందన్న చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

26% డైట్ చార్జీలు పెంపు..

- ప్రతిపాదనలపై సీఎం సంతకం
- ఈనెల నుంచే గురుకుల విద్యాసంస్థల్లో అమలు
- ప్రభుత్వంపై ఏటా రూ.237.24 కోట్ల భారం
- 7.5 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని రకాల గురుకులాలతో సహా పలు శాఖలకు అనుబంధంగా నడుస్తున్న హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం 26% పెంచింది. డైట్ చార్జీల పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సబ్ కమిటీ ప్రతిపాదనలను ఆమోదిస్తూ సీఎం కేసీఆర్ శనివారం రాష్ట్ర సచివాలయంలో సంతకం చేశారు. పెరిగిన డైట్ చార్జీలు జూలై నుంచి అమలులోకి రానున్నాయి.

- గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమం, వెనకబడిన తరగతులు సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాలతో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకులాల్లోని 7.5 లక్షల మంది విద్యార్థులకు డైట్ చార్జీల పెంపుతో ప్రయోజనం చేకూరనుందని సీఎం కేసీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.237.24 కోట్ల అదనపు భారం పడనున్నా లెక్కచేయకుండా విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సన్నబియ్యం అన్నంతో చక్కటి భోజనాన్ని ఇప్పటికే అందిస్తున్నామన్నారు. ఇప్పుడు మరింత గొప్పగా భోజన వసతులను కల్పించేందుకే డైట్ చార్జీలు పెంచామని ఈ సందర్భంగా కేసీఆర్ వెల్లడించారు.

డైట్ చార్జీల పెంపు నిర్ణయంపై మంత్రులు హర్షం

సాక్షి, హైదరాబాద్: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో సంక్షేమ విద్యార్థుల డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



పెరిగిన డైట్ చార్జీలు ఇలా.. (నెలకు రూ.ల్లో)

క్రసంఖ్య	తరగతులు	ప్రస్తుత చార్జీలు	పెరిగిన చార్జీలు
1	3-7	950	1,200
2	8-10	1,100	1,400
3	11- పీజీ వరకు	1,500	1,875



	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
కడెం ప్రాజెక్టు, నిర్మల్ జిల్లా	700	696



	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
మత్తడి వాగు, ఆదిలాబాద్ జిల్లా	910.4	908



	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
జూరాల, గద్వాల జిల్లా	1,044.68	1,041.43



	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
శ్రీశైలం, నాగర్‌కర్నూల్ జిల్లా	885	808.8



	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
మూసీ ప్రాజెక్టు, నల్లగొండ జిల్లా	645	642.2



	పూర్తి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
నాగార్జునసాగర్, నల్లగొండ జిల్లా	590	517

నీటి మట్టం అడుగుల్లో..



ఏ రాజు దరిద్రులకు సత్యముగా న్యాయము తీర్చునో
ఆ రాజు సింహాసనము నిత్యముగా స్థిరపరచబడును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.పంచమి ఉ.7.54 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఉత్తర సా.4.55 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.1.59 నుండి 3.40 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.48 నుండి 5.42 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.04 నుండి 10.43 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జె.పి. నడ్డా (బీజేపీ అధ్యక్షుడు)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

తొలిరోజు పార్లమెంటు సమావేశాలు మొదలైన కాసేపటికే కిషన్ రెడ్డి నుండి నాకు ఫోన్ కాల్ వచ్చింది! కిషన్ రెడ్డి ఉండేది లోక్‌సభలో. నేనుండేది రాజ్యసభలో.

"జీకే.. ఏమైంది! మణిపుర ఇన్సిడెంట్ గురించైతే మనం బ్రేక్‌లో మాట్లాడుకోవచ్చు కదా.." అన్నాను.

"నేను లోక్‌సభలో లేను నడ్డాజీ.. హైదరాబాద్‌లో ఉన్నాను.." అన్నాడు జీకే!

"హైదరాబాదా! సరే, నేనే నీకు బ్రేక్‌లో ఫోన్ చేస్తాలే.." అని కాల్ కట్ చేశాను.

కిషన్ రెడ్డి సెంట్రల్ మినిస్టర్. టూరిజం, కల్చర్, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి... ఈ మూడు శాఖలూ ఆయనవే. మణిపుర కూడా ఈశాన్య రాష్ట్రమే కనుక అక్కడ జరుగుతున్న ఘోరాతిఘోరాలకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేస్తానని చెప్పడానికేమైనా ఫోన్ చేసి ఉంటాడా! మణిపుర ఘటనపై మోదీజీ ఆల్రెడీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాక, కిషన్ రెడ్డి కూడా ఎందుకు తన రాజీనామాతో పార్టీని దిగ్భ్రాంతి పరచడం?!

బ్రేక్‌లో బయటికి వచ్చాక కిషన్ రెడ్డికి కాల్ చేయడానికి ఫోన్ తీశాను. మిస్డ్ కాల్స్!



అన్నీ కిషన్ రెడ్డి నుంచే!! వెంటనే ఫోన్ చేశాను. లిఫ్ట్ చేయలేదు. మళ్లీ చేశాను. మళ్లీ ఎత్తలేదు. ఏమై ఉంటుంది?! కిషన్ రెడ్డి కాస్త మెతక. సంజయ్‌లా స్ట్రాంగ్ కాదు. సంజయ్ కేసీఆర్‌ను కేసీఆర్ అనగలడు. కిషన్ రెడ్డి కేసీఆర్‌ను 'కేసీఆర్ గారు' అని మాత్రమే అనగలడు.

బ్రేక్ తర్వాత తిరిగి రాజ్యసభ లోపలికి వెళుతుంటే తెలంగాణ బీజేపీ లోక్‌సభ ఎంపీలు ఎదురయ్యారు. "కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారట నడ్డాజీ.." అని చెప్పారు!

"అరెస్టు చేసి?" అని అడిగాను.

"విడిచి పెట్టారట.." అన్నారు.

ఆ అరెస్టుకు, విడిచి పెట్టడానికి మధ్యలో కిషన్ రెడ్డి కాల్స్ నేను, నా కాల్స్ కిషన్ రెడ్డి మిస్ అయినట్లున్నాం!

రెండో రోజు ఉదయాన్నే మళ్లీ కిషన్ రెడ్డి నుండి నాకు కాల్ వచ్చింది!

"చెప్పు జీకే! డబుల్ ఇళ్లు ఎంతవరకు వచ్చాయో చూడ్డానికి వెళితే కేసీఆర్ నిన్న అరెస్ట్ చేయించాడట కదా.. ఈరోజు ఎక్కడికి వెళుతున్నావ్?" అని పెద్దగా నవ్వాను.

కిషన్ రెడ్డి కూడా నవ్వాడు.

"నడ్డాజీ! ఉదయాన్నే చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్‌కి వెళుతున్నా. అక్కడి నుంచి బషీర్‌బాగ్‌లో కనకదుర్గ టెంపుల్. ఆ తర్వాత అంబర్‌పేట జ్యోతీరావు పూలే స్టాచ్యూ. తర్వాత ట్యాంక్ బండ్ అంబేడ్కర్ స్టాచ్యూ. ఆ తర్వాత అసెంబ్లీ ఎదురుగా అమర వీరుల స్మారక స్తూపం.. అక్కడి నుంచి నాంపల్లిలో మన పార్టీ ఆఫీసుకి.." అని చెప్పాడు.

అప్పుడు గుర్తొచ్చింది నాకు జీకేని తెలంగాణ పార్టీకి అధ్యక్షుడిని చేశాం కదా అని! నాకింకా మైండ్‌లో సంజయే ఉన్నాడు.

"మంచిది జీకే! నువ్వేమిటో కేసీఆర్‌కి చూపించాలి.." అన్నాను.

"అలాగే నడ్డాజీ! నేనేమిటో కేసీఆర్ గారికి చూపిస్తాను" అన్నాడు!!

బెస్టాఫ్ లక్ చెప్పాక, ఫోన్ పెట్టేయబోతుంటే గుర్తొచ్చి.."అవును జీకే... నిన్న ఎందుకు ఫోన్ చేశావు, ఇవాళ ఎందుకు ఫోన్ చేశావు?" అని అడిగాను.

"నడ్డాజీ! నిన్న ఎందుకు ఫోన్ చేశానో, ఈరోజూ అందుకే ఫోన్ చేశాను. నిన్న చెప్పడానికి కుదర్లేదు. ఈరోజూ కుదరదేమో అనుకున్నా.." అన్నాడు నవ్వుతూ.

"చెప్పు జీకే.." అన్నాను.

"నడ్డాజీ! తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీకి ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఉన్నారు. ఎంతకాదన్నా కాంగ్రెస్సే ఇక్కడ మన శత్రువు కాబట్టి కాంగ్రెస్‌ను ఓడించాలంటే మనకు ఐదుగురు కాకున్నా కనీసం ఒక వర్కింగ్ ప్రెసిడెంట్ అయినా ఉండాలి. అది చెప్పడానికే మీకు ఫోన్ చేశాను.." అన్నాడు!

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిషన్ రెడ్డి ఎవర్ని అడగబోతాడో నాకు తెలుసు.

అందుకే 'ఎవర్ని తీసుకుంటావ్ జీకే?' అని నేను అడగలేదు.

నా దేశం నగ్నదేహమా?

జనతంత్రం



వర్ధెల్లి మురళి



అర నిమిషం నిడివి కూడా లేని ఆ వీడియో అణు విస్ఫోటనాన్ని తలపించింది. కోటానుకోట్ల మనసుల్ని షాక్‌కు గురిచేసిన ఆ విద్యుదావేశాన్ని కొలవడానికి వోల్టేజీ లెక్కలు సరిపోకపోవచ్చు. క్రోధం, దుఃఖం, అవమానం, అసహ్యం, భయం వగైరాలన్నీ సునామీ కెరటాల్లా గుండెల లోతుల్లోంచి దూసుకొస్తున్నాయి. మణిపురలో జరిగిన బర్బర క్రీడను కోట్ల గొంతుకలు ఖండిస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ వార్తాసంస్థలన్నీ ఈ అమానుషాన్ని ప్రముఖంగా ప్రకటించాయి. ఒక్క బీబీసీని అయితే బెదిరించగలిగాం కానీ ఇంతమందిని బెదిరించడం సాధ్యం కాలేదు. కనుక ఈ వార్త అందరికీ తెలిసిపోయింది. ప్రపంచం నివ్వెరపోయింది.

మూకదాడులు చెలరేగిన ప్రతిచోటా మహిళల దేహాలు శత్రువుల చేతుల్లో ఆయుధాలుగా మారుతూనే ఉన్నాయి. చిత్రవధల రచనకు క్యాన్వాస్‌లవుతూనే ఉన్నాయి. ఈ ధోరణి మణిపురలో మాత్రమే ప్రారంభం కాలేదు. మణిపురతో అంతమూ కాదు. మూకదాడుల్లో తమ ప్రాబల్య విస్తరణ పరమార్థమున్న రాజకీయ శక్తులున్నంతకాలం మణిపురలు మండుతూనే ఉంటాయి. మానవత్వం కాలుతూనే ఉంటుంది. మణిపుర అల్లర్లను కేవలం మైతేయ్ (ఓబీసీ), కుకీ (ఎస్టీ)ల ఘర్షణగానే చూడాలా? అంతకు మించిన వృత్తాంతమున్నదా?

అందుబాటులో ఉన్న సమాచారం మేరకు మణిపుర జనాభాలో 53 శాతం మంది మైతేయ్ తెగవారు. వీరు ప్రధానంగా సారవంతమైన ఇంఫాల్ లోయభూముల్లోనే నివసిస్తున్నారు. కొండ ప్రాంతాల్లో నివసించే నాగా, కుకీ జాతులవారు 40 శాతం వరకు ఉంటారు. మిగిలినవారు చిన్నచిన్న గిరిజన తెగలు. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన హిందువులు, ముస్లింలు. గిరిజన తెగల్లో అత్యధికులు క్రైస్తవులు. మైతేయ్‌ల్లో అత్యధికులు హిందువులు. మహాభారతంలోని బభ్రువాహనునికి వారసులమని వారి విశ్వాసం.

అర్జునుడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు తిరుగుతూ తిరుగుతూ అక్కడకు చేరుకొని రాజకుమారి చిత్రాంగద ప్రేమలో పడతాడు. వీరికో కుమారుడు. వాళ్లనక్కడే వదిలేసి అర్జునుడు తన మానాన తాను వెళ్లిపోతాడు. యుద్ధం ముగిసి ధర్మరాజు చక్రవర్తి అయిన తర్వాత అశ్వమేధ యాగం చేస్తాడు. అశ్వాన్ని మణిపుర ప్రాంతం రాజకుమారుడు బభ్రువాహనుడు బంధిస్తాడు. రక్షణగా వెళ్లిన అర్జునుడిని కూడా ఓడించి గాయపరుస్తాడు. అదే ప్రాంతంలో ఉండే అర్జునుడి మరో భార్య ఉలూచి అనే నాగినికి విషయం తెలిసి నాగమణి ప్రభావంతో అర్జునుడిని కాపాడుతుంది. కథ సుఖాంతమై ఇద్దరు భార్యలతో అర్జునుడు హస్తినకు చేరుకుంటాడు. ఈ కథ యథాతథంగా వ్యాసభారతంలో లేదట! రవీంద్రనాథ్ టాగోర్ రాసిన ఒక నాటకంలో ఈ ఉదంతం ఉన్నదట! తెలుగు, కన్నడ భాషల్లో 'బభ్రువాహన' పేరుతో సినిమాలు కూడా వచ్చాయి. ఇందులో ఆసక్తికరమైన విషయమేమిటంటే చిత్రాంగదది మైతేయ్ (మణిపురి) తెగ. ఉలూచిది నాగా తెగ. ఇప్పుడీ రెండు తెగలవారు అక్కడ గణనీయంగా ఉన్నారు.

చిత్రాంగద గొప్ప యోధ. ఆమె తండ్రి చిత్రవాహనుడికి మగ సంతానం లేనందువలన ఆమెకు యుద్ధ విద్యల్లో తర్ఫీదునిస్తాడు. ఆమె శిక్షణలోనే రాటుదేలిన బభ్రువాహనుడు తండ్రినే ఓడిస్తాడు. నిన్న మొన్నటి ఈరోమ్ షర్మిల వరకు మణిపురి మహిళల సాహస స్వభావం మనకు కనిపిస్తూనే ఉన్నది. ఈశాన్య రాష్ట్రాల్లో అమలులో ఉన్న సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పీఏ) ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ 16 సంవత్సరాల పాటు ఈరోమ్ షర్మిల నిరాహారదీక్ష చేశారు. ఒక దశలో ఇంఫాల్ లోయ ప్రాంతాన్ని (ఎక్కువగా మైతేయ్‌లు నివసించే ప్రాంతం) చట్ట పరిధి నుంచి మినహాయించి ఈరోమ్‌ను దీక్ష విరమించాలని ప్రభుత్వం కోరింది. కొండ ప్రాంతాల్లోని గిరిజన తెగలు ఇంకా చీకటి చట్టం మాటున మగ్గుతుండగా తాను ఎట్లా ఉద్యమాన్ని విరమిస్తానని ఈరోమ్ ప్రశ్నించింది. ఆమె మైతేయ్ తెగ మహిళ.

స్వభావ సిద్ధంగా ప్రజల మధ్య విభజన లేదు. చీకటి చట్టం మాటున మన సాయుధ జవాన్లు అన్ని తెగల మీద తమ దాష్టీకాన్ని ప్రయోగించారు. మహిళల మీద అత్యాచారాలు ఒక అలవాటుగా మార్చుకున్నారు. ధాంజోమ్ మనోరమ అనే మహిళను పారా మిలటరీ జవాన్లు సామూహిక అత్యాచారం చేసి చంపేయడం అన్ని తెగల మహిళల్నీ కదిలించింది. కొందరు మహిళలు నగ్నంగా వీధుల్లోకి వచ్చి 'ఇండియన్ ఆర్మీ... రేప్ అజ్' అనే బ్యానర్‌తో ప్రదర్శన చేసిన ఘటన, ఇరవయ్యేళ్లు గడిచినా ఇంకా వెన్నాడుతున్న పీడకలగానే మిగిలిపోయింది.

తెగల మధ్య సహజంగా ఉండే చిన్నచిన్న వైరుధ్యాలు సెగలు గక్కే శత్రు వైరుధ్యాలుగా పరిణమించవలసిన అవసరం లేదు. ఆ అవసరం కొన్ని సంకుచిత శక్తులకున్నది. మంటల్లో చలికాచుకునే రాజకీయ శక్తులకున్నది. సంఘాన్ని మెజారిటీ – మైనారిటీలుగా విడగొట్టి మెజారిటీ పక్షాన పేటెంట్ హక్కు రాసుకొనే స్వార్థ వర్గాలకున్నది. మైనారిటీల మీద మూకదాడులకు మెజారిటీలను ఉసిగొలిపే వ్యూహకర్తలకున్నది. ఈ మూకదాడులు క్షణికావేశాలు కావనీ, ప్రణాళికాబద్ధమేనని బిల్కిస్ బానో ఉదంతం మనకు చాటి చెప్పింది. గుజరాత్ అల్లర్లలో ఆమె కుటుంబ సభ్యులందరినీ అల్లరిమూక చంపేసింది. ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. ఆమె ధైర్యంగా పట్టుదలతో హంతకుల మీద కేసు నడిపింది. వారికి శిక్ష పడింది. శిక్షాకాలం పూర్తి కాకముందే స్వాతంత్య్ర దినోత్సవ వేళ ఆ హంతకులు రాచమర్యాదలతో విడుదలయ్యారు. వారికి స్వాతంత్య్ర సమరయోధుల కంటే మిన్నగా స్వాగత సత్కారాలు లభించాయి.

తెగల మధ్య సహజంగా ఉండే చిన్నచిన్న వైరుధ్యాలు సెగలు గక్కే శత్రు వైరుధ్యాలుగా పరిణమించవలసిన అవసరం లేదు. ఆ అవసరం కొన్ని సంకుచిత శక్తులకున్నది. మంటల్లో చలికాచుకునే రాజకీయ శక్తులకున్నది. సంఘాన్ని మెజారిటీ – మైనారిటీలుగా విడగొట్టి మెజారిటీ పక్షాన పేటెంట్ హక్కు రాసుకొనే స్వార్థ వర్గాల కున్నది. మైనారిటీల మీద మూకదాడులకు మెజారిటీలను ఉసిగొలిపే వ్యూహకర్తలకున్నది. ఈ మూకదాడులు క్షణికావేశాలు కావనీ, ప్రణాళికాబద్ధమేనని బిల్కిస్ బానో ఉదంతం మనకు చాటి చెప్పింది. గుజరాత్ అల్లర్లలో ఆమె కుటుంబ సభ్యులందరినీ అల్లరిమూక చంపేసింది. ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. ఆమె ధైర్యంగా పట్టుదలతో హంతకుల మీద కేసు నడిపింది. వారికి శిక్ష పడింది. శిక్షాకాలం పూర్తి కాక ముందే స్వాతంత్య్ర దినోత్సవ వేళ ఆ హంతకులు రాచమర్యాదలతో విడుదలయ్యారు. వారికి స్వాతంత్య్ర సమరయోధుల కంటే మిన్నగా స్వాగత సత్కారాలు లభించాయి. ఈ ఘటన నేర్పుతున్న పాఠమేమిటి? మణిపుర ఘటనలు 'డబుల్ ఇంజన్' సర్కార్ నిర్వాకమని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. అది తప్పు. అక్కడున్నది 'ట్రిపుల్ ఇంజన్ సర్కార్'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనిపించే ఇంజన్‌లయితే కనిపించని ఆ మూడో ఇంజనే పరివార్... సంఘ్ పరివార్! ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో ముఖ్యంగా గిరిజన తెగల్లో క్రైస్తవ ప్రాబల్యం పెరుగుతుండడంతో పరివార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. వారి వ్యూహం ఫలించడం మొదలైంది. కాషాయ పార్టీ అక్కడ బలం పుంజుకున్నది.

ఈ ఘటన నేర్పుతున్న పాఠమేమిటి?

మణిపుర ఘటనలు 'డబుల్ ఇంజన్' సర్కార్ నిర్వాకమని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. అది తప్పు. అక్కడున్నది 'ట్రిపుల్ ఇంజన్ సర్కార్'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనిపించే ఇంజన్‌లయితే కనిపించని ఆ మూడో ఇంజనే పరివార్... సంఘ్ పరివార్! ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో ముఖ్యంగా గిరిజన తెగల్లో క్రైస్తవ ప్రాబల్యం పెరుగుతుండడంతో పరివార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. వారి వ్యూహం ఫలించడం మొదలైంది. కాషాయ పార్టీ అక్కడ బలం పుంజుకున్నది. మణిపుర అల్లర్లు ఎలా మొదలయ్యాయి? ఒక మైతేయ్ మహిళను కుకీ తెగవారు రేప్ చేశారని ఒక ఫేక్ వార్త దావానలంగా వ్యాపించింది. క్షణాల్లో అటువంటి వార్తలను ప్రచారంలో పెట్టగల ప్రావీణ్యం ఎవరికి ఉంటుంది. ఆ యూనివర్సిటీ ఎవరి అధీనంలో ఉన్నదో అందరికీ తెలిసిన విషయమే. వార్త ప్రచారమైందే తడవుగా వేల సంఖ్యలో మైతేయ్ ప్రజలు గుంపులు గుంపులుగా కుకీ గ్రామాల మీద పడ్డారు. ఒక్కరోజులోనే ఒక వర్గానికి చెందిన వందకు పైగా ప్రార్థనాలయాలు ధ్వంసమయ్యాయంటే, ప్రార్థనలు చేయించేవారిని వెతికి పట్టుకొని దాడులు చేశారంటే మనకు బోధపడుతున్న వాస్తవమేమిటి? అదే వరసలో ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి దిగంబరంగా పరేడ్ చేయించారు. వారితో జుగుప్సాకరంగా ప్రవర్తించారు. అడ్డుకోబోయిన ఒక అమ్మాయి సోదరుని, తండ్రిని చంపేశారు. ఆ ముగ్గురిలో ఒకరు ఆర్మీ జవాన్ భార్య. దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాడు. దేశాన్ని కాపాడాడు. తన భార్యను మాత్రం కాపాడుకోలేకపోయానని విలపిస్తున్నాడు.

దేశాన్ని మెజారిటీ, మైనారిటీలుగా విడగొట్టడంలో మన పరివారం గణనీయమైన విజయాలే సాధించింది. మెజారిటీ వర్గాన్ని రంజింపజేయగల చక్కెరపూత భావజాలాన్ని అది సృష్టించగలిగింది. అదే నేటి ఆధిపత్య భావజాలం. దేశం మీద పెత్తనం చేస్తున్నది. ఈ ఆధిపత్య భావజాలానికి మైనారిటీల మీద, నిమ్న జాతుల మీదనే చిన్నచూపు కాదు. జనాభాలో సగభాగమైన మహిళల మీదా చిన్నచూపే! దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ వేదికల మీద జాతీయ పతాకాల్లా ఎగరేసిన క్రీడాకారుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో ఈ దేశం గమనించింది. వాళ్లను అవమానించి వేధించినవాడు దర్జాగా పార్లమెంట్‌లో కూర్చుంటున్నాడు. ఆధిపత్య భావజాలంతో రెచ్చిపోతున్న నికృష్ట మూకలు నగ్నదేహాలతో ఆటలాడటాన్ని కూడా దేశం చూసింది. నేటి మన ఆధిపత్య భావజాలపు ప్రధాన వ్యూహం టార్గెట్ వర్గాలపై అసత్య ప్రచారాలు చేసి ఏకాకుల్ని చేయడం, వారంతా భూతాలు, ప్రేతాలు, పిశాచాలు అనే భయాన్ని సమాజంలో కలిగించడం! చేతబడి అనే సాకు చూపి ఒక కుటుంబాన్ని ఊరంతా కలిసి చంపేయడాలు మనకు తెలిసిందే కదా! అదిగో ఆ మూఢత్వానికే మన వాళ్లు జాతీయ హోదా కల్పించారు. ఇప్పుడా చేతబడి ప్రచారాన్ని కుకీల మీద చేస్తున్నారు. వారంతా పరాయి దేశం వాళ్లట. లవ్ జిహాద్, గోహత్య వగైరా వగైరా చేతబడి వ్యూహాలతో ఎల్లకాలం నెట్టుకురావడం సాధ్యం కాకపోవచ్చు. ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' ఘటన గుర్తున్నది కదా! నాటి యూపీఏ ప్రభుత్వాన్ని చెత్త కుప్పలోకి విసిరేయడంలో చోదకపాత్ర పోషించిన ఉదంతం. మణిపుర మహిళల నగ్న పరేడ్ అంతకంటే చిన్న విషయమేమీ కాదు. దాని ప్రకంపనలు ఇప్పుడప్పుడే సద్దుమణగవు. నా దేశం నగ్న దేహం కాదు. అది నవచైతన్య పతాకం.

vardhelli1959@gmail.com

వారు స్త్రీలు మాత్రమే కాదు!

అభిప్రాయం



కె.ఎన్. మల్లీశ్వరి

దేశం నివ్వెరపోయింది. ఆ మహిళ దేహం మీద నిర్భీతిగా, నిర్లజ్జగా, నిస్సంకోచంగా పాకిన ఆ మగ చేతిని చూసి ప్రజానీకం నిస్సహాయ క్రోధంతో వణికిపోతున్నారు. మణిపుర కుకీ గిరిజన తెగకి చెందిన ముగ్గురు క్రిస్టియన్ మహిళలను నగ్నంగా మార్చి, ఊరేగించి, అందులో ఒకరిని అత్యాచారం చేసిన ఘటన తాలూకు వీడియో ఇపుడు దేశంలో అనేకమందిని కలవరానికి లోను చేస్తోంది. సోషల్ మీడియా అందరికీ అందుబాటులోకి వచ్చాక స్త్రీలను, దళిత, గిరిజనులను వివస్త్రలను చేసి చితకబాదడం, చంపడం వంటి వీడియోలు అడపాదడపా వైరల్ అవుతూ ఉన్నాయి. నచ్చిన దుస్తులు వేసుకోవడం, నచ్చిన చోట్లకి వెళ్ళడం, నచ్చిన వారితో కలిసి గడపడం, ఇష్టమైన ఆహారం తినడం తప్పుగా మారిపోయాయి. ప్రేమలు, పరువులు, చేతబడుల వంక బెట్టి వారి శరీరాలను దారుణంగా హింసించడం – వీటన్నిటికీ పీడిత వర్గాల పట్ల సమాజానికి ఉన్న తక్కువ భావనే తక్షణ కారణం అయి ఉండొచ్చు. కానీ చాలా సందర్భాల్లో వేరే బలమైన కారణాలు ఉంటాయి.

గుజరాత్‌లో ముస్లిం జాతి హనన మారణకాండలో వేలాది స్త్రీలమీద మూకుమ్మడి అత్యాచారాలు చేయడం, ప్రాబల్య కులాల స్త్రీలు కూడా దగ్గరుండి ప్రోత్సహించడం సమీప చరిత్ర. నగ్నదేహాలతో, రోడ్డున దొరికే చిత్తుపాతలు కప్పుకుంటూ ప్రాణాలు కాపాడుకోవడానికి పోలీస్ స్టేషన్లకు పరుగులు పెట్టిన గుజరాత్ ముస్లిం మహిళల గురించి అనేక నివేదికలు తెలియజెప్పాయి. ఇప్పుడు మణిపురలో జరుగుతున్నది సారంలో గుజరాత్‌కి భిన్నం కాదు. అక్కడ ముస్లింలు అయితే ఇక్కడ గిరిజన క్రిస్టియన్లు. ఇటువంటి సందర్భాలకి ప్రతిస్పందించే విషయంలో మనం చాలాసార్లు చేసే పొరపాటు – బాధితులను జండర్‌కి మాత్రమే కుదించి చూడడం. మణిపుర ఘటన వెనుక మతం, రాజకీయ ప్రయోజనాలతో పాటు ఆర్థిక అంశాల పాత్ర తిరుగులేనిది.

కులమైనా, మతమైనా, దేశమైనా– సమాజంలోని ఏ ప్రధానమైన అంశంలోనయినా బలమైన వర్గం బలహీన వర్గంపై దాడి చేయాలంటే అందుకు అనువుగా దొరికేది ముందుగా స్త్రీలు. వారి ద్వారా ప్రత్యర్థి వర్గం మీద పైచేయి సాధించడం ఆటవిక సమాజాల స్వభావం. అదిప్పటికీ సాగుతూనే ఉంది. అయితే ఏ స్త్రీలు ప్రధానంగా బాధితులు అన్నది గ్రహించడం చాలా ముఖ్యం. పై మహిళల విషయానికి వస్తే వారి చుట్టూ కొల్లగొట్టదగిన ఖనిజ సంపదలు ఉన్నాయి కనుక, వారు కుకీ తెగ గిరిజనులు కనుక, వారు క్రిస్టియన్లు కనుక, ఈ అస్తిత్వాలు మైనార్టీ కనుకనే వారి మీద వందలాదిగా తరలి వచ్చి దాడి చేశారు. వందల, వేల గుంపులు కూడి సాగించే దాడులలో ప్రధానంగా కులమో, మతమో, వర్గమో, దేశభక్తో ఉండి తీరుతుంది. ఆయా కక్షలు తీర్చుకోవడానికి స్త్రీలను వాహికలుగా ఉపయోగించుకుంటారు. ఈ ఘటనలో నగ్నంగా ఊరేగించిన తమ స్త్రీలను కాపాడుకోవడానికి ప్రయత్నించిన ఒక తండ్రిని, అతని కొడుకుని విద్వేషకారులు చంపేయడం చూస్తే అక్కడి మైనార్టీలకి మాత్రమే సంపదలు ఒనగూడుతున్నాయన్న తీవ్ర ద్వేషం కనపడుతుంది.

ఇటువంటి ఘటనలలో గుర్తించవలసిన మరొక విషయం – దాడులు సాగించినవారే కాస్త సమయం చూసుకుని తమ ప్రతాపాలను వీడియోల రూపంలో సోషల్ మీడియాకి ఎక్కించడం. మూకుమ్మడిగా దాడి చేయడం వల్ల తమ ఉనికి తెలీదన్న ధీమా, తప్పొప్పుల విచక్షణ ఏ కోశానా లేకపోవడం, కులం, మతం, వర్గం, స్థానిక ప్రభుత్వాల దన్ను తమకు ఉంటుందన్న అహం అణువణువూ నిండిపోవడం, పై పెచ్చు ఇవన్నీ విజయ సంకేతాలుగా భావించడం – యథా రాజా తథా ప్రజ. ప్రభుత్వం ఈ వీడియోను అన్ని మాధ్యమాల నుంచి తొలగించే పని సత్వరం చేయడానికి కారణం ప్రజల భావోద్వేగాల పట్ల అక్కర కొద్దీ కాదు... ఎన్నికల ముందు తటస్థులను దూరం చేసుకోకూడదన్న విజ్ఞత వల్ల మాత్రమే!


ఇక మెల్లిగా 'ఉరిశిక్ష రాగం' గొంతు సవరిస్తోంది. ఆ మహిళలకు న్యాయం జరగాలంటే ఉరిశిక్ష వేస్తామని ఒక పెద్దాయన సెలవిచ్చాడు. మరి వందల మందికి, ఆ మహిళలని మూకకి అప్పగించి చూస్తూ నిలబడిన పోలీసులకి ఉరితాళ్ళు సిద్ధం చేస్తున్నారా సారూ! ఈ సారైనా మనం 'ఉరి' ఉచ్చులో చిక్కుకోకూడదు. రగిలే గుండెలకీ, భయంతో వణికే మనసుకీ అటువంటి శిక్ష కాస్త సాంత్వననూ, ధైర్యాన్నీ ఇవ్వొచ్చు. అక్కడికి దుష్ట శిక్షణ జరిగిందని ఊపిరి పీల్చుకోవచ్చు. కానీ మన బాధ్యత అక్కడితో తీరేది కాదు. అందరూ ప్రభుత్వాలతో తలపడే ఆచరణలోకి దిగలేకపోవచ్చు. కనీసంగానైనా మనమేం చేయాలి?

లోకపు రీతుల పట్ల మనం ఏర్పరుచుకునే అవగాహన, భవిష్యత్ నాయకుల ఎంపికకు మార్గాన్ని చూపుతుందని నమ్మాలి. దాడి చేసినవారిలో అనువుగా దొరికిన ఒకరిద్దరిని ఉరితీసి, ప్రజల కోరికని మన్నించిన వీరుల్లా ఛాతీ విరుచుకు నిలబడే అసలు దొంగలను గుర్తించాలి. మణిపురలో కుకీ జాతి హనన మారణకాండకు వెనకుండి అండదండలు అందించిన శక్తులను ముందుగా మనం గుర్తించాలి. సొంత ప్రజల మధ్యనున్న వర్గ, సామాజిక వైరుధ్యాలను అవకాశవాదంతో పక్కన పెట్టి, సాంస్కృతిక, రాజకీయ భిన్నత్వపు సౌందర్యాన్ని ధ్వంసం చేసి, 'జాతీయ' రహదారి మీద ఏకతా యాత్ర చేస్తున్న బుల్డోజర్‌కి అందరమొక్కటై ఎదురుగా నిలబడాలి. నిలబడదాం రండి!

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే

కవిత్వం ఎలా రాయాలి!

కవిత



ప్రతిష్ఠా పాండ్యా

కొంచెం సిగ్గుపడమని చెప్పకు నాతో
నోరు అదుపులో పెట్టుకోమనీ చెప్పకు

నీ కవితా సాంప్రదాయాల వలువలు
ఒక్కటొక్కటిగా విప్పేస్తున్నాను
వాక్యాలు, పదబంధాలు, యతి విరామాలూ,
నుడుగులు, లయలు, ఛందస్సులు, ప్రాసలు,
అనుప్రాసలు, విరామ విన్యాసాలు

నీ పాపపంకిల ఓనమాలను
నా ఎద నుంచి చీరేస్తున్నాను

నా తొడల మధ్య గాయాలను
కప్పిపుచ్చుతున్న శప్త ప్రతీకలను
తోసి అవతల పారేస్తున్నాను


అవును,
నీ నాగరిక వీధుల్లో
నిర్లజ్జగా,
నగ్నంగా,
రక్తమోడుతూ తిరుగుతున్నది
నేనే!

ఏయ్, నోర్ముయ్!
గొంతు తగ్గించమని చెప్పకు నాతో

విను!
నేను గొంతు చించుకుని చేస్తున్న
నా ఆర్తనాదాన్ని,
నా పొలికేకనూ,
నా గర్జననూ,
నా విస్ఫోటననూ

చూడు!
ఈ పుణ్యభూమిలో నేను పక్కపక్కనే పేర్చిన
ఈ ముతక, క్షతగాత్ర,
ఛిద్ర పదాల బారును చూడు,
ఇవి చెరచబడ్డ మహిళల నగ్నదేహాలు,
ఇవి కుకి–జూమి, మైతేయి, దళిత,
క్రైస్తవ, ఆదివాసీ, హిందు,
ముస్లిం మహిళల నగ్నదేహాలు

కవిత్వం ఎలా రాయాలో
నేర్పించవద్దు నాకు ఇవాళ!



మూలం (ఆంగ్లం): ప్రతిష్ఠా పాండ్యా
తెలుగు: అనంతు చింతలపల్లి

ప్రతిష్ఠా పాండ్యా ఆంగ్ల, గుజరాతీ కవయిత్రి. పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా(పరి)లో సంపాదకురాలిగా, అనువాదకురాలిగా పనిచేస్తున్నారు.

How to write poetry

Don't tell me to have some shame
Don't tell me to rein my tongue
I am stripping off all your poetic conventions
One by one.. lines, hemistich, caesura,
stanza, rhythm, meter, rhyme,
alliteration, enjambment...
I am tearing off your bloody Alphabet
from my chest
I am pulling away the cursed metaphors
covering the wounds between my thighs
Yes, I am roaming your civilized streets
shameless and naked, bleeding....
Oh, shut up!
Don't tell me to keep my voice down.
Hear me...
Hear me scream, howl, roar, explode,
ululate in high pitched trills
Watch me
make these raw, wounded,
mangled words lie stretched out
on this pristine ground
like naked bodies of raped women —
kuki-zomi, meitei,
dalit, christian, adivasi, hindu, muslim...
all next to each other.
Don't teach me
how to write poetry today.

ఏది వృద్ధి? ఏది క్షయం?

మానవాళి మనుగడకు, అనగా భవిష్యత్తులో రాబోయే తరాల మనుషుల సుఖ జీవనానికి ఏది మంచిదో, ఏది చెడుగా పరిణమిస్తుందో నిర్ణయించడం ఎలా అన్న ధర్మ సందేహానికి సమాధానం అవగతమయ్యేలా చేయడానికే అన్నట్లుగా వ్యాసులవారి మహాభారతం, ఉద్యోగ పర్వం, 39వ అధ్యాయంలో 6వ శ్లోకం ఉంది. 'న వృద్ధిర్బహు మన్తవ్యా యా వృద్ధిః క్షయమావహేత్/ క్షయోపి బహుమన్తవ్యోయః క్షయో వృద్ధిమావహేత్' అనగా, 'ఏది వృద్ధి? ఏది క్షయం? అని తర్కించుకున్నపుడు రెండు ముఖ్యమైన విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతంలో జరుగుతున్నదిగా కనబడుతున్న ఏ అభివృద్ధి వలన భవిష్యత్తులో వినాశనం జరగడానికి అవకాశం ఉంటుందో, అది వృద్ధి కాదు. దానిని క్షయంగానే నిర్ణయించుకోవాలి. అలాగే ప్రస్తుతంలో ఏది క్షీణించిపోవడం, నశించిపోవడం వలన భవిష్యత్తులో మానవకోటికి ఎక్కువగా ఉపయోగం జరిగే అవకాశం ఉంటుందో అది క్షయం అనిపించుకోదు, దానినే నిజమైన వృద్ధికి కారణంగా నిర్ణయించుకుని ఆచరణలో పెట్టాలి' అని పై శ్లోకం భావం. ఒక సందర్భంలో విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పిన మాటలలో ఒకటి పై శ్లోకం.



జ్యోతిర్మయం

ఈ సూత్రానికి, ధర్మసూక్ష్మానికి దృష్టాంతంగా అన్నట్లుగా, అంతకు ముందు శ్లోకంలోనే విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పిన మాటలు ఉంటాయి. భవిష్యత్తులోకి చూడగలిగే శక్తి ఉన్న ఋషితుల్యులైన వ్యక్తులు, మంచి చెడులను బాగా ఆలోచించి, చెప్పే మాటలను వినకపోవడం వలన మానవకోటికి ఎంత అనర్థం జరుగుతుందో తెలియజెప్పేవై ఆసక్తిని రేకెత్తించేవిగా ఉంటాయి ఆ శ్లోకంలోని మాటలు. 'ఉక్తం మయా జాతమాత్రేపి రాజన్/దుర్యోధనం త్యజ పుత్రం త్వమేకమ్/తస్య త్యాగాత్ పుత్రశతస్య వృద్ధి/రస్యాత్యాగాత్ పుత్రశతస్య నాశః' అనగా, 'దుర్యోధనుడు పుట్టినప్పుడే నీకు నేను చెప్పాను – కేవలం ఈ ఒక్కడినీ నువ్వు త్యాగం చెయ్యి, వందమంది పుత్రుల వృద్ధి నీకు అవుతుంది. ఈ ఒక్కడినీ త్యాగం చేయక పోవడం వలన నీకు వందమంది పుత్రుల నాశనం జరుగుతుంది' అని ఆ శ్లోకంలోని మాటల భావం. ముందు చూపుతో విదురుడు చెప్పిన మాటను ధృతరాష్ట్రుడు వినలేదు. ఫలితంగా దుర్యోధనుడితో పాటుగా మిగతా వందమంది పుత్రులనే కాకుండా, ఇరువైపుల నుండి మొత్తం 18 అక్షౌహిణుల సైన్యం హతమయ్యే మహావినాశనానికి కారణం అయ్యాడు.

– భట్టు వెంకటరావు

కొత్త సీజే జస్టిస్ అలోక్ ప్రమాణం నేడు

- రాజ్‌భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రమాణం చేయించనున్న గవర్నర్
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- తెలంగాణ హైకోర్టుకు ఆరో సీజేగా రాక



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జస్టిస్ అలోక్ అరాధేతో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఇటీవల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై వెళ్లడంతో ఆయన స్థానంలో జస్టిస్ అలోక్ అరాధే ఇక్కడికి రానున్నారు. ఈమేరకు కొలీజియం సిఫార్సులకు కేంద్ర న్యాయ శాఖ గత వారం ఆమోదం తెలుపుతూ గెజిట్ నోటిఫికేషన్ వెలువరించిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన తర్వాత 6వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ బాధ్యతలు చేపడతారు.

కర్ణాటక నుంచి తెలంగాణకు...

మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ అలోక్ అరాధే 1964, ఏప్రిల్ 14న రాయ్‌పూర్‌లో జన్మించారు. బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశాక 1988లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2007లో సీనియర్ న్యాయవాది అయ్యారు. మధ్యప్రదేశ్ హైకోర్టులో రాజ్యాంగం, మధ్యవర్తిత్వం, కంపెనీ చట్టాలకు సంబంధించిన కేసులు వాదించడంలో పేరు గడించారు. 2009 డిసెంబర్ 29న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016, సెప్టెంబర్ 16న జమ్మూకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అదే హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా చేశారు. 2018, నవంబర్ 17న కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. అక్కడ కూడా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా చేశారు.

నాలుగేళ్లలో ఆరో సీజే

ఏపీ తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజన 2019, జనవరి 1న జరిగింది. తెలంగాణ హైకోర్టు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ఐదుగురు సీజేలుగా పనిచేశారు. నాలుగేళ్ల కాలంలో సీజేలుగా జస్టిస్ రాధాకృష్ణన్, జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పనిచేశారు. జస్టిస్ అలోక్ అరాధే ఆరో సీజే కానున్నారు. వీరిలో జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పదోన్నతిపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా వెళ్లారు.

రూ.2 లక్షల కోట్లు కేటాయించండి

- బీసీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచండి
- కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి
- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌తో బీసీ నేతల చర్చలు


హంసరాజ్ గంగారాంకు వినతి పత్రం ఇస్తున్న కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా రాజ్యాంగ బద్ధమైన సంస్థగా జాతీయ బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాంను ఢిల్లీలో కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, దేశంలోని 75 కోట్ల మంది బీసీల సంక్షేమానికి కేంద్రం బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించడం దారుణమన్నారు. విద్యారంగానికి రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మన్ హంసరాజ్ గంగారాం హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. ఈ చర్చలలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ జి.కృష్ణ, నందగోపాల్, కర్రి వేణుమాధవ్, రాజ్ కుమార్, జోషి రాఘవ, భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మంచిర్యాలలో ఎన్‌ఐఏ తనిఖీలు

- ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకుడిని విచారించిన అధికారులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు రహస్యంగా పర్యటించినట్లు సమాచారం. అధికారుల బృందం అకస్మాత్తుగా పర్యటించడం, ఇటీవల మావోయిస్టు పార్టీ అగ్రనేతల అరెస్టుల నేపథ్యంలో మంచిర్యాలలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. మంచిర్యాల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులకు నెలక్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించినట్లు అందిన సమాచారం మేరకు ఆస్పత్రి నిర్వాహకుడిని ఎన్‌ఐఏ అధికారులు విచారించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ శాఖలో తహసీల్దార్ స్థాయి అధికారి ఒకరు కూడా మావోయిస్టులకు సహాయం అందించినట్లు తెలిసింది. మూడు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులకు డబ్బులు సరఫరా చేస్తుండగా కరీంనగర్‌కు చెందిన కొందరు కాంట్రాక్టర్లు, మంచిర్యాలకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి భూపాలపల్లి జిల్లా పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన మావోయిస్టు అగ్రనేతల అరెస్టుల అనంతరం ఎన్‌ఐఏ అధికారులు పలు ఆస్పత్రుల్లో సోదాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. కాగా, ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా 'ఎన్‌ఐఏ అధికారులు వచ్చినట్లు తెలిసింది. కానీ, తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు'అని తెలిపారు.

ఆగస్టు 15 వరకు ఒక పంపు ద్వారా తాగునీరు

- 'పాలమూరు'ప్రాజెక్టు సీఈ అమీద్‌ఖాన్ వెల్లడి


పంప్‌హౌస్‌లో ప్రాజెక్టుల సలహాదారు పెంటారెడ్డి, సీఈ అమీద్‌ఖాన్ తదితరులు

కొల్లాపూర్ రూరల్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులోని మొదటి లిఫ్టు నుంచి ఒక పంపు ద్వారా ఆగస్టు 15వ తేదీ వరకు ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు అందిస్తామని ఆ ప్రాజెక్టు సీఈ అమీద్‌ఖాన్ తెలిపారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని ప్యాకేజీ–1 నార్లాపూర్ పంపుహౌస్‌లో ఉన్న ప్యానల్ బోర్డుకు కరెంట్ చార్జింగ్‌ను ప్రాజెక్టు సలహాదారు పెంటారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని బోర్డులకు రోజుకు ఒకటి చొప్పున చార్జింగ్ ఇస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం అన్ని పనులను పూర్తిచేస్తామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 12 ప్యాకేజీలు ఉండగా వాటిలో నార్లాపూర్ మొదటి ప్యాకేజీ దగ్గర రెండు పంపులను పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పాలమూరుకు సంబంధించి అన్ని రిజర్వాయర్లు, పంపుహౌస్‌ల పనులు కూడా పూర్తి కావొచ్చాయన్నారు. ఇక్కడ 10 మోటార్లు ఉన్నా తాగునీటి అవసరాల దృష్ట్యా రెండింటిని పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఈ శ్రీరామ్‌నాయక్, డైరెక్టర్లు సూర్యప్రకాశ్, జగత్‌రెడ్డి, డీఈలు అమర్‌సింగ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యూ కట్టిన ఎన్నా'రైస్'!

అమెరికాలో 9 కిలోల రైస్ బ్యాగ్ రూ. 3,854

- సన్నాల ఎగుమతులపై కేంద్రం నిషేధంతో రేట్లు అమాంతం పెంచేసిన అక్కడి స్టోర్లు
- 16–18 డాలర్ల బస్తా ధర 47 డాలర్ల వరకు విక్రయం
- బియ్యం కొరత భయంతో స్టోర్లకు పోటెత్తిన ఎన్నారైలు
- ఎటుచూసినా భారీ క్యూలు.. అవసరానికి మించి కొనుగోళ్లు




టెక్సాస్‌లోని హరేలీ ఫ్రెష్ మార్కెట్లో ఒకరికి 10 రోజుల వ్యవధిలో ఒక బ్యాగే విక్రయిస్తామంటూ పెట్టిన నోటీసు ● డాలస్‌లో ఓ స్టోర్ వద్ద బారులు తీరిన జనం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రానున్న పండుగల సీజన్‌లో దేశీయంగా బియ్యం ధరలను అదుపులో ఉంచడంతోపాటు భవిష్యత్తులో ఆహార కొరత లేకుండా చూసేందుకు కేంద్రం విదేశాలకు బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. అమెరికా తదితర దేశాల్లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా అమెరికాలోని రిటైల్ ఔట్‌లెట్లు ఎన్నారైలతో కిటకిటలాడుతున్నాయి. తెలుగువారు ఎక్కువగా నివసించే డాలస్, అట్లాంటా, కాలిఫోర్నియా తదితర ప్రాంతాల్లోని స్టోర్ల దగ్గర భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. సోనామసూరి రకం బియ్యానికి కొరత ఏర్పడుతుందన్న భయంతో పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో నిషేధానికి ముందు వరకు 9.07 కిలోల బ్యాగ్‌ను 16–18 డాలర్ల (రూ.1,312 –1,476)కు విక్రయించిన స్టోర్ల నిర్వాహకులు తాజాగా దాదాపు మూడు రెట్లు అధికంగా 47 డాలర్ల (రూ. 3,854) వరకు బ్యాగ్‌ను విక్రయిస్తున్నారు. కొన్ని స్టోర్ల యజమానులు బియ్యం బ్యాగ్‌ల కొనుగోలుపై పరిమితి విధించగా మరికొందరు నిర్ణీత మొత్తంలో ఇతర వస్తువులు కొన్న వారికే బియ్యం బ్యాగ్‌లు విక్రయిస్తామని తేల్చిచెబుతున్నారు.

ఆరు నెలలకు సరిపోవచ్చు..: భారత్ నుంచి నెలకు సగటున బాస్మతీయేతర బియ్యం 6,000 మెట్రిక్ టన్నులు యూఎస్‌ఏకు ఎగుమతి అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఇందులో తెలంగాణ, ఏపీ వాటా 4,000 మెట్రిక్ టన్నులు ఉంటుందని సమాచారం. 'యూఎస్‌ఏలో ప్రస్తుతం సుమారు 12,000 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని తెలుస్తోంది. అలాగే భారత్ నుంచి 18,000 మెట్రిక్ టన్నుల బియ్యం యూఎస్‌ఏకు రవాణాలో ఉంది. ఈ నిల్వలు ఆరు నెలలకు సరిపోవచ్చు' అని ఎగుమతిదారులు చెబుతున్నారు. కేంద్రం నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లో సుమారు రూ.8,200 కోట్ల విలువైన 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించే ఒప్పందాలను రద్దు చేసుకొనే పరిస్థితి తలెత్తిందని వ్యాపారులు అంటున్నారు. ప్రపంచ బియ్యం ఎగుమతుల్లో భారత్ వాటా ఏకంగా 40 శాతం ఉంది. నెలకు 5 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతీయేతర బియ్యం భారత్ నుంచి వివిధ దేశాలకు సరఫరా అవుతోంది.

ఫర్నిచర్ కొంటే బియ్యం ఫ్రీ

బియ్యం కొరతను ఆసరా చేసుకొని డీఆర్ హోర్టన్ అనే అతిపెద్ద గృహ నిర్మాణ సంస్థ అమెరికాలోని 29 రాష్ట్రాల్లోని 90 మార్కెట్లలో అప్పటికప్పుడు స్పెషల్ ఆఫర్ ప్రకటించింది. 'మీకు సోనా మసూరి దొరకడం లేదా? మేం మీకు సహాయం చేస్తాం. మావద్ద హోమ్ ఫర్నిచర్ కొంటే.. 15 లిబ్రా (ఎల్‌బీ–0.45 కేజీలు)ల సోనా మసూరి బియ్యం ఉచితంగా ఇస్తాం' అంటూ ఆఫర్ మొదలెట్టేసింది.

సోనామసూరిని మినహాయించాలి..



యూఎస్‌ఏ లోని భారతీయులు సోనా మసూరి బియ్యం అధికంగా వాడతారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నిషేధం నుంచి సోనామసూరిని ప్రభుత్వం మినహాయించాలి. – కిరణ్‌కుమార్ పోల, డైరెక్టర్, డెక్కన్ గ్రెయింజ్ ఇండియా

అవగాహన లేనివాళ్లే ఎక్కువ కొంటున్నారు..



భారత్ నుంచి సన్న బియ్యం ఎగుమతుల నిషేధం శాశ్వతం కాదు. కొద్ది రోజుల్లో అంతా సర్దుకుంటుంది. మార్కెట్, సరఫరా, డిమాండ్‌పై అవగాహన లేనివాళ్లే అవసరానికి మించి బియ్యం కొంటున్నారు. – జ్యోతి ముదునూరి, ఎన్నారై, న్యూజెర్సీ

పొద్దున్నే పరుగుపెట్టాం..



సోనామసూరి బియ్యం కొరత భయంతో స్టోర్లకు పొద్దున్నే పరుగుపెట్టాం. బ్రౌన్, రెడ్ రైస్, చైనా రైస్ దొరుకుతున్నా మేం తినేది సోనామ సూరీయే. కొందరు వారి బంధువులు, స్నేహితుల కోసం కూడా కొనుగోలు చేస్తున్నారు. – శ్రీధర్ నూగూరి, ఎన్నారై, అగస్టా (జార్జియా స్టేట్)

ప్రత్యేక కోడ్‌తో అనుమతించాలి



ఎగుమతులపై నిషేధంతో విదేశాల్లో బియ్యం ధరలు పెరగొచ్చు. భారతీయులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక హెచ్ఎస్ఎన్ కోడ్ కింద సోనా మసూరి రకాల ఎగుమతికి కేంద్రం అనుమతించాలి. – బీవీ కృష్ణారావు, అధ్యక్షుడు, జాతీయ బియ్యం ఎగుమతిదారుల సంఘం

ఆగస్టు 7న తిరుపతిలో 'ఓబీసీ' మహాసభ

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం గ్రౌండ్‌లో ఆగస్టు 7న బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని దోమలగూడలో ఉన్న బీసీ భవన్‌లో వివిధ బీసీ సంఘాల నేతలతో కలిసి సమావేశం నిర్వహించి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ దేశంలో మొదటి సారిగా బీసీలకు విద్యారంగంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు వీపీ సింగ్ ప్రకటించిన రోజు అయిన ఆగస్టు 7వ తేదీని 'బీసీ మండల్ డే'గా వ్యవహరిస్తూ ఏటా మండల్ డే సందర్భంగా పలు రాష్ట్రాల్లో అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేశ్‌చారి, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌కురుమ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షు రాలు మనిమంజరి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌యాదవ్ తది తరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె ఉధృతం: జేఏసీ

సాక్షి, హైదరాబాద్: తమ సమ్మెను ఉధృతం చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ నిర్ణయించింది. శనివారం మంత్రుల నివాస ప్రాంగణంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పీఆర్ శాఖ అధికారులతో జేఏసీ నేతలు జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. గత 17 రోజులుగా జరుగుతున్న జీపీ సిబ్బంది సమ్మెలో భాగంగా.. ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది. సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఎర్రబెల్లిని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ కోరిన నేపథ్యంలో శనివారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కాగా, పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అమెరికా పర్యటన నుంచి తిరిగి రాగానే చర్చలు కొనసాగిద్దామని మంత్రి చెప్పినట్టు జేఏసీ నేతలు వెల్లడించారు. మంత్రి చేసిన సూచనలపై శనివారం సాయంత్రం జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించారు. కాగా, గతంలో పలు సందర్భాల్లో ప్రభుత్వం కార్మికుల ఆందోళనలు, సమ్మెల సమయంలో ఇచ్చిన హామీలను అనంతరం అమలు చేయకుండా విస్మరించిన ఘటనలు అనేకం ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో సమ్మెను ఉధృతం చేయాలని నిర్ణయించారు. మొత్తం డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు సమ్మెను యధాతథంగా కొనసాగించాలని తీర్మానించారు.

గల్ఫ్‌లోనూ బియ్యం ధరలకు రెక్కలు

మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్ దేశాల్లోనూ బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఖతర్, ఒమన్, కువైట్, ఇరాక్ తదితర దేశాల్లో ఒక్క రోజు వ్యవధిలోనే ధరలు పెరిగాయి. బియ్యం నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. మరోవైపు సన్నాల ఎగుమతులపై కేంద్రం నిషేధంతో పారా బాయిల్డ్ బియ్యం మాత్రమే విక్రయించడానికి అవకాశం ఉందని, దీనివల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని గల్ఫ్‌లో స్థిరపడిన తెలంగాణ వ్యాపారులు చెబుతున్నారు. సన్న రకాల్లోని బీపీటీ, హెచ్‌ఎంటీ రకాలు సోనామసూరి పేరుతో గల్ఫ్‌కు ఎగుమతులు సాగుతున్నాయి. ఈ రకాలకు గల్ఫ్ దేశాల్లో రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు ధర లభిస్తోంది. ఎగుమతులపై నిషేధం విధించడంతో క్వింటాలుకు రూ.400కుపైగా ధర పెరిగింది. యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఖతర్, ఒమన్, కువైట్, ఇరాక్ తదితర దేశాల్లో ఉండే తెలుగువారు, ఇతర రాష్ట్రాల వారి కోసం ఇక్కడి నుంచి వలస వెళ్లిన వారితోపాటు విదేశీ వ్యాపారులు బియ్యం అమ్మకాలను కొనసాగిస్తున్నారు. తెలంగాణ సోనామసూరి పేరుతో వివిధ కంపెనీల బ్రాండ్‌లను విక్రయిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి వలస వెళ్లినవారు 25 లక్షల మంది ఉంటారని అంచనా. వారికి అవసరమైన బియ్యం ఎగుమతులు ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి సాగుతున్నాయి.

పర్యాటక కేంద్రంగా దాశరథి బందిఖానా

- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి
- ప్రముఖ కవి నటేశ్వరశర్మకు దాశరథి పురస్కారం ప్రదానం


నటేశ్వరశర్మకు పురస్కారం అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: నిజాం నిరంకుశ పాలన నుంచి ఈ ప్రాంత విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి కృష్ణమాచార్యను బంధించిన ఖిల్లా జైలును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం ఇక్కడి రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన దాశరథి 99వ జయంతి వేడుకల్లో మంత్రి మాట్లాడారు. నాటి పాలకులు నిజామాబాద్ ఖిల్లా జైలులో దాశరథిని బంధించగా, జైలు గోడలపైనే ఆయన ధిక్కారగీతాలు రాశారని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విపక్షాల నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రగతిని కవులు, కళాకారులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం పండితకవి అయాచితం నటేశ్వరశర్మకు దాశరథి పురస్కారం, లక్ష రూపాయల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు జూలూరు గౌరీశంకర్, మంత్రి శ్రీదేవి, దీపికారెడ్డి, అయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ శనివారం దర్శించుకున్నారు.

24న అంగప్రదక్షిణ టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి అంగప్రదక్షిణ టికెట్లు, శ్రీవాణి ట్రస్టు దాతలకు దర్శనం, గదులకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను ఈ నెల 24న ఉదయం 10, 11 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా అక్టోబర్ నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న విడుదల చేయనుంది.

పోర్న్ వీక్షణం వల్లే...

- పిల్లలపై లైంగిక వేధింపులు అధికమయ్యాయన్న కైలాష్ సత్యార్థి
- డీజీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులను ఉద్దేశించి ప్రసంగం



సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న సాంకేతికత, సమాచార విప్లవంతో ఇంటర్నెట్‌లో పోర్న్ వీడియోలు, బూతు సాహిత్యం విపరీతంగా అందుబాటులో ఉంటోందని, పిల్లలపై లైంగిక వేధింపులు అధికం కావడానికి ఇదే ప్రధాన కారణమని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత బాలలను పోలీసులు వారి పిల్లలుగా భావించి పకడ్బందీగా దర్యాప్తు చేసినప్పుడే దోషులకు శిక్షపడుతుందన్నారు. శనివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కైలాష్ సత్యార్థి... డీజీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లల అక్రమ రవాణా వ్యవస్థీకృతమైన, అత్యంత బలమైన మూలాలున్న నేరంగా ఉందని కైలాష్ సత్యార్థి పేర్కొన్నారు. ఈ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసులు అమలు చేస్తున్న విధానాలతో గణనీయమైన ఫలితాలు లభిస్తున్నాయని ప్రశంసించారు. మహిళలు, పిల్లల అక్రమ రవాణాను అరికట్టడంలో తెలంగాణ పోలీసుల పాత్ర దేశంలోనే ఆదర్శప్రాయంగా నిలుస్తోందని కితాబిచ్చారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు అనంతరం రాష్ట్రంలో పిల్లలు, మహిళల భద్రతకు రాష్ట్రం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిచ్చిందని, ఇందులో భాగంగా అదనపు డీజీ స్థాయి అధికారి నేతృత్వంలో మహిళా భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేసిందని వివరించారు. అదనపు డీజీ మహేష్ భగవత్ మాట్లాడుతూ కైలాష్ సత్యార్థి కృషి వల్లే తప్పిపోయిన పిల్లల అంశంపై ఎఫ్ఐఆర్‌ల నమోదు ప్రారంభమైందని, ఆ తర్వాత అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. అనంతరం పోలీసు అధికారులు కైలాష్ సత్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీలు శిఖా గోయల్, సౌమ్యా మిశ్రా, సంజయ్ కుమార్ జైన్, ఐజీలు విక్రమ్‌జిత్‌సింగ్ మాన్, షానవాజ్ ఖాసీంతోపాటు రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి భయాన్ని వీడాలి

రాయదుర్గం: ప్రతి విద్యార్థి తమకున్న ప్రతిబంధకాలు, చింతలు, భయాలన్నింటినీ వీడి ఆత్మవిశ్వాసంతో పోటీ ప్రపంచంలోకి అడుగు పెట్టాలని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి పిలుపునిచ్చారు. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 22వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్‌తో కలిసి విద్యార్థులకు పట్టాలను, పంపిణీ చేశారు. కైలాష్ మాట్లాడుతూ కేవలం జీతాలు, ప్యాకేజీల కోసం వెంటపడకుండా నైతిక విలువలు, సేవా భావంతో జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. నారాయణన్ మాట్లాడుతూ పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు స్వంత మార్గాలను రూపొందించే నైపుణ్యాలను కలిగి ఉన్నారని తెలిపారు. డ్యూయల్ డిగ్రీతోపాటు ఉత్తమ ఆల్‌రౌండర్ అవార్డును పొందిన కందాల సవితా విశ్వనాథ్‌ను పలువురు అభినందించారు.

క్లుప్తంగా...

ఛత్తీస్‌గఢ్ బొగ్గు కుంభకోణంలో మహిళా ఐఏఎస్ అరెస్ట్




రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన బొగ్గు లెవీ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శనివారం మహిళా ఐఏఎస్ అధికారి రానూ సాహూను అరెస్ట్ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలో డైరెక్టర్‌గా ఉన్న రానూ సాహూకు అదనపు జిల్లా జడ్జి అజయ్ సింగ్ రాజ్‌పుత్ మూడు రోజుల ఈడీ కస్టడీకి అనుమతించారు. బొగ్గు కుంభకోణం కేసులో అరెస్టయిన రెండో ఐఏఎస్ అధికారి సాహూ. రాయ్‌గఢ్, కోర్బా జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆమె అక్రమాలకు పాల్పడినట్లు ఈడీ లాయర్ సౌరభ పాండే తెలిపారు. ఆమె రూ.5.52 కోట్ల విలువైన చరాస్తులను పోగేశారని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను సాహూ లాయర్ ఖండించారు. ఆమెను కల్పితమైన కారణాలతోనే అధికారులు అరెస్ట్ చేశారన్నారు.

25న మళ్లీ చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు ఈనెల 25న అయిదోసారి కక్ష్య దూరాన్ని పెంచనున్నారు. బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రం శాస్త్రవేత్తలు 25న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్యలో ఈ ఆపరేషన్ చేపట్టనున్నారు. భూమికి సంబంధించిన కక్ష్యలో ఆఖరిసారిగా చేపట్టే ఆపరేషన్‌తో చంద్రయాన్-3 భూమి నుంచి విశ్వంలో చంద్రుడ్ని చేరుకునే దిశగా ప్రయాణిస్తుంది. ఆగస్ట్ 1 నాటికి చంద్రయాన్-3 లూనార్ ఆర్బిట్ (చంద్ర కక్ష్య)కు చేరుకుంటుంది. అక్కడ నుంచి 17 రోజుల పాటు చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఆగస్ట్ 23న చంద్రునికి 30 కిలోమీటర్ల ఎత్తులో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్‌ను విడిచి పెడుతుంది. అదే రోజు సాయంత్రం ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ప్రాంతంలో చంద్రుడి ఉపరితలంపై దిగుతుంది.



లోహాల్లో పగుళ్లను సూక్ష్మస్థాయిలో పరిశోధించేందుకు ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన స్పెషలైజ్ ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ టెక్నిక్ ద్వారా లిథియం ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్న సాండియా నేషనల్ లేబొరేటరీస్ పరిశోధకుడు ర్యాన్ షోల్

ఇనుములో... హృదయం మొలిచెనా..?!

ఐశ్వర్యారాయ్ లాంటి ప్రపంచ సుందరిని అతి సమీపంలో చూసేసరికి రజనీ వంటి రోబోలో కూడా రసస్పందన కలిగింది. తట్టుకోలేని తమకంలో తలమునకలయ్యాడు. భగవంతుని ఈ సృష్టి వైచిత్రిని తలచుకుని తెగ ఆశ్చర్యపోయాడు. తనవంటి జడపదార్థంలోనూ జమకాలు పాడించిన ఆడదానికి ఓరచూపు పవరుకు పదేపదే సలాములు చేశాడు. ఇనుములో హృదయం మొలిచెనే... అనుకుంటూ డ్యుయెట్లు పాడుకుని మురిసిపోయాడు. దర్శక దిగ్గజం శంకర్ సృజన నుంచి పుట్టుకొచ్చిన ఈ సూపర్‌హిట్ సినీ ఫాంటసీ నిజ జీవితంలోనూ జరిగితే? ఇనుములో నిజంగానే హృదయం మొలిస్తే? అమెరికాలో సరిగ్గా ఇదే జరిగింది. ఓ చిన్న ప్లాటినం ముక్క తనలో పుట్టుకొచ్చిన పగుళ్లను తనంత తానుగా నయం చేసుకుంది. అదీ ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలంతా కళ్లారా చూస్తుండగా! ఈ పరిణామాన్ని అతి సూక్ష్మమైన మైక్రోస్కోప్ ద్వారా వీక్షించి వాళ్లంతా అక్షరాలా అవాక్కయ్యారు. "మా కళ్లను మేమే నమ్మలేకపోయాం. దీనికి కారణమేమిటన్నది మాకైతే అంతుబట్టడం లేదు. మానవ మేధకు బహుశా ఎప్పటికీ అంతుబట్టదేమో!"అని చెప్పుకొచ్చారు. ప్రాకృతిక నియమాలనే పూర్తిగా తలకిందులు చేయగల ఈ పరిణామం ఎలా సాధ్యమైందన్న కీలకాన్ని పట్టుకోగలిగితే ఇంజనీరింగ్ రంగంలో కనీవినీ ఎరగని విప్లవాత్మక మార్పులు ఖాయమని వారంతా ముక్త కంఠంతో అంటున్నారు. ఇప్పుడా కీలకాన్ని ఒడిసిపట్టే పనిలో తలమునకలుగా ఉన్నారు...

-సాక్షి, నేషనల్ డెస్క్

నిరంతర వాడకం తదితరాల వల్ల అరుగుదల వంటివి జరిగి యంత్రాలు పగుళ్లివ్వడం, అవి క్రమంగా పెరిగిపోయి చివరికి పాడవడం సర్వసాధారణం. ఆ మాటకొస్తే ఇది ప్రతి ఇనుప వస్తువు విషయంలోనూ జరిగేదే. నిజానికి చాలా పరిశ్రమల్లో ఈ అరుగుదల తదితరాల ఖర్చే తడిసి మోపెడవుతూ ఉంటుంది కూడా. మరి కార్లు, బస్సులు, భారీ ఇంజన్లు, బ్రిడ్జిలు, విమానాల వంటి ఇనుప వస్తువులన్నీ తమలో తలెత్తే పగుళ్ల వంటి సమస్యలన్నింటినీ తమంతట తామే ఎప్పటికప్పుడు సరిచేసుకోగలిగితే? వాటి భద్రతపై దిగులుండదు. జీవితకాలమూ పెరుగుతుంది. అన్నింటి కంటే ముఖ్యంగా నిర్వహణ తదితర భారీ ఖర్చులన్నీ పూర్తిగా తప్పుతాయి. ఎంతగా అంటే, ఒక్క అమెరికాలోనే ఏటా వేలాది కోట్ల డాలర్లు ఆదా అవుతాయని ఈ పరిశోధనకు పూనుకున్న శాస్త్రవేత్తల బృందమే అంచనా వేస్తోంది! పైగా రిపేర్లు తదితరాలకు పట్టే అతి విలువైన సమయమూ పూర్తిగా ఆదా అవుతుంది! ఇప్పటికిది అందమైన ఊహే అయినా మున్ముందు నిజమయ్యే ఆస్కారం పుష్కలంగా ఉందంటున్నారు ప్రఖ్యాత అంతర్జాతీయ శాస్త్రవేత్తలు. అదే జరిగితే మౌలిక శాస్త్ర సాంకేతిక సిద్ధాంతాలన్నీ పూర్తిగా మారిపోవడం ఖాయమని కూడా చెబుతున్నారు.


పగుళ్లను తనంత తానే పూడ్చుకున్న ప్లాటినం ముక్క

- మానవ ప్రమేయం లేకుండానే జరిగిన అద్భుత ఘటన
- సంభ్రమాశ్చర్యాల్లో శాస్త్ర, సాంకేతిక ప్రపంచం
- ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు!

ఆ అద్భుతం జరిగిందిలా...

ఇనుప పరికరాల్లో అతి సూక్ష్మస్థాయిలో పగుళ్లు ఎలా మొదలవుతాయో తెలుసుకునేందుకు అమెరికాలో ఇంధన శాఖకు చెందిన సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ నానోటెక్నాలజీస్ శాస్త్రవేత్తల బృందం ఇటీవల ఓ పరిశోధన చేసింది. అందులో యాదృచ్ఛికంగా అద్భుతమొకటి జరిగింది. ఏమైందంటే...

- అమెరికాలోని శాండియా, లాస్ అలామోస్ నేషనల్ లేబొరేటరీస్, టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ సంయుక్తంగా ఈ పరిశోధనకు పూనుకున్నాయి. అతి సూక్ష్మ పరిమాణంలోని ప్లాటినం ముక్కలో పగుళ్లు మొదలయ్యే తీరును లోతుగా పరిశోధించడం దీని ముఖ్యోద్దేశం.
- కానీ తీరా ప్రయోగం మొదలైన 40 నిమిషాలకు వారు కలలో కూడా ఊహించనిది జరిగింది. ప్లాటినం ముక్క మొదలైన పగులు విస్తరించడం ఆగిపోయింది!
- ఇదేమిటా అని వాళ్లు తల బద్దలు కొట్టుకుంటుండగానే, ఆ పగులు తనంతట తానే చిన్నదవుతూ క్రమంగా పూర్తిగా పూడి కనుమరుగైపోయింది! ఎంతగా అంటే, అక్కడ పగులు వచ్చిన ఆనవాలు కూడా కనిపించలేదు!
- ఇలా మానవ జోక్యం అసలే లేకుండా ఓ లోహం తనలోని పగుళ్లను తానే పూడ్చుకోవడం మనకు తెలిసిన చరిత్రలో బహుశా తొలిసారి జరిగిందని సైంటిస్టులు చెబుతున్నారు.
- ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత జర్నల్ నేచర్‌లో ప్రచురితమయ్యాయి.



ఫొటోలో కన్పిస్తున్న ఎరుపు గుర్తులు పగుళ్లను, అవి నయమవుతున్న తీరును ఆకుపచ్చ గుర్తులు చూపిస్తున్నాయి

> లోహాల్లో పగుళ్లంటూ మొదలైతే పెరుగుతూనే పోతాయి. కానీ, అత్యంత జడమైనవిగా భావించే లోహాలకు కూడా ఇలా తమను తాము నయం చేసుకోగల స్వాభావిక సామర్థ్యం ఉందని మా పరిశోధన తేటతెల్లం చేయడం ఓ నమ్మశక్యం కాని నిజం!"
> – బ్రాడ్ బాయ్స్, మెటీరియల్స్ సైంటిస్టు, శాండియా నేషనల్ లేబొరేటరీస్

అచ్చం అతను సూత్రీకరించినట్టే...

ఇలాంటి దృగ్విషయాన్ని టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీ ప్రొఫెసర్ మైకేల్ డెంకోవిజ్ కొన్నేళ్ల క్రితమే కంప్యూటర్ సిమ్యులేషన్ల ఆధారంగా సూత్రీకరించాడు. తాజా పరిశోధన ఫలితం గురించి తెలిసి ఆయనిప్పుడు ఎంతగానో ఆనందపడుతున్నాడు. తన పాత ప్రయోగాన్ని మరోసారి చేసి చూపిస్తూ, 'అప్పట్లో నేనెలా సూత్రీకరించానో ఇప్పుడు అక్షరాలా అలాగే జరిగిం'దంటూ సంబరపడిపోతున్నాడు.

అద్భుతమే, కాకపోతే...

జరిగింది నిజంగానే మహాద్భుతమే. ఇందులో అనుమానమే లేదు. కాకపోతే లోహాల్లో అసలు ఈ 'స్వీయ వైద్యం'ఎలా సాధ్యమన్నది మాత్రం మనకు ప్రస్తుతానికి ఏమీ తెలియదు. దీన్ని ఇంజనీరింగ్, తయారీ రంగాలకు ఎలా అన్వయించుకోవాలన్నది అంతకంటే అవగాహనలోకి రాలేదు. "అతి సూక్ష్మ స్ఫటికాకార లోహంపై గాలి తదితరాల ఆనవాలు కూడా లేని పూర్తి నియంత్రిత, కృత్రిమ శూన్య పరిస్థితుల్లో ఇది జరిగింది. సాధారణ వాతావరణంలో సంప్రదాయ లోహాల్లో ఇది ఏ మేరకు సాధ్యమన్నది ప్రస్తుతానికి పెద్ద ప్రశ్నే"అని బాయ్స్ చెప్పుకొచ్చారు.

కొసమెరుపు

ఇదెలా సాధ్యపడిందన్న దానిపై నెలకొన్న అస్పష్టత, దీన్ని మనకు మేలు జరిగేలా మలచుకోవడం ఏ మేరకు సాధ్యమన్న సందిగ్ధత తదితరాలను పక్కన పెడితే ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ వంటి పలు రంగాల్లో ఈ పరిశోధన ఫలితం అతి పెద్ద ముందడుగన్నది మాత్రం నిస్సందేహం.

జ్యోతి బసు రికార్డును తిరగరాసిన నవీన్



భువనేశ్వర్: దేశంలో సుదీర్ఘ కాలం కొనసాగిన రెండో ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్ సీఎం జ్యోతి బసు పేరిట ఉన్న రికార్డును ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తిరగరాశారు. దేశంలోనే సుదీర్ఘ కాలం పాటు, 24 ఏళ్లకు పైగా అధికారంలో కొనసాగిన సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్‌కుమార్ చామ్లింగ్ మొదటి స్థానంలోనే కొనసాగుతున్నారు. ఆయన తర్వాత కమ్యూనిస్టు యోధుడు జ్యోతి బసు 1977 జూన్ 21 నుంచి 2000 నవంబర్ 5వ తేదీ వరకు 23 ఏళ్ల 137 రోజులు సీఎంగా కొనసాగారు. ఒడిశా సీఎంగా 2000 మార్చి 5న మొదటిసారిగా బాధ్యతలు చేపట్టిన నవీన్ పట్నాయక్ అయిదు పర్యాయాలు ఆ రాష్ట్రానికి సీఎంగా ఎన్నికై శనివారం నాటికి 23 సంవత్సరాల 138 రోజులు పూర్తి చేసుకున్నారు. దీంతో, చామ్లింగ్ తర్వాతి స్థానంలోకి చేరారు. పవన్ కుమార్ చామ్లింగ్, జ్యోతి బసు తర్వాత వరుసగా అయిదు పర్యాయాలు సీఎంగా ఎన్నికైన నేతగానూ నవీన్ పట్నాయక్ మూడో స్థానంలో నిలిచారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేడీ మళ్లీ విజయం సాధించి, సీఎంగా పగ్గాలు చేపట్టిన పక్షంలో నవీన్ పట్నాయక్ దేశంలోనే సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నేతగా నిలుస్తారు.

ఒక్క రోజూ స్కూలు మానకుండా... పదేళ్లకే 50 దేశాలు చుట్టింది!

లండన్: ఆ అమ్మాయి పేరు అదితీ త్రిపాఠి. వయసు పదేళ్లు. లండన్‌లో నివసిస్తున్న భారత సంతతికి చెందిన అదితి పదేళ్ల వయసుకే 50 దేశాలు చుట్టేసింది. అది కూడా ఒక్క రోజు కూడా స్కూలు మానలేదు. అదెలా సాధ్యం అనుకుంటున్నారా ? అదితి తల్లిదండ్రులైన దీపక్, అవిలాషకు దేశాలు తిరగడం, అక్కడ సంస్కృతిని తెలుసుకోవడం, కొత్త కొత్త ఆహారాన్ని రుచి చూడడం అంటే చాలా ఇష్టం. తమ కుమార్తెకు కూడా అన్ని దేశాలు చూపించాలని నిర్ణయించుకున్నారు. అందుకే ప్రతీ శుక్రవారం అదితిని స్కూలు నుంచి పికప్ చేసుకొని విమానాశ్రయానికి వెళ్లేవారు. ఆదివారం రాత్రి 11కల్లా తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకునేవారు. ఒకవేళ కుదరకపోతే సోమవారం ఉదయం ఆమెను నేరుగా పాఠశాలలో దింపేసేవారు. లాంగ్ వీకెండ్‌లు, సెలవుల్లో దూర దేశాలకు వెళ్లేవారు. అలా స్కూలు ఒక్క రోజు కూడా మానకుండా ఇప్పటివరకు 50 దేశాల్ని చూపించారు. ఈ ప్రయాణాల కోసం వారు ఏడాదికి 20 వేల పౌండ్లకు పైగా (రూ.21 లక్షలు) ఖర్చు పెడుతున్నట్టుగా చెప్పారు. ఇప్పటివరకు యూరప్ దేశాలతో పాటు థాయ్‌లాండ్, ఇండోనేసియా, సింగపూర్ దేశాలు పర్యటించారు. ఏడాదికి 12 దేశాలు తిరిగేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

రేప్ చేసి, రంపాలపై పడేసి...

ఇద్దరు యువతులపై అత్యాచారం, హత్య!

- మణిపూర్‌లో మరో దారుణం
- మహిళల్ని నగ్నంగా ఊరేగించిన మే 4వ తేదీనే ఈ ఘోరం
- 100 మందికి పైగా ఈ ఘాతుకానికి పాల్పడ్డారు
- ఫిర్యాదులో పేర్కొన్న ఓ బాధితురాలి తల్లి

ఇంఫాల్: మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటన జరిగిన రోజే అక్కడికి 40కి.మీ. దూరంలో మరో దారుణం జరిగింది. కుకి–జోమి తెగకు చెందిన ఇద్దరు యువతుల్ని సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేసినట్టుగా పోలీసు స్టేషన్‌లో నమోదైన జీరో ఎఫ్ఐఆర్ ద్వారా వెల్లడైంది. బాధిత యువతులు 21, 24 ఏళ్ల వయసున్న వారు. ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలోని కొనుంగ్ మమాంగ్ ప్రాంతంలో కార్లు వాష్ చేసేవారు. మే 4న వారు కార్లు కడుగుతూ ఉండగా అల్లరిమూక కొందరు అక్కడికి వచ్చి దౌర్జన్యంగా వారిని పక్కనే ఉన్న గదిలోకి లాక్కెళ్లారు. వాళ్లు అరవకుండా నోటికి గుడ్డలు కట్టేసి అత్యంత పాశవికంగా అత్యాచారం చేసినట్టుగా జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. ఆ తర్వాత ఆ ఇద్దరు యువతుల్ని దుండగులు పక్కనే ఉన్న రంపం మిల్లులోకి లాగి పడేశారు. రంపాల మీద పడేయడంతో వారు తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడిపోయారు. ఆ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. ఆ ఇద్దరు యువతుల్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్లడం తాము చూశామని వారి స్నేహితులు చెబుతున్నారు. మరణించిన ఇద్దరు యువతుల్లో ఒకరి తల్లి సాయికుల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపుగా 100–200 మంది దుండగులు రాక్షసంగా తమ కుమార్తె, ఆమె స్నేహితురాల్ని అత్యాచారం చేసి, హింసించి చంపేశారని ఆమె అందులో పేర్కొన్నారు.



తూర్పు ఇంఫాల్‌లో శనివారం నిరసన తెలుపుతున్న బాధిత ప్రజలు

వీడియో ఘటనలో మరో నిందితుడు అరెస్ట్

మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై అమానవీయ ఘటనలో పోలీసులు అయిదో నిందితుడిని అరెస్ట్ చేశారు. 19 ఏళ్ల వయసున్న యువకుడిని అదుపులోనికి తీసుకున్నట్టుగా పోలీసులు వెల్లడించారు. ఆ వీడియోలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

మణిపూర్‌లో వెలుగులోకి మరో భయానక ఘటన

ఇటీవల మణిపూర్‌లో జరిగిన రెండు వర్గాల ఘర్షణల్లో ఓ స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను కొందరు దుండగులు సజీవదహనం చేశారు. ఆమెను లాక్కెళ్లి ఇంట్లో తాళం వేసి నిప్పంటించారు. దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. కక్చింగ్ జిల్లాలోని సిరోయూ గ్రామంలో మే 28న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పార్లమెంటు ఆవరణలో రేపు విపక్షాల నిరసన

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రతిష్టంభన నెలకొనడంతో సభ వెలుపల నిరసనల ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించాయి. సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగనున్నాయి. ఈ మేరకు ఇండియా కూటమికి చెందిన పార్టీల ఎంపీలు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం కానున్నారు. ఆ సమావేశంలో సభలో అనుసరించే వ్యూహాలపై చర్చిస్తారు. సభలోపలికి వెళ్లడానికి ముందు ప్రధాని ప్రకటనపై డిమాండ్ చేస్తూ మహాత్మగాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగనున్నారు. మరోవైపు పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే మణిపూర్ అంశంలో చర్చ లేవనెత్తాలని టీఎంసీ డిమాండ్ చేసింది. బీజేపీ సభ్యులే సభాకార్యక్రమాలను అడ్డుకుంటున్నారని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ మండిపడ్డారు.

ఆ రాష్ట్రాలపై పెదవి విప్పరెందుకు: బీజేపీ

ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా ఎవరూ నోరు ఎందుకు మెదపడం లేదని బీజేపీ ప్రశ్నించింది. రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై నేరాలు, ఘోరాలు జరుగుతూ ఉంటే, మణిపూర్ చుట్టూ ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు.

వియత్నాంకు కానుకగా మన యుద్ధనౌక



న్యూఢిల్లీ: వియత్నాంకు భారత్ అరుదైన కానుక అందించింది. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి నిదర్శనంగా ఐఎన్ఎస్ కృపాణ్ యుద్ధనౌకను బహుమతిగా ఇచ్చింది. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఆధిపత్యంపై ఇరు దేశాల్లో నెలకొన్న ఆందోళనల్ని దృష్టిలో ఉంచుకొని తీర ప్రాంతంలో గస్తీని బలోపేతం చేయడం దీని ఉద్దేశమంటున్నారు. పూర్తి సామర్థ్యంతో పని చేసే యుద్ధ నౌకను ఒక మిత్రదేశానికి భారత్ కానుకగా ఇవ్వడం ఇదే తొలిసారని నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ వెల్లడించారు. వియత్నాం పర్యటనలో ఉన్న ఆయన శనివారం బే ఆఫ్ కామ్ రన్హ్ జలాల్లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ కృపాణ్‌ను ఆ దేశానికి అందజేశారు. పూర్తి స్థాయి ఆయుధాలతో కూడిన నౌకను ఆ దేశ నేవీకి అప్పగించినట్టు వివరించారు. భారత్ జీ20 సదస్సు ప్రధాన థీమ్ అయిన వసుధైక కుటుంబం (ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్)లో భాగంగానే ఈ కానుక ఇచ్చినట్టు తెలిపారు. ఐఎన్ఎస్ కృపాణ్ గస్తీతో దక్షిణ చైనా జలాల్లో అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా అన్ని దేశాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఎన్ఎస్ కృపాణ్ జూన్ 28న విశాఖపట్నం నుంచి బయల్దేరి జూలై 8 నాటికి వియత్నాం చేరింది.

మహారాష్ట్రలో 9 ఏళ్ల బాలుడు నరబలి

నాసిక్: నిధులు దొరుకుతాయనే కొందరి మూఢ విశ్వాసం తొమ్మిదేళ్ల బాలుడిని బలి తీసుకుంది. ఈ ఘోరం మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావ్ తాలూకా పాహనె షివార్ గ్రామంలో ఈ నెల 16న చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆరు బయట ఆడుకుంటున్న ఒక బాలుడిని నిర్బంధించి తాంత్రిక పూజల్లో భాగంగా గొంతుకోసి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని గుంతలో సగం వరకు పూడ్చిపెట్టారు. ఈ నెల 18న ఈ దారుణం వెలుగులోకి రావడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిధి దొరుకుతుందనే మూఢ నమ్మకంతో ఈ దురాగతానికి పాల్పడినట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు.. 8 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్ వ్యాప్తంగా రష్యా సాగించిన దాడుల్లో 8 మంది పౌరులు మృతి చెందగా పలువురు గాయాలపాలయ్యారు. డొనెట్స్క్‌లోని నియు–యోర్క్‌పై రష్యా సైన్యం జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. కొస్తియాంటీనివ్కాపై జరిగిన రాకెట్ల దాడిలో 20 వరకు ఇళ్లు, కార్లు, గ్యాస్ పైప్‌లైన్ ధ్వంసం కాగా ఇద్దరు మృతి చెందారు. ఒకరు గాయపడ్డారు. చెర్నిహివ్‌పై రష్యా క్రూయిజ్ మిస్సైళ్లు పడటంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. జపొరిఝియా అణు ప్లాంట్ పొరుగునే ఉన్న పట్టణంపై రష్యా దాడిలో ముగ్గురు పౌరులు గాయపడ్డారు. ఇలా ఉండగా, నల్ల సముద్రం ధాన్యం రవాణా ఒప్పందాన్ని రద్దు చేసిన రష్యా ఉక్రెయిన్ నౌకా తీర ప్రాంతం ఒడెసాను లక్ష్యంగా చేసుకుంది. రష్యా మిలటరీ ప్రయోగించిన రెండు క్రూయిజ్ మిస్సైళ్లు గిడ్డంగులపై పడటంతో మంటలు చెలరేగి పరికరాలు ధ్వంసమయ్యాయని, 120 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు బూడిదయ్యాయని ఉక్రెయిన్ తెలిపింది. క్రిమియాపై దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులకు పాల్పడినట్లు రష్యా తెలిపింది. ఈ పరిణామంపై తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగన్ స్పందించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ డిమాండ్లను పశ్చిమదేశాలు నెరవేర్చి, ధాన్యం రవాణా కారిడార్ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలని సూచించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్ చేసి మాట్లాడతానని, వచ్చే నెలలో తుర్కియేలో ఆయనతో భేటీ ఉంటుందని ఆశిస్తున్నానన్నారు. కాగా, రష్యా ఆక్రమిత క్రిమియాలో వారం వ్యవధిలో రెండోసారి డ్రోన్ పేలింది. క్రాస్నోవార్డిస్క్‌లోని ఆయిల్ డిపో, ఆయుధ గిడ్డంగిలను డ్రోన్ బాంబులతో పేల్చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. సోమవారం ఉక్రెయిన్ జరిపిన దాడిలో రష్యాను కలిపే కీలకమైన క్రిమియా వంతెన కొంతభాగం దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇలా ఉండగా, జపొరిఝియా ప్రాంతంలో ఉక్రెయిన్ శతఘ్ని కాల్పుల్లో రియా వార్తా సంస్థకు చెందిన రష్యా జర్నలిస్టు ఒకరు మృతి చెందారు.

సోషల్ మీడియా దుర్వినియోగంపై...
జర జాగ్రత్త: సీజేఐ



సాక్షి, చెన్నై: వేగంగా జనబాహుళ్యంలోకి చేరేందుకు అవకాశమున్న సామాజిక మాధ్యమాలు, అన్ని రంగాల్లోకి విస్తరించిన కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగాన్ని అరికట్టే సాంకేతికత అందరికీ అందుబాటులోకి రావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం ఐఐటీ మద్రాస్ 60వ స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మానవీయ విలువలు, వ్యక్తిగత గోప్యతలకు అత్యున్నత ప్రాధాన్యత కల్పించాలని సీజేఐ తెలిపారు. ఆధునిక సాంకేతికతను సానుకూలంగా వాడుకునేందుకు వీలుగా రక్షణలు ఏర్పాటు చేసి నిరుపాయకరమైందిగా మార్చా లన్నారు. సాంకేతికతతో వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని ప్రజలు భయపడక ముందే నమ్మకమైన వినియోగాన్ని సులభతరం చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల రాకతో సరిహద్దులు, వయస్సు, జాతీయత వంటి అవరోధాలు తొలగినప్పటికీ ఆన్‌లైన్‌లో వేధింపులు, ట్రోలింగ్ వంటివి కొత్తగా పుట్టుకొచ్చా యని సీజేఐ పేర్కొన్నారు.

జాతి క్షేమాన్ని మించిన పదవీ కాంక్ష..

గత కాంగ్రెస్ ప్రభుత్వంపై మోదీ విసుర్లు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సారథ్యంలోని గత యూపీఏ ప్రభుత్వం అధికార వ్యామోహంతో జాతి ప్రయోజనాలను పక్కనబెట్టిందని, బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలను తిరిగి గాడినపెట్టిందని చెప్పారు. శనివారం ప్రధాని మోదీ రోజ్‌గార్ మేళాను వర్చువల్‌గా ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో 70వేల మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. 'ఆ ఒక్క కుటుంబానికి సన్నిహితులైన కొందరు రాజకీయ నేతలు బ్యాంకుల నుంచి తమ వారికి వేల కోట్ల రూపాయలను ఇప్పించి, ఎప్పటికీ తిరిగి చెల్లించేవారు కాదు. అప్పట్లో జరిగిన ఫోన్ బ్యాంకింగ్ స్కాం అతిపెద్ద కుంభకోణం. అది దేశ బ్యాంకింగ్ వ్యవస్థ వెన్ను విరిచేసింది'అని ప్రధాని తెలిపారు. ఇప్పుడు అందరూ ఫోన్ బ్యాంకింగ్‌ను వాడుకుంటున్నారు. కానీ, అప్పట్లో జరిగింది వేరని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే పటిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థ ఉన్న దేశాల్లో భారత్ కూడా ఉందన్నారు. తమ ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల నిర్వహణను బలోపేతం చేయడం, బ్యాంకులను విలీనం చేయడం, ఈ రంగంలో వృత్తినైపుణ్యంను పెంచడం వంటి అనేక చర్యలతో ఇది సాధ్యమైందని వివరించారు. గతంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు వేలాది కోట్ల నిరర్థక ఆస్తులతో కునారిల్లుతూ ఉండేవి. కానీ, నేడవి రికార్డు స్థాయిలో లాభాలను ఆర్జిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించడంలో, ముద్ర వంటి వివిధ ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు శ్రమిస్తున్న తీరు, నిబద్ధతలను ఆయన కొనియాడారు.

వాతావరణ కార్యాచరణలో భారత్ ముందుంది

పణజి: వాతావరణ కార్యాచరణలో భారతదేశం ముందుండి నడిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. హరితాభివృద్ధి, ఇంధన పరివర్తన వంటి వాతావరణ పరిరక్షణ హామీలను ఒక్కటొక్కటిగా నెరవేరుస్తోందని అన్నారు. శనివారం ప్రధాని గోవాలో జరుగుతున్న జీ20 కూటమి దేశాల ఇంధన మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడారు. స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యంలో 50 శాతం మృత్తికేతర ఇంధన వనరుల నుంచి 2030నాటికి సాధించాలన్న లక్ష్యం కోసం భారత్ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. పవన, సౌర విద్యుదుత్పాదనలో సైతం అగ్రగామి దేశాల సరసన భారత్ నిలిచిందని తెలిపారు. వీటితోపాటు తక్కువ వడ్డీకే రుణాలివ్వడం ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు చేయూతనివ్వాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. 'సాంకేతికతలో అంతరాలను పూడ్చటం , ఇంధన భద్రత పెంపు, సరఫరా గొలుసుల్లో వైవిధ్యత వంటివాటి కోసం నూతన మార్గాలను అన్వేషించాల్సి ఉంది. భవిష్యత్తు ఇంధనాల కోసం సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ఇంధన భద్రతను పెంచుకునేందుకు దేశాల మధ్య గ్రిడ్లు, అనుసంధానతలపై దృష్టి సారించాలి. పరస్పరం అనుసంధానించిన గ్రీన్‌గ్రిడ్లు గొప్ప మార్పును తీసుకువస్తాయి'అని ప్రధాని మోదీ అన్నారు. వీటివల్ల వాతావరణ లక్ష్యాలు, హరిత పెట్టుబడుల సాధన, కోట్లాదిమందికి హరిత ఉద్యోగావకాశాల కల్పనకు వీలవుతుందని తెలిపారు. 'ఇంధనం లేనిదే అభివృద్ధి, భవిష్యత్తు స్థిరత్వంపై చర్చ పూర్తికాదు. వ్యక్తుల నుంచి దేశాల వరకు అభివృద్ధిలో అన్ని స్థాయిల్లోనూ ఇంధన కీలకంగా మారిందని పేర్కొన్నారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం ౹ 23 ౹ జూలై ౹ 2023



హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

కేపీహెచ్‌బీ రహదారిపై ట్రాఫిక్‌జాం



ఇంట్లోనే ఉండండి

- ప్రజల ప్రాణ రక్షణే మా ప్రథమ కర్తవ్యం
- వర్షాల నేపథ్యంలో గ్రీవెన్స్‌కు 946 ఫిర్యాదులు
- 483 శిథిల భవనాలను గుర్తించాం
- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

అత్యవసరమైతేనే బయటకు రండి

హిమాయత్‌నగర్: నగర ప్రజల ప్రాణాలను రక్షించడమే తమకు అత్యంత ప్రధానమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. సెలవులు ఉన్నాయి కదా అని ఎవరూ బయటకు రావొద్దంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాల కోసం, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నగర వ్యాప్తంగా జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేస్తున్నారన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా గ్రీవెన్స్, ట్విట్టర్, టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా 429 రెస్క్యూ టీంలు పని చేస్తున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మేయర్ శనివారం సందర్శించారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న ఫోన్ కాల్స్, ఇతర ఫిర్యాదుల పట్ల సిబ్బంది పనితీరు ఎలా ఉందనే విషయాల్ని ఆమె దాదాపు గంట సేపు సమీక్షించారు.

రూ.780 కోట్లతో 30 ప్రాంతాల్లో పనులు

విస్తారమైన వర్షాల కారణంగా జీహెచ్‌ఎంసీ గ్రీవెన్స్ సెల్‌కు ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదుల సంఖ్య 946. వీటిలో శిథిలావస్థ భవనాలు, చెట్లు విరిగి పడిపోవడం, రోడ్లపై నీరు నిలిచిపోవడం, మ్యాన్ హోల్స్ నుంచి నీరు పొంగడం తదితర సమస్యలు ఉన్నాయన్నారు. వీటిని తమ సిబ్బంది పరిష్కరిస్తూ వస్తున్నారన్నారు. నాలా పరీవాహక ప్రాంతాల వద్ద ఎస్‌ఎన్‌డీపీ కింద రూ.780 కోట్లతో 30 ప్రాంతాల్లో పనులు జరిగాయన్నారు. ఇంకా ఆరు చోట్ల మాత్రమే పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

429 రెస్క్యూ టీంలు

వర్షాల కారణంగా ప్రజల అవసరాలు తీర్చేందుకు, ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు చేర్చేందుకు 429 రెస్క్యూ టీమ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ధ్వంసమైన రోడ్లను బాగు చేసేందుకు సీఆర్‌ఎంపీకి చెందిన 29 టీంలు పని చేస్తున్నాయని మేయర్ తెలిపారు. లోతట్టు ప్రాంతమైన గాజుల రామారాం వద్ద నిలిచిపోయిన నీరును తొలగించేందుకు తమ సిబ్బంది పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

- విద్యాసంస్థలకు, ప్రైవేటు సెక్టార్లకు, ఇతరత్రా కార్యాలయాలకు ప్రభుత్వం సెలవులు ఇచ్చిన నేపథ్యంలో.. కొందరు బయటకు వచ్చేందుకు ఇష్టపడతారని.. అత్యవసరమైతేనే తప్ప బయటకు రావద్దని.. ఇళ్లల్లోనే సేఫ్‌గా ఉండాలని రిక్వెస్ట్ చేస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి సూచించారు.



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులపై సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న మేయర్ విజయలక్ష్మి

వారం తర్వాత వారిపై సీరియస్ యాక్షన్

నగరంలో ఇప్పటి వరకు 483 శిథిలావస్థ భవనాలను గుర్తించామన్నారు. కూల్చేందుకు వెళ్లిన క్రమంలో మరమ్మతులు చేసుకుంటామని వాటి యజమానులు కోరడంతో కొంత గడువు ఇచ్చినట్లు చెప్పారు. వీరందరికీ నోటీసులు ఇచ్చామని, ఇప్పటికే 87 భవనాలను కూల్చివేశామని మేయర్ తెలిపారు. 92మంది రిపేర్ చేసుకోగా, 135 మంది ఖాళీ చేశారని, 19 భవనాలను సీజ్ చేశామని, 150 ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన యజమానులు వారంలో రిపేర్ చేసుకోకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుందన్నారు.



మల్లంపేట్ కొత్తకుల్ల కాలనీలో వరద నీటిలో..



పురానాపూల్ వద్ద మూసీలో నీట మునిగిన ఆలయం



ఇంకా వరద నీటిలోనే కొత్తకుల్ల కాలనీ..



నీటిలో చిన్నారిని మోసుకెళ్తున్న మరో చిన్నారి



ఇంట్లోకి చేరిన వరద నీటిని ఎత్తిపోస్తూ..

ఫిర్యాదులు.. పరిష్కారాలు

- జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్‌కు శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 26 ఫిర్యాదులందినట్లు అధికారులు పేర్కొన్నారు.

వివరాలిలా ఉన్నాయి..

- 21 చెట్లు కూలగా, 18 ప్రాంతాల్లో తరలించారు.
- 4 ప్రాంతాల్లో నీరు నిలవగా 3 చోట్ల తొలగించారు.
- సనత్‌నగర్‌లో కూలిపోయిన గోడ శిథిలాలను తొలగించారు.

అక్కడ మంత్రి.. ఇక్కడ మేయర్

తెలిపింది అవే వివరాలు

- వేర్వేరుగా ఎందుకో మరి
- విభేదాలు అంటూ ఊహాగానాలు

సాక్షి, సిటీబ్యూరో: వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని, సమస్యల పరిష్కారానికి ఎమర్జెన్సీ మాన్సూన్ బృందాలు ఏర్పాటు చేసిందని, ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు జీహెచ్‌ఎంసీ కాల్ సెంటర్ 24 గంటలు పని చేస్తోందని నగర ప్రజలకు తెలియజేయాలన్నది లక్ష్యం. అదే విషయాన్ని హుస్సేన్‌సాగర్‌లో వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను పరిశీలించిన మేయర్.. ఆ కార్యక్రమాల సందర్భంగా విలేకరులతో చెప్పారు. నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని, చేపట్టిన కార్యక్రమాల్ని తెలియజేయడమే ఉద్దేశం అయినప్పుడు వేర్వేరుగా రెండు కార్యక్రమాలెందుకన్నది చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు.. మంత్రి కార్యక్రమంలో మేయర్ పాల్గొనలేదు. వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇంత వరకు మేయర్ ఎక్కడా క్షేత్రస్థాయి పర్యటనలు చేసింది లేదు. మంత్రి కార్యక్రమం ముగిసిన వెంటనే రెండు గంటల వ్యవధిలో కాల్‌సెంటర్ సందర్శన, విలేకరుల సమావేశం కార్యక్రమాలు ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తాయి. ఇరువురి నడుమ విభేదాలున్నాయంటూ అవి కొనసాగాయి. గతంలోనూ మేయర్ డివిజన్‌లోని కార్యక్రమాలకు మంత్రి హాజరు కాలేదని, మంత్రి కార్యక్రమాలకు మేయర్ హాజరు కాలేదని ఈ సందర్భంగా కొందరు వ్యాఖ్యానించారు.



హుస్సేన్‌సాగర్‌ను పరిశీలిస్తున్న తలసాని

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

నగర రహదారులు గుంతలమయం



నిజాంపేట్ రోడ్డుపై గుంతలు



వీఎస్‌టీ వద్ద కొట్టుకుపోయిన తారు

- వరుస వర్షాలతో అంతా చిత్తడి చిత్తడి
- 2, 3 కి.మీ దూరానికే గంట సమయం
- నత్తనడకను తలపిస్తున్న ట్రాఫిక్
- నరకయాతన పడుతున్న వాహన చోదకులు

సాక్షి, సిటీబ్యూరో: నగర రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. ఇటీవల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడితే నగరంలోని ప్రధాన రోడ్లు చెరువులు, కుంటలను తలపిస్తాయి. వరుస పెట్టి కురుస్తున్న వర్షాలతో రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. ప్రధాన రహదారులు మినహా మిగతా రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై తవ్వకాలతో గుంతల్లో నీరు నిలిచి ఇబ్బందిగా తయారైంది. మరోవైపు మెట్రో, ఫ్లైఓవర్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రహదారులపై ప్రయాణం వాహనదారులకు నరకాన్ని తలపిస్తోంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి సైతం ఇదే విధంగా తయారైంది. రోడ్లపై కనీసం ద్విచక్ర వాహనాలు సైతం ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. పలు ప్రాంతాలలోని రోడ్లు పూర్తిగా గోతుల మయంగా మారాయి. ఒక అడుగు మేర గోతులు ఏర్పడడంతో వాహనాదారులు ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో వరద నీరు నిలిచిపోవడంతో ఎక్కడ రోడ్డు ఉందో, ఎక్కడ గోతి ఉందో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. కేవలం రెండు మూడు కిలోమీటర్లు ప్రయాణించేందుకు కనీసం గంట సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మల్లంపేట్ రహదారి ఇలా..

ఫిర్యాదుల వెల్లువ

నగరవాసుల నుంచి జలమండలి, జీహెచ్‌ఎంసీ హెల్ప్‌లైన్లకు ఫిర్యాదుల వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటిఏ ప్రత్యేక బృందాలు రంగంలో దిగి ఎప్పటికప్పుడు సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాయి. జలమండలి ముంపు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించేందుకు సివర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లు చేపడుతోంది. ముఖ్యంగా మ్యాన్‌హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్‌ఫ్లోపై వచ్చే ఫిర్యాదులపై దృష్టి సారించింది. సంబంధిత అధికారులు లోతైన మ్యాన్‌హోళ్లు, మురుగు ఉప్పొంగే ప్రాంతాలను సందర్శిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు.



బాచుపల్లిలో అధ్వానంగా మారిన రోడ్డు

పోటెత్తిన ప్రవాహం



గండిపేట జలాశయం

- జంట జలాశయాలకు నీటి కళ
- హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరద

సాక్షి, సిటీబ్యూరో/బండ్లగూడ/మణికొండ: జంట జలాశయాలకు వరద పోటెత్తుతోంది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లతో పాటు హుస్సేసాగర్‌కు వరద భారీగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వరద ప్రవాహం అధికమైంది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి సుమారు 40 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నీటి మట్టం పూర్తి స్థాయికి చేరింది. ఫుల్‌ట్యాంక్ లెవల్ సామర్థ్యం 513.45 మీటర్లు కాగా.. ప్రస్తుతం 514.75 మీటర్లు దాటింది. దీంతో తూముల ద్వారా హుస్సేన్‌సాగర్ నుంచి 5,800 క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేస్తున్నారు.

మరో నాలుగు గేట్లు ఎత్తివేత

హిమాయత్ సాగర్ పూర్తిగా నిండుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరగడంతో జలమండలి అధికారులు శనివారం మరో నాలుగు గేట్లు ఎత్తారు, దీంతో ఎత్తిన గేట్ల సంఖ్య ఆరుకు చేరింది. హిమాయత్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా వరద ప్రవాహంతో 1763.25 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి 3,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో ఆరు గేట్లు రెండు ఫీట్ల మేరకు ఎత్తారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డును మూసివేశారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఈ దారిలో ప్రయాణించవద్దని అధికారులు సూచించారు.

కొనసాగుతున్న వరద తాకిడి

ఉస్మాన్‌సాగర్‌కూ వరద తాకిడి కొనసాగుతోంది. ప్రస్తుతం ఎగువ భాగం నుంచి 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 1785.85 అడుగులకు చేరింది.

గండిపేటకు వరద తగ్గుముఖం

గండి పేట చెరువుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గు ముఖం పట్టింది. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి నీటి మట్టం 1786 అడుగులకు చేరింది.

నాలా ఆక్రమణల్ని తొలగిస్తాం

- వర్ష సమస్యలుంటే జీహెచ్‌ఎంసీకి ఫోన్ చేయండి
- హుస్సేన్‌సాగర్‌ను పరిశీలించిన మంత్రి తలసాని

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్‌ఎన్‌డీపీ) ద్వారా నాలాల ఆధునికీకరణ పనులు చేపట్టాక వరద సమస్యలు తగ్గాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నాలాల విస్తరణ కోసం అవసరమైన ప్రాంతాల్లో ఆక్రమణలుంటే తొలగిస్తామని, వ్యతిరేకించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తగిన పరిహారం చెల్లించి వారిని తరలిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోనుందని చెప్పారు. నగరంలో అయిదురోజులుగా కురుస్తున్న వర్షాలతో హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌ను దాటడంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి హుస్సేన్‌సాగర్‌ను, సాగర్‌లోకి వస్తున్న.. విడుదలవుతున్న నీటిని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు 428 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు 24 గంటలు పని చేస్తున్నాయన్నారు. చిన్న చిన్న సమస్యల్ని ఎమర్జెన్సీ బృందాలు తక్షణం పరిష్కరిస్తున్నాయన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, బుద్ధభవన్‌లలో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు పని చేసున్నాయని తెలిపారు. నగర ప్రజలకు వరద సమస్యలు తప్పించాలనే దూరదృష్టితో మంత్రి కేటీఆర్ ఎస్‌ఎన్‌డీపీ ద్వారా పనులు చేపట్టారన్నారు. ఈ పనుల వల్ల నగరంలో గతంలో మాదిరిగా ముంపు ముప్పు సమస్యలు ఎక్కువగా లేవన్నారు. వర్ష పరిస్థితుల్ని కేసీఆర్, కేటీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిసున్నారన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత నాలా ఆక్రమాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్సేన్ సాగర్ కాల్వ నీటి ఉధృతిని కవాడిగూడ (భాగ్యలక్ష్మి టెంపుల్) వద్ద, అశోక్ నగర్ వద్ద మంత్రి పరిశీలించారు. మారుతీనగర్ వద్ద నాలా పనులు, అశోక్‌నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. మంత్రి వెంట ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఈఎన్‌సీ జియావుద్దీన్, లేక్స్ విభాగం సీఈ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



మూసారంబాగ్ వంతెన వద్ద ప్రవహిస్తున్న మూసీ

మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు

మలక్‌పేట: హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తివేయడంతో మూసీ నది ప్రవాహం పెరిగింది. దీంతో జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 అధికారులు, సౌత్ ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు శనివారం మలక్‌పేటలో పర్యటించారు. ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ సత్యనారాయణ, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఈఈ వీర్‌సింగ్, ఏఈ రవికాంత్‌లు మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. నీటి ఉధృతి పెరిగితే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు డీసీపీ సూచించారు. బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించే పరిస్థితి ఏర్పడితే ట్రాఫిక్ మళ్లింపు.. తీర ప్రాంతవాసులను అప్రమత్తం చేయాలని సిబ్బందికి చెప్పారు.



సండే క్లాసిఫైడ్స్ సాక్షి

Automobiles

VEHICLE FOR SALE

■ JCB 3DX XTRA 2 Nos, Model: 11/2021, Good Running Condition, for Price Contact : 9951828399, 9848132279 [H-780947]

Education

■ అక్టోబర్ పరీక్షల్లో ఓపెన్ 10th , ఇంటర్, డిగ్రీ, PG, డిప్లొమా, 100% పాస్ గ్యారంటీతో పూర్తి 10th, ఇంటర్, డిగ్రీ, PG, డిప్లొమా, ఫెయిలైతే రీకౌంటింగ్ ద్వారా పాస్ సౌకర్యం ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. ఫోన్ : 6305979755, [HA-189369]

■ Spring Education SSC & Inter One Sitting, Degree, PG, B.Tech, M.Tech, BA, B.Com, BBA, BCA, Etc. Hyderabad. Ph : 6304274521 [H-780946]

FREE HANDWRITING -WORKSHOP for (8th, 9th & 10th Students)
Is English Troubling You ?
Join us & Speak English Confidently
English Fluency Training
VEGA'S
The Centre for English Language
Ph:8008216866

Real Estate

■ శంకర్ పల్లి, చేవెళ్ల, పరిగి, షాద్ నగర్, శంషాబాద్, తాండూర్, మహబూబ్ నగర్, ల్యాండ్స్ & ఓపెన్ ప్లాట్స్, అన్ని రకాల ప్రాపర్టీస్ అమ్మబడును, & కొనబడును. ఫైనాన్స్ Also. ఫోన్ : 9440571029 [HA-788915]

■ We Deal in Any kind of Litigation Properties for Reliable Services. మేము ఎలాంటి లిటిగేషన్ ప్రాపర్టీస్ వున్న డీల్ చేస్తాం, విశ్వసనీయ సేవల కోసం సంప్రదించండి : 78718 86273 [V-6196]

■ RR Legal & Real Estate Consultancy: Hyd & చుట్టు ప్రక్కల ప్రాంతాల యందలి మీ స్థలాల సమస్యలు (బ్యాంక్‌లోన్లు, ఇతర న్యాయపరమైన చిక్కులు) పరిష్కరించ బడును/ అమ్మించబడును. Ph: 9949869999 [HA-13638]

BUILDING CONSTRUCTIONS

■ మీ అందమైన ఇంటి నిర్మాణం కోసం: ISI స్టాండర్డ్ A1 క్వాలిటీ మెటీరియల్‌తో 3D డిజైన్లు&బిల్డింగ్ ప్లాన్ లతో మా క్వాలిఫైడ్ ఆర్కిటెక్ట్ ఇంజినీర్‌లతో ఇంటీరియర్ డిజైనింగ్& నైపుణ్యం కలిగిన కార్మికులతో బిల్డింగ్ నిర్మాణ పనులు హై స్టాండర్డ్ వర్క్స్ చేయబడును. Trayam Infra Pvt. Ltd. Ph: 6281541619 [H-788605]

■ కేవలం 1600/- లకే Per Sft. నాణ్యమైన మెటీరియల్ తో, 100% వాస్తు, క్వాలిటీ ఇంజనీర్లచే మీకు నచ్చిన రీతిలో ఇండ్లు, బిల్డింగ్‌లు కట్టి ఇవ్వబడును. ఫోన్: 9494707023 [HA.94328]

FLAT FOR SALE

■ Pragathi Nagar, 3BHK, 1800 Sft. Floor wise West Face, HMDA, 4 Floors, Corner Bit, 40 Feet Roads, Ready to Move. Ph: 9848225164. [H-780940]

■ Mehdipatnam 1104 Sft 2BHK, 3rd Flr. with Two Balconies, N/F, Car Parking, Lift, All Facilitis at Navodaya Colony, St. Ann's College. Rs. 43 Lakhs, Negotiable. Ph: 9396484990 [HA-793493]

■ Prajwalla Temple Tree. HMDA Aprv. Gated 2BHK Apts, Ashoknagar Beeramguda, 1 KM Mumbai Highway, Ph: 9959006688, 9032823846 [H-780942]

■ 3BHK Ready to Occupy Luxury Flats Near Nacharam, Mallapur Last Few Flats for Sale Highrise Gated Community With Modern Amenities Must Visit. Ph: 9502429292 [H-780848]

■ Nagole Bandlaguda Anandnagar Ready to Occupy 3BHK E/F (1650 Sft.) with All Fecilities. Ph: 9059490490, 9908090718. [H-788506]

■ @ Auckland Residency Apartment, PVNR Pillar No. 172, Attapur, Semi-Furnished, 2BHK Flat, 100% as per Vastu, Ready to occupy, 24 Hours Water Supply, DG Power Backup. Ph :9666759480, 9246363369 [H-189557]

■ Chandanagar Near Hitech City New 3 BHK RERA Approved flats Offer Price 5876/- only per Sq. ft Offer until 15th August only. Ph :9346302740, 9912269666 [H-781537]

■ Affordable 3BHK Flats in Ready to Occupy Gated Community Must See! Last 2 Flats Available for Sale No GST. Call : 9492427519 [H-780847]

HOUSE FOR SALE

■ బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, యాదాద్రి కాలనీ 140 గ॥లు ఇండిపెండెంట్ ఇల్లు (G+1,E/F40ft Road) Rs. 1.58cr. అమ్మకమునకు కలదు, గండిపేట (మం), రంగారెడ్డి (జిల్లా), ఫోన్: 8008843371, 8555918283 [H-781539]

■ వనస్థలిపురం FCI కాలనిలో నార్త్ / వెస్ట్ 270 గంజాలు, న్యూ డూప్లెక్స్ హౌస్, G+2, 4800Sft. అమ్మకానికి కలదు. సంప్ర: 9849688626 [HA-1686]

■ Sai Anurag Colony Bachupally 160, 135, 120yds, G+1 & G+2 Houses for Sale. Ph: 9010915552, 9949711596. [H-780944]

■ House for Sale: Kukatpally 2KM from Main Road, G+3 House 80-1 Lakhs Rent, No Mediaters, Contact Genuine Only. Ph: 9849328601. [H-788726]

భూమి అమ్మకం

హైదరాబాద్ - వరంగల్ 4 లైన్ల హైవేకు ఆనుకొని స్టేషన్‌ఘన్‌పూర్‌లో 26 ఎకరముల భూమి 3 లక్షల చదరపు అడుగులు షెడ్స్ అన్ని వసతులతో అద్దెకొరకుగా అమ్మబడును.
ఆసక్తిగల వారు
సంప్ర: 9959910909

■ Munaganoor, Hayath Nagar, 404 Sq.Yds P.No. 63 & 64, Sy. No. 64 Indep. House 196Sq.Yds. P.No. 68, Plot For Sale. 100% Vaastu. Contact: 9010219658, 7901091081. [H-781242]

■ 2BHK Flats & Indp. Houses & plots for Sale HMDA Main Road 1/2 KM Isnapur, Balaji Hills. Ph: 9849049842, 7673912669 [H-780937]

LAND FOR SALE

■ అతితక్కువ రేట్లు ఫ్రీ రిజిస్ట్రేషన్ HMDA, DTCP YTDA& ఫార్మా లాండ్స్ (టేకు, పండ్ల చెట్లతో) SEZs ORR & RRR దగ్గర రూ. 4L-60L మాత్రమే బ్యాంక్ లోన్, వాయిదాల్లో కలవు. ఫోన్ : 9966235327 [HA-189231]

■ తిరుపతి జిల్లా ఓజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: 9440183778 [H-189558]

■ Approx 3.5Acres at Arempula Village, Khammam (Khammam - Warangal Highway). further details Cont: 8978090519/ 9493142844. [H-189233]

■ 2 Acres @ Padalapally (V), Thoopran (M), Medak (Dist), Sy.No. 185/1, Rs. 1.30 Cr. P/Acre. Clear Title. Negotiable & Open Plot 27x60 for Sale 35,000 P/Sq.yard. @ Bharathnagar, Moulali, Hyd. Ph: 9440886371 [H-189225]

LEASE / RENT

■ Ayuplus Ayurveda Hospital @ Nagole, Fully Equipped Pancha karma Hospital for Lease / Rent. Ph: 8712717937, 9051611709 [H-780948]

PLOT FOR SALE

■ శ్రీరాంకాలనీ జల్‌పల్లి బాలాపూర్ 118 Sq.Yds. రిజిస్టర్డ్ S/F గజం 25,000/-, క్లియర్ టైటిల్ డైరెక్ట్ ఓనర్. ఫోన్ : 9133503242, 8555846858 [H-781534]

■ గజం కేవలం 2500/- మాత్రమే మీ పెట్టుబడి పదింతలు అయ్యే అద్భుత అవకాశం. సాగర్‌హైవే ఇబ్రహీంపట్నం వద్ద అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 8919577389 [HA-9968]

■ అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, కొత్త గూడెం, మల్కాపూర్, తూప్రాన్‌పేట్, పిగ్లి పురం, తారామతిపేట్, చౌటుప్పల్‌లో ఓపెన్ ప్లాట్లు కొనబడును. ఫోన్ : 9700434347 [H-788504]

■ 16 పండ్ల మొక్కలతో, వాస్తుకు అనుగుణంగా, పక్కా డాక్యుమెంట్స్‌తో రూ. 2,50,000/-లకే ఫామ్ ల్యాండ్ (121గ॥) కొనండి. Hero Bike ఉచితంగా పొందండి. 9700518878, 9154047148, [WA-7204]

■ 500/1000sq. yrds Commercial Plot & Shed for Sale At Sanathnagar Industrial Area if interested Brokers Excuse. Ph: 7675855508. [H-11709]

■ Shadnagar Plot for Sale 300Sq yd @ 18700/- HMDA Layout, Under Shadnagar Municipality 800Mts from NH44. Price Negotiable. Owner Ph: 7075372766 [H-788606]

■ Adibatla, Mangal Pally, HMDA Project, Villa Plots, CC Roads, Just 3km from ORR "Exit No. 12" Very near to TCS & Foxcon Company. Ph : 9700021777 [H-788787]

■ Open Plot For Sale 266sq. Yards North Face Srikrishna Hills Colony Road No. 05, Near Bommala Gudi Hayathnagar. Ph : 9069062829 [HA-11295]

■ Alwal 377 Sq.Yds. N/F Plot for Sale @ Bhavani Nagar, with Parking+3 Floors Permission, Plot Size 40 x 85 Very Near to Main Road. Ph : 9989657778 [H-781544]

■ Manikonda Panchvati Colony East/South Corner 300 Sq. Yds. Plot for Sale Contact 9am to 10 pm. Ph: 9246546336. [HA-4247]

TO-LET

■ Rooms. Available for Coaching Center/ Tutions @Vanasthalipuram Main Road Phone: 9494800160 [WB-15737]

■ Building (G+1) Suitable for Hostel, Clinic, Offices, Guest Houses, OYO Rooms, Model Colony, Beside ESI, Erragadda. Contact: 9985187777 [H-788732]

■ Showroom for Rent in Madhapur Big Showroom 720 Sqft. Newly Renovated, Separate Office room with attached bathroom. @ Madhapur 100 feet Road Nr. Kakathya Kaman, for Automobile related bussiness only with graphenizer.com & Detailing Products Dealership. Rent 60K. Ph: 6305128437 [H-437]

■ Alwal Mangapuram Colony Phase-I, 3BHK, 3rd Floor, E/F Well Furnished, Lift, 24 Hrs Water, Carparking, Ph: 9441210251, 7702844732 [H-796921]

VILLAS FOR SALE

■ New-age Design Premium Villas for sale in Raviryala for just Rs.1.80 Crores. Contact : +91 7353585358. Sark Projects [HA-94265]

REAL ESTATE WANTED

■ పవిత్ర కన్‌స్ట్రక్షన్స్: హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో అపార్ట్‌మెంట్ నిర్మాణమునకు అనుకూలమగా వున్న స్థలములు డెవలప్మెంట్ చేయ్యబడును. 500Sqyds - 1000Sqyds. ఫోన్: 9390253666, 7993912656 [HA-30215]

Services

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788602]

■ Soochi Fintech Private Limited, Consult for Finance (From Pvt./ Nationalised Banks & institutions), Chits (1 Lakh to 2 Crore), Fixed Income plans (Monthly/Maturity), Insurance (Life, Health& General) & Abroad Education. Ph:040-24440129, 7337440129, Mail ID: gns.sharma@soochi.in [H-781447]

BUSINESS SERVICE



■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788716]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 8886456484. [H-189261]

■ Housing, Mortgage & Project Loans from Banks with any problems (Cibil Plan) also will be done surely within 10days. Call: 9966914118. [HA-788786]

BUSINESS OFFER

■ హైదరాబాద్ పరిసరాల చుట్టూ ఉండే ఫ్లాట్స్ బిల్డింగ్ ఇండస్ట్రీస్ బిజినెస్ లపై మరియు Govt., Pvt. ఎంప్లాయ్‌కి లోన్స్ ఇప్పించబడును. (In 15 Days) ఫోన్ : 8143276569 [H-788607]

■ బ్రాయిలర్ కోళ్ళు & నాటు కోళ్ళ పెంపకం మరియు వాటి ఉత్పత్తి (Production) మెషినరీ విభాగంలో 1 లక్ష నుండి ఆపైన పెట్టు బడులు కావలెను. ఫోన్ : 9381867282 [HA-13613]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మెషిన్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 9310515624, 8800496710 [DA-38443]

■ అర్జెంట్ మంచి రన్నింగ్‌లో ఉన్న Full ప్రాఫిట్ బిజినెస్ కొరకు ఇన్వెస్టర్ కావలెను. ఫోన్ : 7674990470 [H-189458]

■ No Loss on Investment no charges on Advises only Profits in Business Earn Crores Transparently. Ph: 9246558487 [HA-438]

CHITS & DEPOSITS

■ కపిల్ చిట్‌ఫండ్స్‌లో 5లక్షలు, 10, 15, 25, 50 లక్షలు మరియు 1Cr చిట్స్ కలవు Deposits కూడా కలవు కా॥వారు T.S.Rao ను సం॥గలరు. Ph: 7013808479, 8179948281 [HA-1337]

INSURANCE

■ కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్స్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-11271]

PERSONAL CARE



CHANGE OF NAME

■ వీరబోయిన పునీత్‌రాజ్ తండ్రి స్వర్గీయ వి.నారాయణ్‌రాజు, నివాసం: ఇ.నం. 11-20-5/ 408, హుడా కాంప్లెక్స్, సరూర్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ -500035 నివాసియైన నేను అన్ని భవిష్యత్తు అవసరాల నిమిత్తం నా పేరును వీర్ పునీత్‌రాజ్ నుండి వీరబోయిన పునీత్‌రాజ్‌గా మార్చుకున్నాను. [HA-18204]

■ I, Kalil Hammed Pash S/o. Hammed Jameel, R/o. H.No. 2-6-363/4/1, Habeeb Nagar, Saidabad, Hyd, T.S., Changed my Name as Mohmmed Kaleel. [H-780733]

■ I, Garripeli Venkateshwarloo (Old Name) S/o. G. Sankaraiah R/o. MIG-475, 2nd Floor, Nr. Hanuman Temple KPHB, Hyd. has changed my name as Garripelli Venkateshwarlu for all purposes. [HA-3313]

■ I, Jidula Jaiprakash (Jaya Prakash) S/o. G. Narsing Rao (Jidula Narsing Rao) the Correction of Wrong Entries occurred in School Records Due to Parental Mistakes Be known Geedula Jayaprakash S/o. Geedula Narsing Rao in all concerned Records. [HA-189311]

HOME CARE

■ మాతృశ్రీ హోమ్‌కేర్ సర్వీస్. మంచంపై ఉన్న వృద్ధులకు, పేషెంట్లకు, బేబీకేర్, ఇంటి/వంట పనిచేయుటకు అనుభవం గల ఆయాలు, అటెండర్స్, నర్సులు 24 గం॥ మీ ఇంటికి పంపగలము. ✆ : 99895 58736, 83176 01335 [R-6019]

OLD AGE HOME

■ సురక్షణ ఓల్డేజ్ హోమ్ అన్ని వసతులతో సౌకర్యవంతమైన హోం, భోజనం, వసతి కలదు, రూమ్స్ సెపరేట్ కలవు, కేర్ టేకర్స్ కలరు. సంప్ర: 8121413440 [H-189230]

■ ఆదరణ ఓల్డేజ్ హోమ్ వృద్ధులకు బెడ్ పేషెంట్స్‌కు ఆయాలు నర్సులతో 24 గం॥లు సర్వీస్ చేయబడును సింగిల్ రూమ్స్ సదుపాయం కలదు. దయానందనగర్ మల్కాజ్‌గిరి. Ph: 9347210490 [H-189502]

■ శ్రీహర్ష ఓల్డేజ్‌హోమ్, YSR సర్కిల్, IRR, విజయవాడ, మీపెద్దలను ప్రేమాభిమానాలతో చూసుకొనుటకు మా హోమ్‌లో చేర్పించండి, మీరు నిశ్చింతగా ఉండండి. Ph: 7093911010/ 9573000987/ 8897730222 [H-780886]

■ ఈశ్వర్ హోమ్‌కేర్ సర్వీసెస్, 24/గం॥ వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను, ఇంటి/వంట పనికి కేర్‌టేకర్స్ మీఇంటికి పంపబడును. ఫోన్ : 8374551099, 8977641099 [H-781238]

■ వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-781644]

■ త్రివేణి హోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ : 9160900023, 9160900024 [HA-189309]

■ శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులను, పేషేంట్స్‌ని, చిన్నపిల్లలను చూసుకొనుటకు, వంట, ఇంటి పనికి కేర్‌టేకర్స్‌ని, ఆయాలను, నర్సులను, 12, 24 గం॥ మీ ఇంటి వద్దకు పంపబడును. 18-20K ఫోన్:6309807798, 9121098519 [H-788722]

SHOP FOR SALE

■ సికింద్రాబాద్ స్టేషన్ రెతిఫైల్ బస్‌స్టాప్ ఎదురుగా 2500 చ॥అడుగుల షాప్ అమ్మకం లేదా రెంట్‌కు కలదు. టిఫిన్ సెంటర్ / బైక్ షాప్ / బ్యాంక్/ రెస్టారెంట్ ఏదైనా పెట్టవచ్చు. కాల్: 9000856222, 9985444442, 8885870000 [HA-11707]

■ సికింద్రాబాద్, తాజ్‌మహల్ హోటల్ ప్రక్కన న్యూ బిజినెస్ ఏరియా ప్యాట్నీ బజార్‌లో, 170 చ॥ అడుగుల షాపులు అమ్మకం లేదా రెంట్‌కు కలవు. మొబైల్ షాప్, టీ అడ్డా, స్విగ్గీ, క్లౌడ్ కిచెన్, ఆఫీసులకు అనుకూలం. ఫోన్ : 8885870000, 9849123696 [HA-11704]

TOURS & TRAVELS

■ 14/8 రామేశ్వరం, అరుణాచలం, 22యా॥, 2/9 కర్ణాటక యాత్ర, 9/9న 4 జ్యోతిర్లింగాలు, షిర్డీ 7 రో॥, 9/10 కాశీలో 9ని॥, 15/11 అష్ట జ్యోతిర్లింగాలు, పంచ ద్వారకలు, సంప్ర: భాస్కర రావు, ఫోన్ : 9848486847 [H-189458]

Wanted

■ ప్రముఖ దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో మండలాల వారిగా రిపోర్టర్స్ కావలెను. ఫోన్: 7799712111 [H-788929]

■ ఇంట్లోనే ఉండి పనిచేయుటకు ఆడ పనిమనిషి కావలెను. జీతం: 12,000/- భోజనం + వసతి కలదు. (Part Time Office Jobs for Students). Dr. Srinivas. ఫోన్ : 9849596707 [H-13692]

■ పనిమనిషి కావలెను, వంటపని, క్లీనింగ్, ఫ్లాట్‌లో ఉండి పిల్లలను చూసుకోవడానికి పనిమనిషి కావలెను. ఫోన్ : 9949748698 [HA-423]

■ మల్కాజిగిరిలో కాన్వాస్/ జ్యూట్ బ్యాగుల కోసం అనుభవజ్ఞులైన టైలర్లు కావాలి. ఫోన్: 9949591065 లో సంప్రదించగలరు. [HA-94319]

■ గోరక్షకు సహకరించిన వారికి మాత్రమే దఫాల వారీగా 10000ల నుండి 1000000 రూ॥ల వరకు. కావలసిన 10 మందికి అప్పు ఏర్పాటు చేసి 20000 రూ॥లు జీతం లేదా కమీషన్ పొందు వివరములకు సంప్ర. 9502907465 [H-780731]

■ గ్రాడ్యుయేషన్ చదువుకున్న లైసెన్స్ ఆఫీసర్స్ మరియు కన్‌స్ట్రక్షన్, వ్యవసాయంలో అనుభవం ఉన్న సీనియర్ సూపర్‌వైజర్ కావలెను. Pvc ప్రాజెక్ట్స్. Call mon-sat 11am-5pm on 040-23338080, 8686417794 [HA-781546]

■ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు "సెక్యూరిటీ గార్డులు" కావలెను. రూం+భోజనం ఫ్రీ, జీతం: 12,000/-, ఫోన్ : 9100089955, 8106195640. [H-189269]

■ ప్రముఖ ఫర్నీచర్ కంపెనీ నందు పనిచేయుటకు Carpenters కావలెను. (Kukatpally) ఫోన్ : 8341710841, 9440680782 [HA-788731]

■ అర్జెంటుగా ఆర్మీ మెస్ తిరుమలగిరిలో (వెజ్ -నాన్ వెజ్) వంట చేయుటకు కుక్స్ (మగ) వారు కావలెను. జీతం: 15000/- ESI+PF ఉచితవసతి +ఫ్రీ ఫుడ్ Email: mktg.sec2011@gmail.com సంప్ర: 9440050036, 040-27813011 [HA-788788]

■ అన్నపూర్ణ హోమ్‌కేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9390427694 [H-788820]

■ Hydలో 24 గం॥ ఇంట్లోనే ఉంటూ వంట, ఇంటిపని, బేబీ కేర్, పేషెంట్ కేర్ చేయుటకు స్త్రీలు కావలెను. వ॥ 18 to 45. జీతం : 15000-25000, భోజన వసతి ఫ్రీ ✆ 73864 44217, 96661 28467 [B-786379]

■ జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-11272]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు, సేల్స్ ఆఫీసర్స్, సేల్స్ మేనేజర్స్ M/F కావలెను. Part Time/ Full Time / Work from Home. ఫోన్ : 9553176495 [H-788821]

■ వంట మనిషి కావలెను ప్రముఖ కాలేజీలో పనిచేయుటకు, జీతం 15వేలు-30వేలు, నిజాంపేట్ రోడ్డు, JNTU దగ్గర. ఫోన్ : 9502937699, 9100094699 [HA-29899]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-4లో అపార్ట్‌మెంట్ లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఫోన్ : 9346686404 [HA-29895]

■ ప్రముఖ Boutique Expansion కొరకు Cutting Masters, Tailors, మగ్గం Workers కావలెను. వసతి కలదు. ఫోన్ : 8919150371. [H-189456]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బి. నగర్ ఏరియా & అత్తాపూర్ ఏరియా, సంప్రదించండి. ఫోన్ : 9032000049, 9160518456 [H-788505]

■ నూతనంగా ప్రారంభం కానున్న హోటల్లో పని చేయడానికి, సర్వీస్ చేయడానికి లేడీ సర్వర్, అసిస్టెంట్ బాయ్స్, లేడీ రిసెప్షన్ కావలెను. మణికొండ. ఫోన్ : 9553191194, 9550722232 [HA-11705]

■ లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K.ఏజెంట్ కమీషన్. 6K, Ph: 9640400073 [H-189310]

■ శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచంమీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-780941]

■ హైదరాబాద్‌లో ఎల్.బి.నగర్, కూకట్‌పల్లిలో SBS మాడ్యులర్ కిచెన్, కబోర్డ్స్ నందు వర్క్ చేయుటకు 2 వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9949445899 [G-321]

■ లాలాగూడ-సికింద్రాబాద్ ఇంట్లోనే ఉంటూ పనిచేయడానికి ఏ బాదరబందీ లేని 25 నుండి 40 సం॥లోపు వయసు ఉన్న వారు ఇంటి పనికి ఒకరు మరియు వంట పనికి ఒకరు విడివిడిగా కావలెను. వసతి+భోజనం కలదు. (2) మరియు భార్య భర్తలు కూడా కావలెను. జీతం+వసతి మాత్రమే కలదు. Ph: 9701946871 [HA-189556]

■ నూతనంగా ప్రారంభించిన South India కంపెనీలో వర్క్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. Q: ఇంటర్/ఆపైన, పార్ట్‌టైం - 9K, ఫుల్‌టైం-18K. ✆ 93915 56054, 91218 24034, 90591 84169. [B-781955]

■ Wanted Car Driver Immediately (With Family) Family Accom modation Shall be Provided. Contact : 9848414396 [H-11702]

■ Wanted Sales & Marketing Executives for Broadband. Freshers can also apply. Zone: Gachibowli to Patancheru. Contact: ✆ 8639741823, 9154982824. [K-1185566]

■ Wanted Marketing Agents, Telecallers, Outdoor Exec., Driver, Office Boy & Digital Mktg. Exec. for Real Estate Co. Ph: 7032471624 [HA-13882]

■ Office Staff / Cainter / Accoun tants with Tally/ Gst Knowledge for Corporate office apply: APPLY: SLGENGINE@GMAIL.COM What sapp: 9848044789 [HA 3902]

■ Wanted Exp. Sales Team for Villas, Flats, Plot, Farms, Magnifiq Properties Pvt. Ltd., Salary: 25K-45K + Inc. Ameerpet, Ph: 9000142942 [HA-11710]

■ Poojitha Bar & Restaurant Sanath Nagar, Hyd, Near Bustop Req.: Captain, Waiters, Hall boys & Cashier Good Salary. Ph: 9849203465, 9908006688 [H-189268]

■ Very Urgent Req. Padmarao Nagar Flipkart BBD 2023-Bike Delivery Associate (DA) Req.: 30 DA, Sal: 19000+ Allowances, Bike Must. Ph: 9704000202, 9133644416 [H-788729]

■ Very Urgent Req. Moinabad Hyd (Amazon) Stastion Associates, Req.: Only Males, Q:Inter+ Com. Knowledge, Sal:13100 +ESI&PF, Ph: 9704000202, 9133644416 [H-788727]

■ Very Urgent Req. Bowenpally Flipkart BBD 2023-Bike Delivery Associate (DA) Req.: 30 DA. Ph: 9704000202, 913364 4416, Sal: 19000+ Allowances, Bike Must. [H-780849]

■ Wanted Female Admi Assistant Fluent in English usage Experience in Microsoft Applications MQS Services Pvt. Ph: 9160609911 [HA-94271]

■ Wanted Tellecallers and Marketing executives Female (Two Wheeler Must) attractive Salary. Kshetra Academy. Contact: 7997516969. [HA-10943]

■ Wanted Sales Executive and Accountant for a Wholesale Jewellery Shop at Paradise Secunderabad with 3-5 years Experienced in Sales and Accounts GST, Tally. Age Below 50 Years. Ph : 9100551194. [H-189555]

FACULTY TEACHERS

■ Wanted Experienced Principal, PET & Physics Teachers for Anjani School, Narapally. Ph: 9347521899, 8019601899 [HA-189503]

■ Wanted Maths and Biology Teachers for IIT and NEET Foundation, Contact: 6309824365 [HA-11708]

■ Req. Sr. Faculties for Maths, Zoology, Commerce, Chemistry - Inter & Chemistry-Degree Salary Up to 5Lakhs P.A. Cont.: Sri Chandra Jr. & Degree College.Ph:9052016313, 9666156313. jobsatsrichandra@gmail.com [H-780730]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-2401/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

షాబాద్ ప్రీ బిడ్ మీటింగ్ సక్సెస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని షాబాద్ రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన ప్రీబిడ్ సమావేశం విజయవంతం అయింది. షాబాద్ ప్రాంతంలో 100 ఎకరాల విస్తీర్ణం లో గల రెసిడెన్షియల్ జోన్‌లో హెచ్ఎండీఏ 877 ప్లాట్లతో వెంచర్‌ను ఏర్పాటు చేస్తుం ది. శనివారం వెంచర్ స్థలంలో నిర్వహించిన ప్రీబిడ్ మీటింగ్ కు వంద మంది హాజరయ్యారు. షాబాద్‌లో వంద ఎకరాల హెచ్ఎండీఏ లే అవుట్ పరిధిలో 300 చొప్పున 877 ప్లాట్లతో వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్న ది. వాటిలో తొలిదశలో 50 ప్లాట్లను ఆన్‌లైన్ వేలం ప్రక్రియ ద్వారా విక్రయిస్తున్నది. ప్రారంభ ధరను గజానికి కాస్త తక్కువగానే నిర్ణయించారు. కాగా షాబాద్ పరిధిలో ఇది మొదటి వెంచర్ కావడం ఆసక్తిని కలిగిస్తోంది.

IDBI BANK

IDBI బ్యాంక్ లిమిటెడ్,
3వ అంతస్తు, డి.నం.5-9-89/1 మరియు 2, చాపెల్ రోడ్, హైదరాబాద్-500 001, తెలంగాణ.
టెలిఫోన్: 040 67694111/ 66746044
www.idbibank.in, ఇ-మెయిల్: sachin.harale@idbi.co.in
CIN: 65190MH2004GOI148838

ఇ-వేలం ద్వారా స్థిరాస్తి అమ్మకం కోసం బహిరంగ ప్రకటన

"హోటల్ జయలక్ష్మి, భీమవరం"

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్)తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ("చట్టం")లోని నిబంధనల క్రింద AO, IDBI బ్యాంక్ లిమిటెడ్ ద్వారా స్వాధీనంలోకి తీసుకోబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి ఇ-వేలం ద్వారా కొనుగోలు చేయుటకు ప్రముఖ మరియు యథార్థమైన పార్టీల నుండి IDBI బ్యాంక్ లిమిటెడ్ (IDBI) తరఫున అధీకృత అధికారి (AO) అయిన దిగువ సంతకందారు బిడ్లు/ఆఫర్లను కోరుచున్నారు.

వివరాలు	రిజర్వు ధర మరియు బయానా
ఆస్తి ఉమ్మడి వివరణ (ఎస్.ఆర్.ఓ.) భీమవరం వద్ద నమోదు కాబడిన డాక్యుమెంట్ నెంబర్ 4846/1989, డాక్యుమెంట్ నెం.2220/1992, డాక్యుమెంట్ నం.881/1993 మరియు డాక్యుమెంట్ నం.2243/1992, కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ నాలుగు నం.లు మరియు ఎస్.ఆర్.ఓ. భీమవరం వద్ద నోట్ కాబడిన డాక్యుమెంట్ నం. 1400/ 2011 ప్రకారం మార్టిగేజ్ ఎంట్రీ ప్రకారం: భీమవరం మున్సిపల్ పరిధిలో ఉండి 888.25 చ.గజాల విస్తీర్ణంతో ఆర్ఎస్ నం. 180/2బిలో భాగంగా ఏర్పడిన మరియు ఉన్నట్టి జయలక్ష్మి హోటల్ పేరుగల కమర్షియల్ ఆస్తి యావత్తు 18741 చ.అ.ల మొత్తం సుమారు నిర్మిత విస్తీర్ణంతో మొత్తం విస్తీర్ణం గల (హోటల్ భవనం నిర్మించబడినది. (గ్రౌండ్ ఫ్లోర్: 3543 చ.అడుగులు: మొదటి అంతస్తు 3966 చ.అడుగులు: రెండవ అంతస్తు: 3966 చ.అడుగులు: మూడవ అంతస్తు: 3966 చ.అడుగులు మరియు నాలుగవ అంతస్తు: 3390 చ.అడుగులు) మరియు సరిహద్దులు దిగువ విధంగా ఉన్నాయి: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: Md.మోహిన్ అప్జార్ (డి.నం. 3-13-7) మరియు రాజా (డి.నం. 3-13-8) మరియు ఉమా వెంకట రమణ (ఆయిల్ మిల్) తూర్పు: రోడ్డు, పశ్చిమం: అప్పాజీకి చెందిన సైట్ (డి.నం. 3-11-2/1). తనఖాపెట్టిన వ్యక్తుల పేర్లు: 888.25 చ.గజాల మొత్తం విస్తీర్ణం గల భూమిలో 675.25 చ.గజాల పోర్షన్ తనఖా పెట్టిన వ్యక్తి అంటే శ్రీమతి కుచెర్ల పాటి సౌభాగ్య లక్ష్మికి సొంతమైనది. మరియు మిగిలిన 213 చ.గజాలు తనఖా పెట్టిన వ్యక్తి శ్రీ కె.ఎ.వి.పి. సత్యనారాయణ రాజుకు స్వంతమైనది. రుణగ్రహీతల పేర్లు: శ్రీమతి/శ్రీ శ్రీ తలాటం రవిశంకర్, వడ్డే శ్రీ రామకుమార్ కుమార్, గూడూరి వెంకట రామసూర్యనారాయణ రాజు, గేదాసి శ్రీనివాస్, రామాయణం గంగయ్య, సత్తిరాజు సూర్య వెంకట రామన్, రామాయణం వెంకట లక్ష్మీ నరసింహ స్వామి, రామాయణం వెంకటేశ్వర రావు, ఆరేటి సత్యనారాయణ, దండు శివప్రసాద్ పాట్నూరి నాగభూషణం, ముద్దాక ఉదయ్ కుమార్,	రిజర్వు ధర : రూ. 8.30 కోట్లు బయానా : రూ. 42 లక్షలు

IDBIకు చెల్లించవలసిన బకాయి మొత్తం: 31 మార్చి 2013 నాటికి రూ.14,20,67,275/- మరియు చక్రవడ్డీ పైన కాంట్రాక్చువల్ రేట్ల వంతున 31 మార్చి 2013 నుండి వర్తింపుతో దాని పైన వ్యయాలు, చార్జీలు మరియు తదుపరి వడ్డీతో రుణగ్రహీతలు/తనఖా పెట్టిన వ్యక్తులు చెల్లించాలి.

బిడ్/టెండరు డాక్యుమెంట్ అమ్మకం తేదీ	తనిఖీ తేది	బిడ్ దాఖలుకు ఆఖరి తేది	బిడ్లు తెరచు తేది	ఇ-వేలం తేది మరియు సమయం
24 జూలై, 2023 నుండి	ముందస్తు అభ్యర్థనతో 25 జూలై 2023 నుండి 04 సెప్టెంబర్ 2023 వరకు ప్రతి పనిరోజున ఉ.10.30 గం.నుండి సా.5:00 గం.వరకు.	04 సెప్టెంబర్, 2023	05 సెప్టెంబర్, 2023	06 సెప్టెంబర్, 2023న ఉ.11:00 గం.నుండి

- బయానాను IDBI Bank Ltd పేరున RTGS ద్వారా మాత్రమే అకౌంట్ నం. 00234915010026, IFSC కోడ్: IBKL0000002, బ్రాంచ్ పేరు: IDBI బ్యాంక్ లిమిటెడ్, బషీర్‌బాగ్ బ్రాంచ్, హైదరాబాద్‌కు చెల్లించాలి.
- ఆసక్తిగల బిడ్డర్లు PAN కార్డు (తప్పని సరి) ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడి కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥వంటి KYC డాక్యుమెంట్లు (ఫోటో ఐడెంటిటీ మరియు చిరునామా రుజువులు)తోపాటు చెల్లింపు రుజువును పైన తెలిపిన చిరునామాలోని అధీకృత అధికారికి స్వయంగా దాఖలు చేయాలి. ఆన్‌లైన్‌లో దాఖలు చేసే వేలంలో పాల్గొనే దరఖాస్తు పరిశీలించబడదు మరియు తిరస్కరించబడును. అవసరమైన డాక్యుమెంట్లు మరియు ఫిల్లింగ్ ఫార్మాట్స్‌తో పాటు బిడ్‌ను పైన తెలిపిన చిరునామాలోని AO ని సంప్రదించి స్వయంగా దాఖలు చేయాలి.
- అనర్హులైన బిడ్డర్లచే చెల్లించబడిన బయానా మొత్తానికి వడ్డీ ఇవ్వబడదు. బిడ్ దాఖలు చేయడం ద్వారా ఇ-వేలంలో బిడ్డరు పాల్గొనకపోతే బయానా స్వాధీనం చేసుకోబడుతుంది. బిడ్లు తెరిచిన తేదీ నుండి 3 నెలల వరకు అగ్రశ్రేణిలో ఉన్న ముగ్గురు బిడ్డర్ల యొక్క బయానా AOచే ఉంచుకోబడుతుంది.
- బయానా మరియు ఇతర నిర్దేశిత డాక్యుమెంట్లు అందిన మీదట మరియు అవి అన్నివిధాల సక్రమంగా ఉన్నట్లు కనుగొనబడితే అట్టి ఆసక్తిగల బిడ్డర్లకు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s ANTARES SYSTEMS LIMITED చే వారి చెల్లుబాటుగు ఇ-మెయిల్ చిరునామాల (ఇ-వేలంలో పాల్గొనేందుకు తప్పనిసరి)కు ఇ-మెయిల్ ద్వారా "యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్" ఏర్పాటు చేయబడుతుంది.

[illegible]

...నుండి 30 రోజుల తరువాత పైన పేర్కొన్న స్థిరాస్తి విక్రయించబడునని రూల్స్‌లోని రూల్ 8(6)క్రింద ఇందుమూలంగా తెలియచేయటమైనది. అయితే రుణగ్రహీతలు/ తనఖా పెట్టిన వ్యక్తులు చక్రవడ్డీ ప్రకారం కాంట్రాక్చువల్ రేట్ల వంతున 31 మార్చి 2013 నుండి వర్తింపుతో దానిపైన వ్యయాలు, చార్జీలు మరియు తదుపరి వడ్డీతో సహా 31 మార్చి 2013 నాటికి రూ.14,20,67,275 చెల్లించవలసిన బకాయిలు చెల్లించి మరియు వేలం వేయబడుతున్న స్థిరాస్తిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చును. ఒకవేళ రుణగ్రహీతలు/ తనఖా పెట్టిన వ్యక్తులు ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా డిమాండ్ చేసిన విధంగా చెల్లించవలసిన బకాయిలు చెల్లించుటలో విఫలమైతే సంబంధిత రుణగ్రహీతలు/ తనఖా పెట్టిన వ్యక్తుల యొక్క స్థిరాస్తులకు సంబంధించి పైన పేర్కొన్న బహిరంగ ఇ-వేలంతో ముందుకు కొనసాగేందుకు అధీకృత అధికారికి స్వేచ్ఛ కలదు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 21 జూలై, 2023
సం/- అధీకృత అధికారి
IDBI బ్యాంక్ లిమిటెడ్

Union Bank of India — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచి
డోర్ నెం. 26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, వెంగలరావుపేట, విశాఖపట్నం - 530001,
ఫోన్ : 0891-2537792/82, 9324517291, ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

మెసర్స్ సన్‌షైన్ ఇన్ఫ్రా ఇంజనీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సబంధించి (ప్రస్తుతం ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్ రప్టసీ కోడ్ 2016 ప్రకారం లిక్విడేషన్ ప్రక్రియలో ఉన్నది) 5-42-32ఎ, 2వ అంతస్తు, 6/13-14, బ్రాడీపేట, గుంటూరు - 52202.

స్థిరాస్థి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (6) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్థి/ చరాస్థి అమ్మకం కొరకు ఇ-వేలం ప్రకటన.
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వం ఆంధ్రాబ్యాంక్)కు తనఖాపెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వం ఆంధ్రాబ్యాంక్) అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు మెసర్స్ సన్‌షైన్ ఇన్ఫ్రా ఇంజనీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు సబంధించి (ప్రస్తుతం ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్ రప్టసీ కోడ్ 2016 ప్రకారం లిక్విడేషన్ ప్రక్రియలో ఉన్నది) మరియు హామీదారు (లు) / తనఖాదారు / లు (1) శ్రీమతి గుడిపల్లి లలితా కుమారి, భర్త జి.వి. సుబ్బారావు, 5-42-32-ఎ, రెండవ [illegible]

[illegible]

రిజర్వ్ ధర : రూ. 6,63,00,000/-
ఈఎండి : రూ. 66,30,000/-
బిడ్ ఇంక్రిమెంట్ : రూ. 6,63,000/-

[illegible]

రిజర్వ్ ధర : రూ. 6,63,00,000/-
ఈఎండి : రూ. 66,30,000/-
బిడ్ ఇంక్రిమెంట్ : రూ. 6,63,000/-

[illegible]
1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్ట్ / వెబ్‌సైట్ : www.mstcecommerce.com
2) [illegible] https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp [illegible]
3) [illegible] www.unionbankofindia.co.in [illegible]

[illegible]

తేది: 17-07-2023
ప్రదేశం : విశాఖపట్నం
అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి

క్లుప్తంగా...

వైభవంగా హరిహర మహాయాగం



యాగంలో పాల్గొన్న మార్వాడీ సమాజం సభ్యులు

బంజారాహిల్స్: జగన్నాథ సేవా సమితి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ మార్వాడీ సమాజ్ నిర్వహిస్తున్న శ్రీ పంచకుండీయ హరిహర్ మహాయాగం అంగరంగ వైభవంగా జరుగుతున్నది. ఈ నెల 19న ప్రారంభమైన మహాయాగం ఈ నెల 25 వరకు కొనసాగుతుండగా శనివారం మార్వాడీ కుటుంబాలు ఈ వేడుకలో పాల్గొన్నాయి. కాశీ నుంచి విచ్చేసిన సునీల్ లక్ష్మీకాంత్‌జీ దీక్షిత్ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో మార్వాడీ కుటుంబాలు యాగంలో పాల్గొన్నాయి.

విరించి ఆస్పత్రిలో వరల్డ్ బ్రెయిన్ డే



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రిలో శనివారం 'వరల్డ్ బ్రెయిన్ డే'ను నిర్వహించారు. మెదడుకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రజకు అవగాహన కల్పించడానికి ఏటా జులై 22న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో విరించి సీఈఓ డాక్టర్ సాయి రవిశంకర్ మాట్లాడుతూ... ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మెదడు సంబంధిత వ్యాధులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఈ వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్సలకు అవకాశం ఉందన్నారు. పార్కిన్సన్, అల్జీమర్స్ వంటి రుగ్మతలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఆరోగ్య రంగంలో పనిచేసే వారే కాకుండా సామాన్య ప్రజల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలు కూడా న్యూరో సంబంధిత రుగ్మతలపై దృష్టి కేంద్రీకరించి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మెదడుకు చురుకుదనం కలిగించే రీతిలో హాస్పిటల్ వైద్యులకు ప్రత్యేక క్విజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రహమత్‌నగర్: సీరమ్ మెడికేర్ డయాగ్నొస్టిక్ పాలిక్లినిక్ ఆధ్వర్యంలో శ్రీరాంనగర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరంలో థైరాయిడ్, మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ఎం. సుభాస్, డాక్టర్ సాయిమాధురి, డాక్టర్ హేమకలి మాట్లాడుతూ... మారుతున్న ప్రజల దైనందిన ఆహారపు అలవాట్లు.. పని ఒత్తిడి తదితర అంశాల నేపథ్యంలో మధుమేహం, థైరాయిడ్ వ్యాధులు సర్వసాధారణం అవుతున్నాయన్నారు. సరైన జాగ్రత్తలు, క్రమం తప్పకుండా మందులు వాడకపోతే ఈ వ్యాధులు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు.

కేంద్రం చర్యల వల్లే మణిపూర్‌లో దారుణం

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వ అసమర్థ చర్యల వల్లే మణిపూర్‌లో కొందరు మహిళలను నగ్నంగా ఊరేగించేందుకు తెగబడ్డారని ఏఐఎస్ఎఫ్ ఆరోపించింది. ఆ చర్యను ఖండిస్తూ శనివారం నారాయణగూడ వైఎంసీఏ ప్రాంతంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ మాట్లాడుతూ... దాదాపు మూడు నెలలుగా మణిపూర్ మైతి, కూకి జాతుల మధ్యలో ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. ఆ ఉద్రిక్తతలను కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి కాంపల్లి కళ్యాణ్, నాయకులు శివ, అనిల్, గ్యార పవన్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

సనత్‌నగర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఎస్.రంగారావు అన్నారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ఎవరికీ ఎలాంటి హాని ఉండదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం బాధాకరమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య భారీగా తగ్గిందని ఎన్నో కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరించాయన్న విషయాన్ని గుర్తు చేశారు.

వెంటాడుతున్న దుర్గంధం

కాలనీలు.. బస్తీల్లో దుర్వాసన



బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రధాన, అంతర్గత రహదారులు నీట మునిగాయి. ముందస్తు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం ప్రజలపాలిట శాపంగా మారింది. చాలా చోట్ల ప్రజారవాణాకు ఆటంకం ఏర్పడింది.

- నాలుగు రోజుల నుంచి స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో ప్రధాన రోడ్లు చెరువులను తలపించాయి.
- వర్షాకాలం దృష్ట్యా గత ఏప్రిల్, మే నెలల్లోనే అంతర్గత మురుగు కాల్వలు, నాలాలు వ్యర్థాల తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినా చాలా చోట్ల తూతూ మంత్రంగానే ఈ పనులు కొనసాగాయి.

> - శుభ్రం చేయడంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
> - నాలాల్లో పూడిక తీయడంలోనూ తీవ్ర జాప్యం

- మూడు నెలల నుంచి జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు డీసిల్టింగ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినా అమలుకు నోచుకోలేదు. ఫలితంగా తాజా వర్షాలకు వరద నీరు కాల్వల్లోకి వెళ్లలేక కొన్ని చోట్ల కాల్వలు నిండి, మరికొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.
- ఈ వర్షానికి ప్రధాన రహదారులు పూర్తిగా నీట మునగగా ఎక్కడికక్కడ మ్యాన్‌హోల్ మూతలను తెరిచిపెట్టాల్సిన పరిస్థితులు తలెత్తాయి.
- రాజ్‌భవన్ రోడ్డులోనే లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు ఎప్పటిలాగానే వరద నీరు నిలిచిపోయి స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అరకొర పూడికతీత పనులతో వ్యర్థాలన్నీ రోడ్లపైకి కొట్టుకొచ్చాయి.
- పలుచోట్ల సమీపంలోని బస్తీలు వరద నీటితో విలవిల్లాడాయి. పెద్ద ఎత్తున అధికారులు, సిబ్బంది ఉన్నా పరిస్థితి మాత్రం ఏ మాత్రం మెరుగుపడటం లేదు. బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో బస్తీలు ఇంకా వరద నీటి సమస్యల్లో చిక్కుకున్నాయి. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, మహాత్మ గాంధీనగర్, బవతారకంనగర్, బాబు నాయుడు నగర్ బస్తీల్లో ఇళ్లల్లోకి నీరు చేరి స్థానికులు నరకయాతన అనుభవించారు.
- ఖైరతాబాద్ డివిజన్ పరిధిలో వరద నీటి పాట్లు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీ, సోమాజిగూడ, ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తా వరద నీటిలో చిక్కుకున్నాయి. మరోవైపు జలమండలి పనితీరుకు లీకవుతున్న మ్యాన్‌హోళ్లు అద్దం పడుతున్నాయి.
- ఏ రోడ్డులో చూసినా జలమండలికి చెందిన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ఓవర్‌ఫ్లో అవుతూ రోడ్లను ముంచెత్తుతున్నాయి. పలుచోట్ల ఇళ్లల్లోకి మురుగు చేరుతున్నది. పరిస్థితిని పర్యవేక్షించాల్సిన అధికారగణం కనిపించడం లేదు.



లోటస్‌పాండ్‌లో...



దీన్‌దయాల్ నగర్ బస్తీలో మురుగు



ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో...

24న రవీంద్రభారతిలో చండాలిక నృత్య ప్రదర్శన



చండాలిక కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: కాంత్రి కూచిపూడి నాట్యాలయ ఆధ్వర్యంలో, తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారంతో మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న 'చండాలిక' డాన్స్ బ్యాలే ఈ నెల 24వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని శనివారం ఎర్రమంజిల్‌లో చండాలిక పాత్ర చేస్తున్న ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, క్రాంతి కూచిపూడి నాట్యాలయ నిర్వాహకురాలు క్రాంతి నారాయణ్, బోయి భీమన్న అర్ధాంగి హైమవతి భీమన్న, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, బౌద్ధ సన్యాసి క్యారెక్టర్ చేస్తున్న నటుడు విక్రమ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రవీంద్రనాథ్ ఠాకూర్ రాసిన కథ ఆధారంగా 1962లో ఎల్బీ స్టేడియంలో అప్పటి సంగీత దర్శకులు మోతుకూరి జాన్సన్ సంగీతం అందించగా బోయి భీమన్న నృత్యరూపం తీసుకువచ్చారని అప్పటినుండి చండాలిక ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ఎన్నో దశాబ్దాలతర్వాత తిరిగి ఆ నృత్యరూపకాన్ని నృత్యకారిణి క్రాంతి వెలుగులోకి తేవడం ఎతో సంతోషకరమన్నారు. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ అధ్యక్షతన జరుగుతున్న కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. నృత్యం వీక్షించేందుకు ఎలాంటి రుసుము లేదని నృత్య ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆటో డ్రైవర్ జేఏసీ వినతి



రోహిణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తొమ్మిది సంవత్సరాలుగా తాము అధికార పార్టీకి మద్దతుగా ఉన్నామని అయితే ఆటో యూనియన్‌కు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. అందుకే సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి తమ మద్దతును ఉప సంహరించుకుంటున్నామని తెలిపారు. రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ ఎం.డి.అమరుల్లాఖాన్, చైర్మన్ జి.ఆంజనేయులు, శ్రీనివాస్ యాదవ్, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్జాతీయ చెస్ పోటీలు



వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రెండో రోజు శనివారం చెస్ పోటీలు కొనసాగాయి. ఫస్ట్ స్లాన్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఫీడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఏడు దేశాలు, 18 రాష్ట్రాలకు చెందిన దాదాపు 550 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న చెస్ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వేదిక కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. యువత వారిలో దాగి ఉన్న మేధో సంపత్తిని ఇలాంటి వేదికల ద్వారా బహిర్గతం చేయడం జరుగుతుందన్నారు. స్లాన్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు సుబ్రమణ్యం మాట్లాడుతూ... గతంలో స్లాన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహించామన్నారు. తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో స్లాన్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నవీన్ నాయక్ మాట్లాడుతూ... ఈ పోటీలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో సెంట్రింగ్ కార్మికుడు మృతి

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ మృతి చెందిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... టోలిచౌకి సమతా కాలనీలో నివసించే ఎం.డి.నవాల్ ఉల్ రెహమాన్(36) సెంట్రింగ్ వ్యాపారం చేస్తుంటాడు. 2010లో పెళ్లి కాగా ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన రెహమాన్‌ను విడిచి భార్య ఏడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మానసిక సంఘర్షణ ఎదుర్కొంటున్న రెహమాన్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 19న సమీపంలో నివసించే తన సోదరి ఇంటి నుంచి భోజనం తెచ్చుకున్నాడు. ఆ తెల్లవారి సోదరి ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. ఈ నెల 21న సోదరి మరోసారి ఫోన్ చేసినా స్పందించలేదు. అనుమానం వచ్చిన సోదరి, బావ, తండ్రి, స్నేహితులు కలిసి శనివారం మధ్యాహ్నం రెహమాన్ ఉంటున్న గదికి వచ్చి చూశారు. కిటికీలో నుంచి చూడగా అప్పటికే మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించారు. రెండు రోజుల క్రితమే రెహమాన్ మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఫిట్స్‌తో పాటు గ్యాస్ట్రిక్ సమస్యతో కొంత కాలంగా రెహమాన్ బాధపడుతున్నాడని మృతికి అదే కారణం అయి ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా గోదారంగనాథుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో గోదారంగనాథ స్వామి

బంజారాహిల్స్: ఆండాళ్ తిరునక్షత్రం సందర్భంగా శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ గోదారంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గోదారంగనాథ స్వామికి అభిషేకం, అలంకరణ అనంతరం ఈ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను తిలకించారు. ఆలయ ప్రధాన అర్చకులు అద్దంకి శశికాంతాచార్యులు వేడుకలను నిర్వహించారు.

అలరించిన 'వాగ్గేయకార వైభవం'



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

శ్రీనగర్‌కాలనీ: సౌత్ ఇండియన్ కల్చరల్ అసోషియేషన్, హైదరాబాద్, విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమం ఆద్యంతం భక్తిపారవశ్యాన్ని చాటింది. బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వాగ్గేయకార వైభవం అనే అంశంపై ప్రవచించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియన్ కల్చరల్ అసోషియేషన్ ప్రతినిధి చక్రవర్తి, విజ్ఞాన సమితి ప్రతినిధి సూరి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డీజీపీ హెచ్.జె.దొర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని ఫిలింనగర్ జ్ఞాని జైల్ సింగ్ నగర్ శ్రీ బంగారు ఎల్లమ్మ తల్లి ఫలహారం బండి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. టీమ్ కే ఎస్ కే ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను తిలకించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. డప్పులు హోరు, నృత్యాలతో కార్యక్రమం ఆద్యంతం కనులపండువగా సాగింది.

జలగం వెంగళ్‌రావు పార్కులో కమిషనర్ రొనాల్డ్‌రాస్



వెంగళ్‌రావు పార్కులో పర్యటిస్తున్న కమిషనర్ రొనాల్డ్‌రాస్



సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్‌సీ రవికిరణ్

బంజారాహిల్స్: జలగం వెంగళ్‌రావు పార్కులో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ శనివారం పర్యటించారు. ఇక్కడ వాకర్ల సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఎంటమాలజీ, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడారు. దోమలు లేకుండా చూసుకోవడంతో పాటు ఒక వేళ మురుగునీరు కనుక పూర్తిగా చెరువులోకి రావడం ఆగిపోతే చేపలు పెంచేందుకు గల అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా చెరువు మధ్యలో ఓ ఐలాండ్ నిర్మించి వాకర్లు, సందర్శకులు అక్కడి వరకు వెళ్లి వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వాకర్లు పార్కులో కుక్కల బెడదతో పాటు, కొంత మంది ఆవారా యువకులు పార్కులోకి వచ్చి గంజాయి సేవిస్తున్నారని వారిని అరికట్టాలని, పార్కు బయట డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కనెక్టివిటీ వాక్‌వేకు సాధ్యాసాధ్యాలను పరిశీలించండి : జోనల్ కమిషనర్ రవికిరణ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు మంత్రి బిల్డింగ్ వరకు ఆగిపోయి మళ్లీ వెనక్కి రావాల్సి వస్తుండటాన్ని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్ పరిశీలించారు. శనివారం ఆయన జీహెచ్ఎంసీ, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులతో కలిసి కేబీఆర్ పార్కు, జలగం వెంగళ్‌రావు పార్కులలో పర్యటించారు. కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వే చుట్టూ తిరగడంతో పాటు పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వాక్‌వే ఎండ్ కావడంతో పాటు బాలకృష్ణ నివాసం వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు వాక్‌వే ఎండ్ అవుతుంది. ఇలా కాకుండా పార్కు చుట్టూ ఎక్కడా వాకర్లు ఆగకుండా ఉండే విధంగా మంత్రి కన్‌స్ట్రక్షన్స్ వెనుక వైపు నుంచి కనెక్టివిటీ ఇవ్వడానికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. వర్షాలు వచ్చిన ప్రతిసారి పార్కింగ్ స్లాట్‌లో బాగా దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ కాంక్రీట్ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. కేబీఆర్ పార్కు ముందు వరద నీరు నిల్వకుండా క్యాచ్‌పిట్లు నిర్మించాలని సూచించారు.

మణిపూర్ దారుణాన్ని ఖండిస్తున్నాం: రాష్ట్రీయ నారీ సమాజ్



మాట్లాడుతున్న అధ్యక్షురాలు లక్ష్మి

పంజగుట్ట: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల పట్ల అల్లరిమూకలు సాగించిన అమానుష చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్రీయ నారీ సమాజ్ జాతీయ అధ్యక్షురాలు పి.లక్ష్మి అన్నారు. అక్కడ ఇంత జరుగుతున్నా అడ్డుకోలేక పోతున్న ముఖ్యమంత్రి ఇంకా పదవిలో ఎలా కొనసాగుతున్నారని ఆమె ప్రశ్నించారు. శనివారం సోమాజిగూడలోని నారీ సమాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... వెంటనే చంఢీఘడ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో మహిళలకు సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ సాధనకై త్వరలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మహిళా ప్రజా ప్రతినిధులతో సహా, ప్రధాని, రాష్ట్రపతిని కలిసి వినతిపత్రాలు ఇస్తామన్నారు. ఇదిలా ఉండగా చత్తీస్‌ఘడ్ నారీ సమాజ్ అధ్యక్షురాలిగా మమతా సాహు, మహారాష్ట్ర అధ్యక్షురాలిగా విజయా మహేంద్ర, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి నియమించామన్నారు. త్వరలోనే అన్ని రాష్ట్రాల్లో కార్యవర్గం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రీయ నారీ సమాజ్‌కు ఇప్పటివరకు అడ్‌హక్ కమిటీ ఉండేదని దాన్ని పూర్తిస్థాయి కమిటీగా నియమించినట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షురాలిగా పి.లక్ష్మి, గౌరవ సలహాదారులుగా బోనం ఊర్మిళ, ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ శాంత కుమారి, సెక్రటరీగా స్వరూప, జాయింట్ సెక్రటరీగా నీనాసింగ్, కోశాధికారిగా పి.సుజాత, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కల్పన, జ్యోతిలను నియమించారు.

అర్హులందరికీ దళితబంధు: ఎమ్మెల్యే మాగంటి



అధికారులు, కార్పొరేటర్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: నియోజకవర్గంలో అర్హులైన వారికి దళితబంధు పథకం వర్తిస్తుందని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం రెండో విడత కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని సూచించారు. అధికారులు, కార్పొరేటర్లు కూడా అభ్యర్థుల విషయంలో ఎంతో పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి తప్పిదం జరగకుండా చూసుకోవాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్ పద్మ, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు.

మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లు అప్రమత్తం



వరద నీటి ప్రభావిత ప్రాంతాల్లో మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లు

బంజారాహిల్స్: ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలోని సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలో మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లు అప్రమత్తం అయ్యాయి. వరద నీటి ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. సర్కిల్ పరిధిలో మొత్తం 8 బృందాలు ఏర్పాటు చేసినట్లు ఈఈ ఇందిరాభాయి తెలిపారు. ఒక్కో టీమ్‌లు ముగ్గురు లేబర్‌తో పాటు ఒక డ్రైవర్ ఉన్నారన్నారు. అలాగే నాలుగు స్టాటిక్ టీమ్‌లు కూడా ఏర్పాటు చేశామని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వీరు అప్రమత్తంగా ఉంటూ వరద నీరు నిలిచిపోతే వెంటనే మ్యాన్‌హోల్ మూతలను ఎత్తి నీళ్ళు పోయే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. సిబ్బందిని మూడు షిఫ్ట్‌లలో పనిచేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కలుషిత నీటి సమస్యల నివారణకు చర్యలు



బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంగీత

శ్రీనగర్‌కాలనీ: వర్షాకాలంలో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడలోని సంజయ్ గాంధీనగర్‌తో పాటు పలు బస్తీల్లో జీహెచ్ఎంసీ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. గత రెండువారాలుగా డ్రైనేజీ పొంగడం, తాగునీటితో డ్రైనేజీ వాటర్ కలుస్తుడటం వంటి సమస్యలు వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చేస్తామని, వర్షాకాలంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఆమె పేర్కొన్నారు. కలుషితనీరు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని, సమస్యలను నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.

బీజేపీ తీరుతో దేశ ప్రతిష్టకు చేటు

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహ



మాట్లాడుతున్న నరసింహ


హిమాయత్‌నగర్: మతతత్వ, విభజన రాజకీయాలతో బీజేపీ దేశ ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శనివారం సీపీఐ హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహ మాట్లాడుతూ... రోజురోజుకు పెరుగుతున్న మత హింస లౌకికవాదానికి ముప్పుగా మారుతోందన్నారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని హింసాత్మక మూకుమ్మడి దాడులకు బీజేపీ ప్రేరేపిస్తున్నదన్నారు. సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఎం.డి.సలీం, కంపల్లి శ్రీనివాస్, ఎన్. శ్రీకాంత్, ఒమర్ ఖాన్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పిన సీబీఐ దర్యాప్తు

వివేకా హత్యపై చార్జ్‌షీట్‌లో అభియోగాలన్నీ నిరాధారం

1,226 రోజుల దర్యాప్తులో సీబీఐ సాధించింది శూన్యం

దేశంలోనే ప్రముఖ న్యూస్ వెబ్‌సైట్ 'ద వైర్' విశ్లేషణ



సాక్షి, అమరావతి: 'మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు.. రాజకీయంగా అత్యంత సంచలనమైన కేసు.. దర్యాప్తు చేస్తోంది దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ. దర్యాప్తు చేపట్టిన 1,226 రోజుల తర్వాత కూడా సీబీఐ సాధించింది ఇదీ అని చెప్పడానికి ఏమీ లేదన్నది నిర్వివాదాంశం. హత్య వెనుక విస్తృత కుట్ర ఉందనే మాట చెప్పడం తప్ప.. అందుకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన అభియోగాలకు ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఆధారాలు చూపించలేకపోయింది' అని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. నిష్పాక్షికమైన థర్డ్ పార్టీగా 'ద వైర్' వెబ్‌సైట్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇటీవల దాఖలు చేసిన తుది చార్జ్‌షీట్‌లోని అంశాలను విశ్లేషించింది. రాజకీయ, నేర, న్యాయ సంబంధమైన వార్తా విశ్లేషకురాలిగా సుదీర్ఘ అనుభవం ఉన్న సరిత రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన విశ్లేషణాత్మక వ్యాసం ఇలా..

సాధించింది శూన్యం

2020 మార్చి 11న వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి బదిలీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే 120 రోజుల సమయం తీసుకుంది. మరో 474 రోజుల తర్వాత 2021 అక్టోబర్‌లో మొదటి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. వివేకా హత్యలో పాలుపంచుకున్నారని చెబుతూ ఎర్ర గంగిరెడ్డి(ఏ-1), సునీల్ యాదవ్(ఏ-2), గజ్జల ఉమాశంకర్ రెడ్డి(ఏ-3), దస్తగిరి(ఏ-4)లను నిందితులుగా పేర్కొంది. ఈ హత్య వెనుక విస్తృత కుట్రను వెలికి తీయాల్సి ఉందని చెప్పింది. సీబీఐ తుది చార్జ్‌షీట్ 2023 జూలై 20న బయటకు వచ్చింది. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వారి సన్నిహితుడు డి.శివశంకర్‌రెడ్డిలను కూడా నిందితులుగా పేర్కొంది. కానీ సీబీఐ మొదటి నుంచీ పేర్కొంటూ వచ్చిన విస్తృత కుట్ర గురించి మాత్రం ఏమీ చెప్పలేకపోయింది. హత్య వెనుక ఉద్దేశం అంటూ 14 పేరాల సుదీర్ఘ వ్యాసాన్ని చార్జ్‌షీట్‌లో పొందుపరిచింది. అందులో ఏముంది అంటే అందరికీ తెలిసిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ నేపథ్యం, వంశ చరిత్ర మాత్రమే. ఇది తప్ప వాస్తవానికి హత్య వెనుక విస్తృత కుట్ర గురించి సీబీఐ స్పష్టంగా ఏమీ చెప్పలేకపోయింది. ఇంతకీ ఇంతటి హైప్రొఫైల్ కేసుకు సంబంధించిన తుది చార్జ్‌షీట్‌లో పేర్కొన్న అంశాలు, వాటిలోని వాస్తవాలను పరిశీలిస్తే సీబీఐ దర్యాప్తులో డొల్లతనం బట్టబయలు అవుతోంది.

సీబీఐ తాను పేర్కొన్న అభియోగాలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క దానికి కూడా ఆధారం చూపించలేకపోయింది. అంతకు మించి వివేకా హత్య వెనుక ఆయన సొంత కుటుంబంలో విభేదాలు, బయట శక్తుల ప్రమేయాన్ని సీబీఐ పట్టించుకోకపోవడం విస్మయ పరుస్తోంది. చార్జ్‌షీట్‌లో సీబీఐ ఏం చెప్పింది.. అందులోని వాస్తవం ఏమిటన్నది అంశాల వారీగా పరిశీలిస్తే ఈ కేసులో సీబీఐ ఇప్పటి వరకు సాధించింది శూన్యమన్నది స్పష్టమవుతోంది. సీబీఐ చెప్పిందేమిటి? వాస్తవం ఏమిటి? అన్నది చూద్దాం.

1.వివేకా క్రియాశీలకమైన నేత?

సీబీఐ: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత. రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు.

వాస్తవం: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత కాదు. హత్యకు గురయ్యే 15 ఏళ్ల ముందు 2004లో చివరిసారిగా ఎన్నికల్లో గెలిచారు. దశాబ్ద కాలంగా రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. 2008లో స్వదేశానికి తిరిగి వచ్చిన వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం సోనియా గాంధీని కలిశారు. కానీ ఆయనకు టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం తిరస్కరించింది. వివేకా రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారని ఆయన కుమార్తె సునీతనే సీబీఐకి రెండుసార్లు చెప్పారు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో వైఎస్ విజయమ్మపై పోటీ చేసి ఓడిపోయిన తర్వాత నుంచి ఆయన రాజకీయాల నుంచి రిటైరై పోయినట్టేనని ఆమె చెప్పారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా రాజీనామా చేసిన తర్వాత నుంచి ఆయన ఎలాంటి పదవిలో లేరు. పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మ చేతిలో భారీ తేడాతో ఓడిపోయాక కాంగ్రెస్ పార్టీ కూడా ఆయన్ను పట్టించుకోలేదు. ఎమ్మెల్సీగా కూడా నామినేట్ చేయలేదు. ఆయన అసెంబ్లీలో ఓ ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం కూడా ఇందుకు కారణం అయిఉండొచ్చు.

2.అవినాశ్ బలమైన అభ్యర్థి కాదా?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వైఎస్ అవినాశ్ రెడ్డి బలహీనమైన అభ్యర్థి అని వివేకానందరెడ్డి భావించారని షర్మిల సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు.

వాస్తవం: అవినాశ్‌రెడ్డి బలహీనమైన అభ్యర్థి అన్నది పూర్తిగా అవాస్తవం. ఆయన అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో 1,90,323 ఓట్ల భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచారు. ఆయన ఎంత బలమైన అభ్యర్థో ఆ మెజార్టీనే చెబుతుంది. ప్రత్యేక హోదా సాధన డిమాండ్‌తో పార్టీ నిర్ణయం మేరకు తన ఎంపీ పదవికి 2018లో రాజీనామా చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అవినాశ్‌రెడ్డి మరింత భారీ మెజార్టీతో అంటే 3,80,976 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డిపై అంత మెజార్టీ సాధించడం విశేషం. ఏ రకంగా చూసినా అవినాశ్‌రెడ్డి బలమైన అభ్యర్థి అన్నదాంట్లో సందేహం లేదు. వివేకానందరెడ్డి తాను హత్యకు గురికావడానికి ముందు వరకు కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేశారని ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు. వివేక హత్యకు గురైన ముందు రోజు రాత్రి కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం జమ్మలమడుగులో ప్రచారం చేశారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పినట్టు వెల్లడించారు. అవినాశ్‌రెడ్డే ఎంపీ అభ్యర్థి అన్న విషయంలో మరో మాటే లేదని వివేకానందరెడ్డి సోదరి వైఎస్ విమల కూడా స్పష్టం చేశారు. ఎంపీగా అవినాశ్ గెలుపు కోసం వివేకా చివరి వరకు ప్రచారం చేశారని కూడా ఆమె చెప్పారు. ప్రస్తుతం కొందరు రాజకీయ దురుద్దేశంతో అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

3. షర్మిల వాంగ్మూలంలో చెప్పినదానికి ఆధారం ఎక్కడ?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా షర్మిల కానీ, విజయమ్మ కానీ పోటీ చేయాలని వివేకా భావించారనే విషయాన్ని షర్మిల వెల్లడించారు.

వాస్తవం: కడప ఎంపీ అభ్యర్థిత్వం విషయంపై వివేకానందరెడ్డి తనతో చెప్పినట్టుగా షర్మిల వెల్లడించిన సమాచారానికి ఎలాంటి ఆధారం లేదు. ఎంపీగా తానుగానీ తన తల్లి విజయమ్మగానీ పోటీ చేయాలని వివేకా చెప్పినట్టు వాంగ్మూలం ఇచ్చిన షర్మిల.. అందుకు ఎలాంటి ఆధారం చూపించలేకపోయారు. ఎంపీ టికెట్ అంశంపై వారిద్దరు మాట్లాడుకున్నట్టు కూడా గతంలో ఎప్పుడూ మీడియాలోగానీ పార్టీ వర్గాలుగానీ చెప్పలేదు. సీబీఐ ఎలాంటి ఆధారం గురించి పేర్కొన లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన రెండేళ్ల తర్వాత షర్మిల తన సోదరుడితో రాజకీయంగా విడిపోయి తెలంగాణలో సొంతంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ విషయం కూడా ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకున్నదే. ఒక వేళ కడప ఎంపీ అభ్యర్థి విషయంపై వివేకానందరెడ్డికి వేరే అభిప్రాయం ఉన్నా సరే రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపించదు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మపై పోటీ చేసినప్పటి నుంచి వైఎస్సార్ కుటుంబ వ్యవహారాల్లో ఆయన పాత్ర పెద్దగా లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ రాజకీయ నిర్ణయాల్లో కూడా ఆయన పాత్ర పెద్దగా ఏమీ లేదన్నది ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ తెలిసిన విషయమే. వివేకానందరెడ్డిపై సానుకూల దృక్పథంతో వైఎస్ జగన్ ఆయన్ను వైఎస్సార్ జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ చేశారు. కానీ వివేకా ఏనాడూ కూడా పార్టీ ముఖ్య నేతగా ఉండలేదు.

4. ఎమ్మెల్సీ ఎన్నికలపై సీబీఐ చెప్పింది కట్టుకథే

సీబీఐ: 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి కారణం. అవినాశ్‌రెడ్డి అనుచరుడు డి.శివశంకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావించినప్పటికీ వైఎస్ జగన్ తన చిన్నాన్న వివేకానందరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. దాంతో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి పని చేశారు. దాంతో వివేకా ఆగ్రహంతో డి.శివశంకర్‌రెడ్డిని దూషించారు.

వాస్తవం: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివ శంకర్‌రెడ్డి కారణమనడానికి సీబీఐ ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. ఆ ఎన్నికల్లో ఆ జిల్లాలోని 10 నియోజకవర్గాల పరిధిలోని 800 మందికిపైగా ఓటర్లలో ఎవర్ని ప్రలోభాలకు గురిచేశారో కూడా చెప్పలేకపోయింది. ఆ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థి బీటెక్ రవితో సీబీఐ కనీసం మాట్లాడనే లేదు. ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి, ఆయన హత్యకు సంబంధం ఉన్నట్టుగా కూడా సీబీఐ ఎలాంటి ఆధారాన్ని చూపించనే లేదు. రెండేళ్ల క్రితం నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విషయంపై తలెత్తిన వివాదం వల్ల తమను దూషించారనే ఉద్దేశంతో 2019 ఎన్నికల ముందు హత్యకు ఎవరైనా ప్రయత్నిస్తారా? అందులోనూ 2014 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన అభ్యర్థి కుటుంబం 2019 ఎన్నికల ముందు హత్య వంటి దుందుడుకు పనులకు ఎందుకు ఒడిగడుతుంది? పైగా 2019 ఎన్నికల్లో 3.80 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచిన అవినాశ్ రెడ్డికి వివేకాతో రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది ఉంటుంది? ఏమాత్రం ఉండదు. సీబీఐ తమ ఆరోపణకు ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది.

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో విభేదాలు

షమీమ్ అనే మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. వివేకా గుండెకు ఆపరేషన్ చేసుకున్నప్పటికీ ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ పులివెందులలో ఉండటం లేదు. హైదరాబాద్‌లో తన కుమార్తె సునీత నివాసంలో ఉంటున్నారు. నెలకు ఒకట్రెండుసార్లు పులివెందుల వచ్చి వెళుతున్నారు. కుమార్తె సునీత ఏడాదికి ఒకట్రెండుసార్లు మాత్రమే వస్తున్నారు. 'షమీమ్‌తో మా నాన్న సహజీవనం చేస్తున్నారని 2011లో బయటపడినప్పటి నుంచి ఆయనతో నేను సఖ్యతగా లేను. పులివెందులకు ఎప్పుడోగాని వెళ్లడం లేదు. 2018లో క్రిస్మస్ తర్వాత మళ్లీ నేను పులివెందుల వెళ్లనే లేదు. నా భర్త ఎన్.రాజశేఖరరెడ్డి మాత్రం అప్పుడప్పుడు వెళుతుండేవారు' అని సునీత చెప్పారు. వివేకానందరెడ్డి తన పేరును అక్బర్‌ఖాన్‌గా మార్చుకుని షమీమ్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు ఉన్నారు. షమీమ్ కుటుంబం నిర్వహణ బాధ్యత చూస్తుండటంతోపాటు ఆమె చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. బలపనూరులో ఆమె ఇంటి పై అంతస్తును నిర్మించడంతోపాటు 8 సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. ఇక వివేకానందరెడ్డి మొదటి భార్య సోదరులు తనను బెదిరించేవారని షమీమ్ సీబీఐకి చెప్పారు. పెద్ద భార్య పెద్ద సోదరుడు శివప్రకాశ్‌రెడ్డి తన ఇంటికి వచ్చి బెదిరించారని తెలిపారు. తన కుమారుడికి హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సీటు ఇప్పించడంతోపాటు అక్కడే ఓ ఇల్లు కొని ఇచ్చి.. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని వివేకా షమీమ్‌కు మాట ఇచ్చారు. కానీ అంతలోనే వివేకా హత్యకు గురయ్యారు.

బయటి శక్తుల పాత్ర పట్టించుకోని సీబీఐ

వివేకా హత్య కేసు విషయంలో సీబీఐ దర్యాప్తు ఇప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వనే లేదు. కుటుంబ విభేదాలు, రాజకీయంగా అడ్డుకునేందుకు యత్నించారంటూ సీబీఐ చెబుతున్న కారణాలేవీ కూడా నమ్మదగ్గవిగా లేవు. వాటికి ఎలాంటి ఆధారాలూ లేవు. అదే సమయంలో వివేకా కుటుంబంలో విభేదాలు, ఇతర అంశాలను కూడా లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి కుటుంబంలో విభేదాలు అనే అంశాన్నే సీబీఐ ప్రధానంగా ప్రస్తావిస్తుండటం కేవలం కేసును తప్పుదారి పట్టించేందుకేనని స్పష్టమవుతోంది. వివేకా హత్య వెనుక బయటి శక్తుల ప్రమేయంపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టి సారించనే లేదు. ఇప్పటి వరకు కేవలం సీబీఐ అప్రూవర్‌గా మార్చిన నిందితుడు దస్తగిరి, వాచ్‌మన్ రంగయ్య వాంగ్మూలాలనే ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేస్తోంది. కానీ వారు నిజాలే చెబుతున్నారడానికి ఆధారం ఏమిటి?

అప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వివేకా

వివేకానందరెడ్డి షమీమ్‌ను రెండో వివాహం చేసుకోవడంతోపాటు ఆస్తి ఇస్తానని చెప్పడంతో మొదటి భార్య కుటుంబం ఆగ్రహించింది. కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనకు చెక్ పవర్ రద్దు చేసింది.చెక్‌పవర్ రద్దు కావడంతో వివేకా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. మద్యం, ఇతర అవసరాలకు కూడా చేతిలో డబ్బులు లేక అల్లాడిపోయారని వివేకా ఇంట్లో పనివానిగా ఉన్న పెందింటి రాజశేఖర్ చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆయన సునీల్ యాదవ్, దస్తగిరిలతో సన్నిహితమయ్యారు. వారు చెప్పినట్టు చేస్తే వారిద్దరు డబ్బులు తెస్తారని ఎర్ర గంగిరెడ్డి వివేకాతో చెప్పేవారు. ఎనిమిది మంది నుంచి రూ.5 కోట్లు అప్పు తీసుకున్నారు. ఓసారి పెందింటి రాజశేఖర్ వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. తమ ఇంట్లో డబ్బు కోసం ఏదో గొడవ జరుగుతోంది.. వివేకానందరెడ్డి బాగా తాగేసి గొడవ చేస్తున్నారని చెప్పారు. 'మా నాన్న వివేకా ఇష్టానుసారంగా అప్పులు చేసి, తీర్చకపోవడంతో కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ట్రాక్ రికార్డ్ సరిగా లేకపోవడంతో కంపెనీలకు బ్యాంకులు అప్పులు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. కంపెనీల నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు అడ్డంకిగా ఉండకూడదనే మా నాన్న చెక్ పవర్‌ను రద్దు చేశాం' అని సునీత చెప్పారు. వాస్తవం ఏమిటంటే.. వివేకానందరెడ్డి హత్య తర్వాత ఆయన స్థానంలో సునీత ఆ కంపెనీల్లో డైరెక్టర్ అయ్యారు. జీవించి ఉండగా రోజువారి ఖర్చుల కోసం వివేకా ఇబ్బందులు పడ్డారు. కానీ ఆయన మరణించిన తర్వాత కొన్ని నెలలకే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆ కంపెనీ అప్పులన్నీ చాలా వరకు తీర్చేశారు. కంపెనీలన్నీ గాడిలో పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో 93 ఎకరాల భూమిని సౌభాగ్యమ్మ, సునీత పేరిట బదిలీ చేశారు.

నగర వార్తలు

చిక్కడపల్లి టు చైనా!

- ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో మోసపోయిన నగర వాసి
- రూ.28 లక్షలు పోవడంతో సైబర్ ఠాణాలో కేసు
- దీని దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన భారీ మోసం
- హాలిడే కోసం వెళ్లి చిక్కిన కీలక సూత్రధారి ప్రకాష్



ప్రశంసా పత్రాలను అందుకున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి రూ.28 లక్షలు మోసపోయిన ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్ కేసు తీగలాగిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దుబాయ్ మీదుగా చైనాలో ఉన్న డొంక కదిపారు. ఈ కేసులో అనూహ్యంగా తెరపైకి వచ్చిన నలుగురు హైదరాబాదీయులు సైబర్ నేరాల్లో కొత్త కోణాన్ని బయటపెట్టారు. ఐసీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడిన కొత్వాల్ సీవీ ఆనంద్ ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అధికారులకు రివార్డులు అందించారు.

- చిక్కడపల్లి వాసి శివకుమార్ ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో రూ.28 లక్షలు కోల్పోయి మార్చిలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ గంగాధర్ బాధితుడి నగదు ఆరు బ్యాంకు ఖాతాల్లోకి, వాటి నుంచి మరో 48 అకౌంట్లలోకి వెళ్లినట్లు గుర్తించారు. వీటి విషయం జాతీయ స్థాయిలోని సైబర్ కో-ఆర్డినేషన్ సెంటర్‌కు అందించగా...వాటిలో దేశ వ్యాప్తంగా వివిధ బ్యాంకు ఖాతాల నుంచి మరో రూ.584 కోట్ల లావాదేవీలు జరిగినట్లు సమాధానం వచ్చింది.
- ఆ బ్యాంకు ఖాతాల్లో రాధిక మర్చంట్స్ పేరుతో ఉన్న షెల్ కంపెనీది కూడా ఉంది. ఈ అకౌంట్‌తో లింకై ఉన్న సెల్ నెంబర్ నగరానికి చెందిన మునావర్ వాడుతున్నట్లు తెలియడంతో అప్రమత్తమైన అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తనతో పాటు నగర వాసులైన ఆరుల్ దాస్, సమీర్ ఖాన్, ఎస్.సుమేర్‌లను వికాస్, మనీష్, రాజేష్‌లు లక్నో పిలింపించారని బయటపెట్టాడు. వీరి ముంబై హవాలా నెట్‌వర్క్‌లో భాగమైన నయీమ్... సమీర్‌కు బంధువు కావడంతో పరిచయాలు ఏర్పడ్డాయి.
- మూడు నెలలు లక్నోలో ఉన్న నలుగురు నగర వాసులూ నకిలీ గుర్తింపు కార్డులతో 33 షెల్ కంపెనీలు, 65 బ్యాంకు ఖాతాలు తెరిచి వారికి అప్పగించి వచ్చారని తేలింది. వీళ్ళకు ఒక్కో ఖాతాకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ముట్టిందని బయటపెట్టారు. వీరందించిన ఖాతాల్లో మరో రూ.128 కోట్ల లావాదేవీలు జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఇలా మొత్తం రూ.713 కోట్లు ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో దేశం దాటేశాయని అధికారులు తేల్చారు. నగరం, ముంబైల్లో ఉన్న వారిని పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులకు అహ్మదాబాద్‌కు చెందిన ప్రకాష్, కుమార్ వ్యవహారాలు తెలిశాయి.
- కీలకమైన ప్రకాష్ అనునిత్యం దుబాయ్, చైనాలకు వెళ్లి వస్తున్నాడని గుర్తించారు. జూన్ 30న చైనా నుంచి వచ్చిన ఇతగాడు తన నెట్‌వర్క్‌లోని ఓ వ్యక్తితో వాట్సాప్ ద్వారా మాట్లాడుతున్నాడు. ఇతడి నెంబర్ తెలుసుకున్న అధికారులు వాట్సాప్ యాక్టివేట్ అయిన నెట్‌వర్క్ గుర్తించారు. దీనికి లింకైన నెంబర్ లోకేషన్ ఆధారంగా ప్రకాష్ ముంబైలో ఉన్నట్లు పసిగట్టారు. హాలిడే కోసం అక్కడకు వెళ్ళిన ఇతడితో పాటు కుమార్‌ను పట్టుకుని సిటీకి తీసుకువచ్చారు. వీరి నుంచి భారీగా ల్యాప్‌టాప్స్, ఫోన్లు, షెల్ కంపెనీల లెటర్ హెడ్స్ కూడా స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇలాంటి నేరగాళ్లు, నేరాలపై రిజర్వుబ్యాంకు, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, జాతీయ దర్యాప్తు సంస్థకు సమాచారం ఇస్తామని సీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అసలే అక్రమం... ఆపై నకిలీ!

- ఉత్తరాది నుంచి వివిధ ఔషధాలు తెస్తున్న ముఠా
- తక్కువ రేటుకు అమ్ముతూ వినియోగదారులకు ఎర
- ఇద్దరు అరెస్టు, పరారీలో మరో నలుగురు నిందితులు
- రూ.29.72 లక్షల విలువైన ఔషధాలు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరప్రదేశ్, ఢిల్లీ నుంచి నకిలీ, అక్రమ ఔషధాలను తీసుకువచ్చి వివిధ ఆస్పత్రులతో పాటు సామాన్యులకు విక్రయిస్తున్న ముఠా గుట్టును సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఆరుగురు సభ్యులున్న ముఠాలో ఇద్దరిని అరెస్టు చేసి రూ.28.72 లక్షల విలువైన ఔషధాలు స్వాధీనం చేసుకున్నట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు శనివారం వెల్లడించారు. కర్మన్‌ఘాట్‌కు చెందిన పోకల రమేష్, పెద్ద అంబర్‌పేట వాసి బి.రాఘవరెడ్డి వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారులు. ఇందులో తీవ్రనష్టాలు రావడంతో తేలిగ్గా డబ్బు సంపాదించడానికి అనువైన మార్గాలు అన్వేషించారు. రమేష్‌కు సమీప బంధువైన పూర్ణచంద్రరావుకు ఫార్మ రంగంలో అనుభవం ఉంది. గతంలో ఆల్ప్రాజోలమ్ టాబ్లెట్లు అక్రమంగా విక్రయిస్తూ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులకు చిక్కాడు. ఇతగాడు ఉత్తరాది నుంచి అక్రమ, నకిలీ ఔషధాలను సిటీకి తీసుకువచ్చి తక్కువ ధరకు విక్రయిద్దామంటూ సలహా ఇచ్చాడు. లైసెన్సు లేకపోయినా ఈ దందాలోకి దిగిన వీరితో పాటు లక్ష్మణ్ అనే వ్యక్తి కూడా ముఠాలో చేరాడు. వీరంతా కలిసి ఉత్తరప్రదేశ్‌కు చెందిన నదీమ్, ఢిల్లీ వాసి అరుణ్ చౌదరి నుంచి ఈ ఔషధాలను తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నారు. ఎలాంటి బిల్లులు, పత్రాలు లేకుండానే కొరియర్‌లో సిటీకి రప్పిస్తున్నారు. ఈ ఔషధాలను మార్కెట్ రేటు కంటే 30 నుంచి 40 శాతం తక్కువ ధరకు అమ్ముతూ రోగులను ఆకర్షిస్తున్నారు. కొన్ని ఆస్పత్రులకు సైతం వీటిని సరఫరా చేస సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠా వ్యవహారాలపై ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఎస్సై మహ్మద్ ముజఫర్ తన బృందంతో వలపన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రి వద్ద రమేష్, రాఘవలను పట్టుకున్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న ఔషధాల్లో డాక్టర్ రెడ్డీస్, గ్లెన్‌మార్క్, అరిస్టో సహా వివిధ కంపెనీల పేర్లతో ఉన్న వాటితో పాటు ఆస్పత్రులకు సరఫరా అయ్యే 'నాట్ ఫర్ సేల్' మందులు కూడా ఉన్నాయి. ఈ ముఠా కొన్ని ఔషధాలను వివిధ వైద్యశాలలకు సరఫరా చేసినట్లు గుర్తించారు. కేసును మలక్‌పేట పోలీసులకు అప్పగించారు.

ఫర్టీ9లో అత్యాధునిక ఏఐ ఆధారిత వ్యవస్థ

లక్డీకాపూల్: ఆధునిక పద్ధతుల ద్వారా సులభతరంగా సంతాన సాఫల్యం పొందవచ్చని ఫర్టీ 9 ఫర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.జ్యోతి తెలిపారు. సంతాన లేమి సమస్యతో బాధపడుతున్న వారికి ప్రస్తుతం సరికొత్త పరిజ్ఞానంతో వైద్య సేవలు అందిస్తున్నామ చెప్పారు. ఈ నెల 25వ తేదీన వరల్డ్ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత 'ఆర్ ఐ విటెనెస్ సిస్టం'ను ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఫర్టీ 9 ఫర్టిలిటీ సెంటర్ లో ప్రముఖ సినీ నటి ప్రణీత ఈ సిస్టంను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన లోగోను శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో డాక్టర్ సి. జ్యోతి విడుదల చేశారు. ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు 50 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు తెలిపారు.



పచ్చబొట్టు చెదిరిపోయింది!

- ఓ యువతితో సహజీవనం
- మరో యువతితో ప్రేమాయణం
- చివరకు యువకుడి కథ విషాదాంతం

బంజారాహిల్స్: యువతిని గాఢంగా ప్రేమించాడు.. ఆమె ఫొటోను ఛాతిమీద పచ్చబొట్టుగా వేయించుకున్నాడు... పెళ్లి చేసుకోవాలని ఎన్నో కలలు కన్నాడు...ఆమెతో కలిసి చెట్టాపట్టాలేసుకొని తిరిగాడు. తీరా పెళ్లి మాట ఎత్తేసరికి ప్రియురాలు నో చెప్పడంతో ఆ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కర్నూలుకు చెందిన శివ ప్రసాద్(23) ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్‌లో గది అద్దెకు తీసుకొని కవిత అనే యువతితో సహజీవనం చేస్తున్నాడు. ఒక వైపు సహజీవనం చేస్తూనే మరో వైపు అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ నర్సుతో ప్రేమలో పడ్డాడు. ఇద్దరూ పీకల్లోతు ప్రేమలో మునిగిపోయారు. ఆమె ఫొటోను..పేరును కూడా పచ్చబొట్టు వేయించుకున్నాడు. తనతో సహజీవనం చేస్తూ మరో యువతితో ప్రేమ పేరుతో తిరుగుతున్న శివ ప్రసాద్‌ను సహజీవనం చేస్తున్న యువతి కవిత మూడు రోజుల క్రితం నిలదీసింది. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తనను మోసం చేశాడని భావించిన కవిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది జరుగుతుండగానే శుక్రవారం సాయంత్రం ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుందామని శివ ప్రసాద్ అడిగాడు. అందుకు ఆమె నిరాకరించింది. సహజీవనం చేస్తున్న యువతి నిద్రమాత్రలు మింగి ఆస్పత్రిలో చేరడం, ప్రేమించిన యువతి పెళ్లికి అంగీకరించకపోవడంతో శివప్రసాద్ శనివారం తెల్లవారుజామున తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోలుకున్న యువతి కవితను పోలీసులు ఆస్పత్రి నుంచి పునరావాస కేంద్రానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే మైనంపల్లి నుంచి ప్రాణహాని ఉంది

రియల్టర్ ముక్కెర తిరుపతి రెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

పంజగుట్ట: ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని ఇటీవల అజ్ఞాతంలోకి వెళ్లి వార్తల్లో నిలిచిన రియల్టర్ ముక్కెర తిరుపతిరెడ్డి కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చేయడంలేదన్నారు. అల్వాల్ హిల్స్, హైటెన్షన్ రోడ్డులో తనపేరుమీద, తన భార్య, భార్య సోదరి పేరుపై మొత్తం 3.31 ఎకరాల భూమి ఉందని, దీని పక్కనే మైనంపల్లికి చెందిన 1.9 ఎకరాల భూమి ఉందని, దీన్ని ఆధారంగా చేసుకుని తమ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. మైనంపల్లి అనుచరులు తనను చంపేందుకు యత్నిస్తున్నారని, అందుకే తాను అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనర్, డీసీపీని కలిసి తనకు ప్రాణాపాయం ఉందని వివరించినట్లు తెలిపారు. సమావేశంలో మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్ రెడ్డి, బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్, బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కన్వీనర్ ఆర్.కె.శ్రీనివాస్, బీజేపీ మౌలాలి కార్పొరేటర్ సునీతా యాదవ్, బీజేపీ నాయకులు జి.కె.హనుమంతరావు, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టాభిషేకం..ఉప్పొంగిన ఉత్సాహం

ఘనంగా ట్రిపుల్ ఐటీ 22వ స్నాతకోత్సవం



ట్రిపుల్‌ఐటీలో పట్టాలు పొందిన విద్యార్థుల కేరింతలు


రాయదుర్గం: గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ-హైదరాబాద్ 25వ వసంతంలోకి అడుగిడి..22వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొంది. శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులున తల్లిదండ్రులు, చదువులు చెప్పిన గురువుల సమక్షంలో పట్టాలు అందుకోని అంతులేని ఆనందం వ్యక్తం చేశారు. దీంతో ప్రాంగణమంతా సందడి వాతావరణంలో మునిగింది. ఈ సందర్భంగా 519 మంది గ్రాడ్యుయేట్‌లకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఇక మొదటిసారిగా ఎంఎస్ బై రీసెర్చ్ అండ్ డుయల్ డిగ్రీ స్టూడెంట్స్ కూడా పట్టాలు పొందారు. 25 మందికి పీహెచ్‌డీలు అందించారు.

జీఐఎల్‌టీలో 'స్పాట్ అడ్మిషన్ల'కు గడువు

రాయదుర్గం: రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో స్పాట్ అడ్మిషన్లు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏఐసీటీఈ అనుమతితో నిర్వహిస్తున్న ఈ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమో ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, డిప్లొమో ఇన్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సును నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సులో 60 మంది చేరడానికి అవకాశం ఉంటుంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ఇప్పటికే పాలిసెట్ ద్వారా భర్తీ కాగా మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సమర్పించాలి. సీట్ల కేటాయింపును 28వ తేదీన నిర్వహిస్తారు. వివరాలకు ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో లేదా 9912342053 నెంబర్‌లో సంప్రదించాలి.

పప్పుచారులో పాము ఘటనపై విచారణకు ఆదేశం

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) క్యాంటీన్‌లో పప్పుచారులో పాము వచ్చిన సంఘటనపై సంస్థ యజమాన్యం విచారణకు ఆదేశించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ కమిటీలో ఇద్దరు యూనియన్, అసోసియేషన్ నుంచి కాగా యజమాన్యం నుంచి ముగ్గురు సభ్యుల్ని నియమించారు. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగిందా.. యాదృచ్ఛికంగా చోటు చేసుకుందా అనే కోణంలో కమిటీ విచారణ చేపట్టనుందని తెలిసింది.



దేవదా... నా నటన నచ్చిందా?

సినిమాలలోని పాపులర్ సీన్‌లను రీక్రియేట్ చేసి ఆనందించడం మనకు కొత్త కాదు.

సంజయ్‌లీలా బన్సాలీ 'దేవదాస్' సినిమాలో 'పారు' పాత్రలోని ఐశ్వర్యారాయ్‌ని అనుకరిస్తూ కైరా ఖన్నా అనే బాలిక చేసిన వీడియో తాజాగా వైరల్ అయింది.

ఐకానిక్ సినిమాలలోని పాపులర్ సీన్‌లను అనుకరిస్తూ కైరా చేసే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

'జిస్ వక్త్ తుమ్హారే సాథ్ హోతి హమ్ ఉస్ వక్త్ బద్నామి కా బీ డర్ నహీ లగ్తా'

'దస్ సాల్ పహ్లే తుమ్హారే నామ్ కా దియా జలాయ థా మైనే. ఉసే ఆజ్ తక్ బుజ్నే నహీ దియా'... ఇలా 'దేవదాస్' సినిమాలోని 'పారు' పాపులర్ డైలాగ్‌లతో 'వావ్' అనిపించింది కైరా ఖన్నా.

'డైలాగుల నుంచి ఎక్స్‌ప్రెషన్ వరకు అద్భుతం'

'అద్భుతమైన యాక్టింగ్ స్కిల్స్ ఉన్న కైరాకు బాలీవుడ్‌లో బ్రైట్ ఫ్యూచర్ ఉంది'... అంటూ నెటిజనులు కైరా ఖన్నాపై ప్రశంసల వర్షం కురిపించారు.

కట్టప్పా కమాన్... ఇదిగో బాహుబలి థాలీ

చెన్నైలోని పొన్నుస్వామి హోటల్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన 'బాహుబలి థాలీ' సోషల్ మీడియా స్టార్స్‌గా మారింది. 'మీలో బాహుబలి థాలీని టచ్ చేసే వీరుడు ఎవరు?' అని ఒక నెటిజనుడు కామెంట్ పెట్టాడు.

ట్విట్టర్ యూజర్ అనంత్ రూపన్‌గూడి 'బాహుబలి థాలి' వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియోలో ఇద్దరు వ్యక్తులు థాలీ భారీ ప్లేట్‌ను కస్టమర్‌ల దగ్గరకు తీసుకు వస్తున్న దృశ్యం కనిపిస్తుంది.

ఈ వీడియోను చూసి.... 'నోరూరుతోంది సుమీ!' అని లొట్టలు వేస్తున్న వారితో పాటు-

'ఇది గుడ్ ఐడియా కాదు. రెండు ముక్కల్లో చెప్పాలంటే ఫుడ్ వేస్టేజీ' అని విమర్శించిన వారు ఉన్నారు.

ఇంతకీ బాహుబలి థాలి ధర ఎంతనుకుంటున్నారు?

కేవలం రూ.1399 ప్లస్ జీఎస్‌టీ మాత్రమే!



వైరల్

టమాటా చిత్ర కథ

'చికెన్ తినాలంటే చికెన్ మాత్రమే తిననక్కర్లేదు. గాల్లో వేలాడుతున్న కోడిని చూస్తూ, ఊహించుకుంటూ బ్రహ్మాండంగా తినవచ్చు' అనే గొప్ప సత్యాన్ని 'అహ నా పెళ్లంట' సినిమాలో లక్ష్మీపతి (కోట శ్రీనివాసరావు) జనులకు చెప్పకనే చెప్పారు. 'ఇప్పుడు ఆ సినిమాని రీమేక్ చేస్తే గాలిలో వేలాడుతున్న కోడికి బదులు టమాటాలు ఉంటాయి' అని నెటిజనులు ఒకటే జోకులు!



1 ఒక మహిళ దుబాయ్‌కి వెళ్లింది. ఇండియాకు తిరిగి వచ్చే ముందు...'నీ కోసం ఏం తీసుకురమ్మంటావు?' అని తల్లిని అడిగింది. 'బంగారు నగలో, లగ్జరీ గిఫ్టో అడిగి ఉంటుంది' అని అనుకుంటారు చాలా మంది.

కానీ ఆ తల్లి బంగారం కంటే విలువైన టమాటాలను అడిగింది. ఒకటి కాదు రెండు కాదు...'పది కిలోల టమాటాలు తీసుకురామ్మా' అని కూతురిని అడిగింది. పదికిలోల టమాటాలను పెరల్‌పెట్ స్టోరేజ్ జార్‌లలో ప్యాక్ చేసి ఇండియాకు తీసుకువచ్చింది కూతురు. ఈవిడ సోదరి ట్విట్టర్‌లో షేర్ చేసిన దుబాయ్ టమాటాల స్టోరీ వైరల్ అయింది.

•••

2 బంగారు నగలు అంటే ఎవరికి మాత్రం మక్కువ ఉండదు? అయితే టమాటాలేమో బంగారం కంటే విలువైపోయాయి. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బాలీవుడ్ నటి ఉర్ఫీ జావెద్

'యూరేకా... టమాటాలతో ఆభరణాలు' అని అరిచింది. టమాటాలను చెవిరింగులుగా ధరిస్తూ 'న్యూ గోల్డ్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటో షేర్ చేసింది.

•••

3 శిల్పాశెట్టి షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ 11 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది. ఇక వీడియో విషయానికి వస్తే... టమాటాల కోసం సూపర్‌మార్కెట్‌కు వెళుతుంది శెట్టి. టమాటాలన్నీ కూడబలుక్కొని 'టచ్‌మీ నాట్' అన్నట్లుగా చూస్తుంటాయి. టమాటాలను చేతిలో తీసుకున్న ప్రతిసారీ ఆమె నటించిన 'దడ్కన్' సినిమాలోని 'ఖబడ్దార్. హౌ డేర్ యూ' అనే డైలాగ్ ప్లే అవుతుంటుంది!



బసంతీ... వాట్ ఈజ్ యువర్ నేమ్?

'హాలీవుడ్ షోలే' పేరుతో విడుదలైన ఏఐ జెనరేటెడ్ వీడియో ఇమేజ్‌లు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. 'షోలే'లోని ప్రధాన క్యారెక్టర్‌లకు హాలీవుడ్ ప్రముఖ నటుల ముఖాలను సూపర్ ఇంపోజ్ చేశారు.

ఈ వీడియో క్లిప్‌లలో రాబర్ట్ డి నిరో 'జై', అల్ పసినో 'వీరు', జూలియా రాబర్ట్స్ 'బసంతి', కెవిన్ స్పేసీ 'ఠాకూర్', జాక్ నికల్సన్ 'గబ్బర్‌సింగ్'లుగా కనిపిస్తారు. 'అంతా బాగానే ఉందిగానీ ఠాకూర్ పాత్రకు కెవిన్‌ను ఎంపిక చేసుకోవడం బాగోలేదు. ఎందుకంటే ఠాకూర్ నిజాయితీపరుడు. ముక్కుసూటి మనిషి. కెవిన్ సైకో పాత్రలకు పెట్టింది పేరు'

'షోలే అనేది ఎన్నో హాలీవుడ్ సినిమాల కాపీ. మెయిన్ ప్లాట్ 7 సమురాయ్, కొన్ని పవర్‌ఫుల్ సీన్‌లను వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ వెస్ట్ సినిమాలలో నుంచి తీసుకున్నారు'... ఇలా రకరకాలుగా నెటిజనులు స్పందించారు.

చీరదరహాసం

స్పోర్ట్స్, ఎడ్వెంచర్ యాక్టివిటీలకు చీర 'అన్‌ఫిట్' అనే భావన ఉంది. అయితే క్రమంగా ఈ భావనలో మార్పు వస్తోంది. 'శారీతో కూడా ఓకే' అనిపిస్తున్నారు కొందరు మహిళలు. తాజాగా స్కూబా డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కాత్య సైనీ చీర ధరించి కైట్ సర్ఫింగ్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో గంటల వ్యవధిలోనే లక్షలాది వ్యూస్‌ను సొంతం చేసుకుంది.



'నౌ దిస్ ఈజ్ క్రాస్ కల్చర్. ఐ లవ్ దిస్' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా...

'చీర ధరించి అడ్వెంచరస్ స్పోర్ట్స్‌లో పాల్గొనడం ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే' అని కొందరు హెచ్చరించారు. గత ఫిబ్రవరిలో సైను అనే యూజర్ పోస్ట్ చేసిన ఇలాంటి వీడియో వైరల్ అయింది. ఈ వీడియోలో ఒక నడి వయసు స్త్రీ చీర ధరించి రోప్ సైకిలింగ్ చేస్తున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది.

హెల్త్



మద్యం అలవాటు లేనివారిలోనూ

నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్!

మనలో కొంతమందికి ఫ్యాటీలివర్‌పై ఎంతో కొంత అవగాహన ఉండే ఉంటుంది. మద్యం తాగే అలవాటు ఉన్నవారి కాలేయంలో క్రమక్రమంగా కొవ్వు పెరుగుతూ ఒక దశ తర్వాత కణాలన్నీ పూర్తిగా నశించి, కొవ్వుమయం అయిపోతే... అది సిర్రోసిస్ అనే కండిషన్‌కు దారితీస్తుందనీ, అప్పుడు కాలేయ మార్పిడి తప్పదనే అవగాహన కొంత మందిలో ఉంటుంది. అయితే మద్యం తాగే వారికే ఫ్యాటీ లివర్ వస్తుందన్నది పాక్షిక సత్యమే. ఆ అలవాటు లేనివారిలోనూ వచ్చే అవకాశాలున్నాయి. ఈ కండిషన్‌నే 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' (ఎన్ఏఎఫ్ఎల్‌డీ) అంటారు. శరీరతత్త్వాన్ని బట్టి మద్యం, మాంసాహార అలవాట్లు లేకపోయినా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ రావచ్చనే అవగాహన కల్పించేదే ఈ కథనం.

మానవుల పొట్టలో కుడివైపున కాలేయం ఉంటుంది. తీసుకున్న ఆహారంలోని చక్కెరలు శక్తిగా మారాక... మిగతావి కొవ్వు రూపంలోకి మారి కాలేయంలో నిల్వ ఉంటాయి. మళ్లీ అవసరమైనప్పుడు ఉపయోగపడతాయి. ఈ నిరంతర ప్రక్రియలో కొవ్వు మోతాదులు పెరుగుతున్న కొద్దీ కాలేయ కణాలు తమ స్వగుణాన్ని కోల్పోయి కొవ్వు పేరుకున్నట్లుగా అయిపోతాయి. ఈ కండిషన్‌ను ఫ్యాటీలివర్ అంటారు. మద్యం అలవాటు ఉన్నా, పొట్ట ఎక్కువగా ముందుకొచ్చి ఉన్నా... వారిలో కాలేయం దశలవారీగా, ఎంతోకొంత ఫ్యాటీలివర్‌గా మారిపోయి ఉంటుంది.

కారణాలు: జీవనశైలి / మెటబాలిక్ డిసీజెస్‌గా పేర్కొనే డయాబెటిస్ ఉన్న వారిలోనూ, అలాగే పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోవడం (సెంట్రల్ ఒబేసిటీ), స్థూలకాయం (ఒబేసిటీ) వంటి అంశాలు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్‌కు కారణం కావచ్చు. ● ఆహారంలో పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం.

లక్షణాలు: ఆల్కహాలిక్ లివర్ డిసీజ్‌లోనైనా కొద్దిమేరకు లక్షణాలు కనిపించేమోగానీ... నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌లో చాలావరకు లక్షణాలు కనిపించవు. అయితే మనకు చాలా సాధారణం అనిపించే కొన్ని లక్షణాలు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్‌ను పట్టిస్తుంటాయి. ఉదా: పొట్ట పెరిగి, బానపొట్టలా ముందుకు రావడం. ● కొందరిలో కుడివైపు పొట్ట పైభాగంలో పొడుస్తున్నట్లుగా నొప్పి రావడం. లివర్ క్రమంగా పెరుగుతుండటంతో ఈ లక్షణం బయటపడుతుంది.



డాక్టర్ శ్రీనివాస్ నిష్టల
సీనియర్ ఇంటర్వెన్షనల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్

నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్... దశలు...

నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్‌లో నాలుగు దశలు ఉంటాయి. అవి మొదటి సింపుల్ స్టియటోసిస్ దశ. రెండోది స్టియటో-హెపటైటిస్ దశ. మూడోది ఫైబ్రోసిస్ దశ. నాలుగోదీ, చివరదీ... ఇక వెనక్కు తిప్పడానికి వీలుకాని సిర్రోసిస్ దశ.



మొదటి దశ : ఇది సాధారణమైన ఫ్యాటీ లివర్ వ్యాధి తొలి దశ. ఇందులో కాలేయ కణాల మధ్య కొద్దిగా అంటే 5 శాతం నుంచి 10 శాతం మేరకు కొవ్వు పేరుకుంటుంది.



రెండో దశ (నాశ్): ఈ దశను నాన్ ఆల్కహాలిక్ స్టియటో-హెపటైటిస్ (ఎన్ఏఎస్‌హెచ్-నాశ్) అంటారు. ఇందులో కాలేయం కొద్దిగా గాయపడటంతో పాటు కాలేయ కణాలు కొన్ని నశిస్తాయి.



మూడో దశ (ఫైబ్రోసిస్) : ఈ దశలో కాలేయం పీచుగా మారినట్లుగా కనిపిస్తుంది. దీన్నే ఫైబ్రోసిస్‌గా పేర్కొంటారు.



నాలుగో దశ (సిర్రోసిస్) : ఫైబ్రోసిస్ నుంచి కాలేయం కొవ్వుకణాలతో నిండిపోయి, పూర్తిగా తన స్వరూపాన్ని కోల్పోయి, కాలేయ మార్పిడి తప్ప ప్రత్యామ్నాయం లేని దశ వస్తుంది. ఇది వెనక్కుమరల్చలేని (ఇర్రివర్సిబుల్) దశ.

నిర్ధారణ: ● బాధితుని స్థూలకాయం, పొట్ట (సెంట్రల్ ఒబేసిటీ) చూసి డాక్టర్లు పరిస్థితిని కొంతమేర అంచనా వేయగలరు. ● కొన్ని రక్త పరీక్షలు, అలాగే డయాబెటిస్, కొలెస్ట్రాల్ మోతాదులు, ట్రైగ్లిజరైడ్ స్థాయులు పెరిగాయా అన్నదీ చూడాలి. ● అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో ఫ్యాటీలివర్ తప్పక బయటపడుతుంది. ● కొందరిలో లివర్ బయాప్సీ అవసరం. లివర్ బయాప్సీతో ఎన్ఏఎఫ్ఎల్‌డీలో అది నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీలివరా (ఎన్ఏఎఫ్ఎల్), లేక నాన్ ఆల్కహాలిక్ స్టియటో-హెపాటిక్ (నాశ్) కండిషనా అని నిర్ధారణ చేయవచ్చు. ● ఇప్పుడు 'ఫైబ్రోస్కాన్' అనే వైద్యపరీక్షతో లివర్‌లో ఏ మేరకు కొవ్వు పేరుకుంది, ఫైబ్రోసిస్ ఎంత ఉందన్న విషయంతో పాటు, మూడు నెలల తర్వాత మళ్లీ సమీక్షించి, కొవ్వు మోతాదులు పెరిగాయా, తగ్గాయా కూడా తెలుసుకోవచ్చు.


ముందస్తు నివారణకు ఈ జాగ్రత్తలు...

- **బరువు తగ్గడం :** ఉండాల్సిన దాని కంటే ఎక్కువగా బరువు ఉన్నవారు ఆహారంలో పిండి పదార్థాలను తగ్గించాలి. ప్రతి వారం అర కిలో నుంచి కిలో బరువు తగ్గించుకునేలా శ్రమించాలి.
- **ఆరోగ్యకరమైన ఆహారం :** ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తప్పనిసరి. పొట్టుతో ఉండే తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. పాలిష్ చేసిన వాటికి బదులుగా పొట్టు తీయని బియ్యం, గోధుమలు వాడాలి. రిఫైన్డ్ షుగర్స్, మైదా, స్వీట్లు తగ్గించాలి. మాంసాహారం తీసుకునేవారు చేపలు తినడం మంచిది.
- **వ్యాయామం :** చురుగ్గా ఉంటూ రోజూ ఒంటికి పనిచెప్పేలా శ్రమించాలి. రోజూ కనీసం 30 నిమిషాలకు తక్కువ కాకుండా వ్యాయామం చేయాలి.
- డయాబెటిస్‌ను తప్పకుండా అదుపులో ఉంచుకోవాలి. కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గించుకోండి. ఇందుకు వ్యాయామంతో పాటు ఒకవేళ అవసరమైతే మందులు కూడా వాడాలి.

చికిత్స : ● ఆల్కహాల్ అలవాటు లేనివారిలో దీని చికిత్సకు నిర్దిష్టంగా ఒక ప్రొటోకాల్ లేదు గానీ... దీని చికిత్స సమయంలో ఫ్యాటీలివర్ డిసీజ్‌కు దోహదపడిన అంశాలను బట్టి డాక్టర్లు చికిత్స చేస్తారు. ముఖ్యంగా బాధితుల జీవనశైలిలోనూ, ఆహారంలో మార్పులతో పాటు వ్యాయామం వంటివి సూచిస్తారు. బాధితులు ఏవైనా మందులు వాడుతుంటే, వాటి కారణంగా ఫ్యాటీలివర్ వచ్చిందని భావిస్తే, వాటిని మారుస్తారు. ● చాలా కొద్ది మందిలో మందులూ, శస్త్రచికిత్సా అవసరం కావచ్చు.

ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా ముప్పు..!

ప్రస్తుత వర్షాలు ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజల జీవితాలను మరింత అల్లకల్లోలం చేసే జ్వరమైన మలేరియాను మరింత పెంచవచ్చు. మిగతా తెలుగు రాష్ట్రాల్లో అంతగా కనిపించకపోయినా... అడవుల్లో, కొండకోనల్లో ఎప్పుడూ ఎండెమిక్‌గా ఉండే మలేరియా... ఇప్పటి వర్షాలతో మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉంది. అక్కడి ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమూ ఉంది. ఈ నేపథ్యంలో మలేరియాపై అవగాహన కోసం ఈ కథనం.



మలేరియా వ్యాధి ప్లాస్మోడియమ్ అనే ఏకకణ పరాన్న జీవి వల్ల వస్తుంది. దీన్ని అనాఫిలిస్ ఆడ దోమ వ్యాప్తి చేస్తుంది. ఈ పరాన్న జీవి నాలుగు ప్రధాన ప్రజాతులుగా... అంటే... ప్లాస్మోడియం ఫ్యాల్సిపేరమ్, ప్లాస్మోడియం ఒవ్యులా, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరీ. ప్లాస్మోడియం నోవిసై అనే మరో ప్రజాతి ఉంది గానీ ఇది కొద్ది దేశాలకే పరిమితం.

లక్షణాలు: దోమ కుట్టిన తర్వాత 7 నుంచి 14 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. చలి, తలనొప్పి, ఒళ్లునొప్పులతో పాటు జ్వరం రావడం మలేరియా ప్రధాన లక్షణం. వ్యాధిని కలిగించే పరాన్న జీవిని బట్టి లక్షణాలూ కొద్దిగా మారతాయి. భారత్‌లో ప్రధానంగా రెండు రకాలు ఎక్కువ. వాటిల్లో ప్లాస్మోడియమ్ వైవాక్స్ కంటే ప్లాస్మోడియమ్ ఫ్యాల్సిపేరమ్ తీవ్రత ఎక్కువ. ఎందుకంటే ఫ్యాల్సిపేరమ్ రకానికి చెందిన పరాన్న జీవులు ఎర్రరక్తకణాల్లో తమ అభివృద్ధిని చాలా వేగంగా సాగిస్తాయి. దాంతో బాధితులు కోమాలోకి వెళ్లడానికి అవకాశాలు ఎక్కువ. ఫ్యాల్సిపేరమ్ రకం మలేరియా వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కామెర్లు, కిడ్నీలు విఫలం కావడంతో పాటు ఒక్కోసారి మృత్యువుకూ దారి తీయవచ్చు.

నిర్ధారణ:

● డిప్-స్టిక్ పద్ధతితో 15 నిమిషాల్లోనే ఫలితాలు చాలా కచ్చితంగా తెలుస్తాయి.

● **రక్త పరీక్ష :** థిక్ అండ్ థిన్ స్మియర్, జిమ్సా స్టెయిన్ పరీక్ష చేసి, ఒక సారి పరీక్షల్లో మలేరియా పరాన్నజీవి బయటపడకపోతే... రెండు, మూడు రోజుల పాటు వరసగా రక్తపరీక్ష చేయాల్సి ఉంటుంది.

● **ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ :** మలేరియా యాంటిజెన్‌ను త్వరగా గుర్తించగలిగే పరీక్షలు, పారాసైట్-ఎఫ్, ఆప్టిమల్ టెస్ట్స్... ఇవన్నీ ర్యాపిడ్ డయాగ్నస్టిక్ తరహాకు చెందినవి. పీసీఆర్ టెస్ట్, మలేరియా యాంటీబాడీస్ టెస్ట్ అనే పరీక్షలు కూడా ఉన్నాయి గాని వీటిని పెద్దగా వాడటం లేదు.

చికిత్స: గతంలో మలేరియాకు క్వినైన్, క్లోరోక్విన్ వంటి మందులతో చికిత్స చేసేవారు. అయితే పరాన్నజీవి ఆ మందులకు నిరోధక శక్తి పెంచుకోవడంతో వాటిపై నియంత్రణ విధించారు. లక్షణాల తీవ్రతను బట్టీ, అలాగే... తీవ్రత తక్కువగా ఉండే వైవాక్సా లేదా తీవ్రత ఎక్కువగా ఉండే ఫాల్సిఫేరమా అనే దాన్ని బట్టి వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స అందించాల్సి ఉంటుంది. వ్యాధి తీవ్రత వల్ల ఇతర పరిణామాలు... అంటే...కిడ్నీల పనితీరు దెబ్బతింటే డయాలిసిస్, శ్వాస అందకపోతే వెంటిలేషన్ వంటివి అవసరమవుతాయి. మందులతో పాటు మంచి ఆహారం, విశ్రాంతితో ఈ తరహా మలేరియా త్వరగానే అదుపులోకి వస్తుంది.

నివారణ: ● దోమల నివారణే మలేరియా నివారణకు మంచి మార్గం. ● మన ఇంట్లోకి దోమలు రాకుండా రిపెల్లెంట్లు, దోమతెరలు వాడవచ్చు. ● దోమలు కుట్టకుండా శరీరంపైన పూత మందులు వాడవచ్చు. ● హాఫ్ స్లీవ్స్ వంటి దుస్తులు వద్దు. ఒళ్లంతా కప్పి ఉంచే దుస్తులను వాడాలి. ● ఇళ్ల పరిసరాల్లో మురుగు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. ● పాత టైర్లు, ఖాళీ కొబ్బరి చిప్పల వంటివి దోమల పెరుగుదలకు ఉపకరిస్తాయి కాబట్టి వాటిని ఇంటి పరిసరాల్లో ఉంచకూడదు. ● కొంతమంది వాటర్ కూలర్స్‌లో కొన్ని నీళ్లు ఉంచేస్తారు. సాధారణంగా వర్షాలుపడగానే వాటిని ఉపయోగించడం ఆపేసి, వాటిని మూలన పడేస్తారు. దాంతో అవి దోమలకు మంచి బ్రీడింగ్ స్థలాలుగా మారిపోతాయి.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్



పిల్లల ముక్కు నుంచి రక్తస్రావం...?

మెడిటిప్

ఈ సీజన్‌లో పిల్లలు వానల్లో తడిసి, జలుబు చేసి ముక్కు చీదినప్పుడు రక్తం రావచ్చు. చిన్నారుల ముక్కు నుంచి రక్తస్రావం జరగడాన్ని ఎపిస్టాక్సిస్ అంటారు. చాలావరకు ఇది ఏమాత్రం ఆందోళనకరం కాదు. పిల్లల ముక్కు నుంచి రక్తస్రావం అవుతుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... ◗ పిల్లలు కాస్త ముందుకు ఒంగి కూర్చునేలా చూడాలి ◗ నోటితో గాలి పీల్చుకొమ్మని చెప్పాలి. ◗ రక్తస్రావం అవుతున్న ముక్కు రంధ్రం వైపు భాగాన్ని బొటనవేలు, చూపుడువేలుతో కాసేపు అలాగే నొక్కి పట్టి ఉంచాలి. ◗ ముక్కుపైన ఐస్‌ప్యాక్ లేదా కోల్డ్ ప్యాక్ ఉంచాలి. ◗ వాళ్లు గట్టిగా ముక్కు చీదకుండా చూడాలి. ◗ రక్తస్రావం తగ్గాక మళ్లీ అలా జరగకుండా ఉండేందుకు పిల్లల వేళ్ల గోళ్లు కత్తిరిస్తూ, వాళ్లు ముక్కులో వేళ్లు పెట్టుకుని గిల్లుకోకుండా చూడాలి. ఈ కొద్దిపాటి జాగ్రత్తలతో రక్తస్రావం తప్పక ఆగిపోతుంది. ఒకవేళ ఆగకపోతే తక్షణం డాక్టర్ / ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌ను కలవాలి.



నేడు 'ఎమర్జింగ్' ఫైనల్లో పాక్‌తో భారత్ పోరు

ఆసియా 'ఎమర్జింగ్' కప్ టోర్నీ తుది పోరుకు రంగం సిద్ధమైంది. కొలంబోలో నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్ 'ఎ'తో భారత్ 'ఎ' తలపడుతుంది. బలాబలాలను బట్టి చూస్తే యశ్ ధుల్ నాయకత్వంలోని భారత జట్టే ఫేవరెట్‌గా ఉంది. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో భారత్ 8 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. టోర్నీలో చెరో సెంచరీ, హాఫ్ సెంచరీ చేసిన ధుల్, సాయి సుదర్శన్ మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో కూడా నిశాంత్ సింధు 10 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. పాకిస్తాన్ టీమ్‌ను చూస్తే పలువురు ఆటగాళ్లు మొహమ్మద్ వసీమ్, కెప్టెన్ మొహమ్మద్ హారిస్, ఫర్హాన్, అర్షద్ ఇక్బాల్‌లకు ఇప్పటికే సీనియర్ టీమ్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది.

వెస్టిండీస్ నిలకడ

తొలి ఇన్నింగ్స్‌లో 174/3 ● బ్రాత్‌వైట్ అర్ధసెంచరీ


బ్రాత్‌వైట్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ కుప్పకూలిపోకుండా జాగ్రత్తగా ఆడుతోంది. మ్యాచ్ మూడో రోజు శనివారం టీ విరామ సమయానికి విండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (235 బంతుల్లో 75; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా...బ్లాక్‌వుడ్ (16 నాటౌట్), అలిక్ అతనజ్ (13 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. వర్షం కారణంగా మూడో రోజు ఆటకు అంతరాయం కలిగింది. తొలి సెషన్‌లో 10.4 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా, విండీస్ 31 పరుగులు చేసి కిర్క్ మెకన్జీ (57 బంతుల్లో 32; 4 ఫోర్లు, 1 సిక్స్) వికెట్ కోల్పోయింది. తొలి టెస్టు ఆడుతున్న మెకన్జీని భారత్ తరఫున అరంగేట్రం చేసిన ముకేశ్ కుమార్ తన తొలి వికెట్‌గా పెవిలియన్ పంపించడం విశేషం. ముకేశ్ వేసిన బంతిని ఆడలేక మెకన్జీ కీపర్ ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు మెకన్జీ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. ఉనాద్కట్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అతను అశ్విన్ బౌలింగ్‌లో మిడాఫ్ మీదుగా సిక్స్ బాదాడు. లంచ్ విరామ సమయానికి బ్రాత్‌వైట్ 49 పరుగుల వద్ద ఉన్నాడు. రెండో సెషన్ ప్రారంభం కాగానే బ్రాత్‌వైట్ 170 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఇదే సెషన్‌లో అతని వికెట్ తీయడంలో భారత్ సఫలమైంది. అశ్విన్ వేసిన చక్కటి బంతి బ్రాత్‌వైట్ మిడిల్ స్టంప్‌ను తాకింది. ఆ తర్వాత బ్లాక్‌వుడ్, అతనజ్ కలిసి జట్టును నడిపించారు. మరో 13.2 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన టీమిండియా ఈ జోడీని విడదీయడంలో విఫలమైంది. రెండు రివ్యూలు కూడా భారత్‌కు ప్రతికూలంగా వచ్చాయి.



ముకేశ్‌కు సహచరుల అభినందన

తొలి టెస్టుతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటింగ్ ఎంతో మెరుగ్గా కనిపించింది. రెండో రోజు వెస్టిండీస్ ఓపెనర్లు పట్టుదలగా ఆడి శుభారంభం అందించారు. బ్రాత్‌వైట్, తేజ్ నారాయణ్ చందర్‌పాల్ (95 బంతుల్లో 33; 4 ఫోర్లు) కలిసి 34.2 ఓవర్ల పాటు క్రీజ్‌లో నిలిచి 71 పరుగులు జోడించారు. జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. షాట్ ఆడబోయిన చందర్‌పాల్ పాయింట్‌లో అశ్విన్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే బ్రాత్‌వైట్, మెకన్జీ కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ 41 ఓవర్లలో వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (37 నాటౌట్), మెకన్జీ (14 నాటౌట్) అజేయంగా నిలిచారు.

పోరాడుతున్న ఆస్ట్రేలియా

లబుషేన్ సెంచరీ



మాంచెస్టర్: 'యాషెస్' సిరీస్ నాలుగో టెస్టులో ఓటమినుంచి తప్పించుకునేందుకు పోరాడుతున్న ఆస్ట్రేలియాకు శనివారం వర్షం రూపంలో అదృష్టం కూడా కలిసొచ్చింది. ఇక ఆ జట్టు మ్యాచ్ చివరి రోజు ఆదివారం కూడా వాన కురవడంపై కూడా ఆశలు పెట్టుకోవాలి! 162 పరుగులు వెనుకబడి ఓవర్‌నైట్ స్కోరు 113/4తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. పట్టుదలగా ఆడిన మార్నస్ లబుషేన్ (173 బంతుల్లో 111; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెరీర్‌లో 11వ సెంచరీ పూర్తి చేసుకోగా, మిచెల్ మార్ష్ (31 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. వాన కారణంగా శనివారం మొత్తం 27 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా, ఆస్ట్రేలియా మరో 101 పరుగులు జత చేసింది. అయితే ఆసీస్ ఇంకా 61 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజు మిగిలిన ఐదు వికెట్లతో మరికొన్ని పరుగులు సాధించడంతో పాటు వర్షం కూడా అంతరాయం కలిగిస్తే 'డ్రా'కు అవకాశం ఉంటుంది. అదే జరిగితే ఆస్ట్రేలియా 'యాషెస్'ను నిలబెట్టుకుంటుంది.

టైటిల్‌కు అడుగు దూరంలో...

- ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ
- కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్



యోసు (కొరియా): గత నెల ఇండోనేసియా ఓపెన్ టైటిల్ గెలుచుకున్న భారత డబుల్స్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి వరుసగా రెండో టైటిల్‌కు చేరువయ్యారు. కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి భారత జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకు జంట సాత్విక్-చిరాగ్ 21-15, 24-22తో రెండో సీడ్ లియాంగ్ వే కెంగ్- వాంగ్ చాంగ్ (చైనా) ద్వయంపై గెలుపొందింది. ప్రపంచ రెండో ర్యాంకులో ఉన్న చైనీస్ ప్రత్యర్థులపై భారత షట్లర్లకు ఇదే తొలి విజయం! గతంలో తలపడిన రెండు సార్లూ సాత్విక్-చిరాగ్‌లకు నిరాశే ఎదురైంది. తాజా సెమీస్‌లో భారత ద్వయం జోరుకు చైనీస్ జంటకు ఓటమి తప్పలేదు. వరుస గేముల్లో గెలిచినప్పటికీ మ్యాచ్ మాత్రం హోరాహోరీగా సాగింది. 3-3 నుంచి 5-5 ఇలా స్కోరు పోటాపోటీగా కదిలింది. సాత్విక్-చిరాగ్ 7-5 స్కోరు వద్ద ఆధిక్యంలోకి వచ్చినప్పటికీ చైనా స్టార్లు స్మాష్‌లతో మళ్లీ సమం చేశారు. అయితే నెట్ వద్ద లియాంగ్ అనవసర తప్పులు చేయడంతో భారత్ 14-8తో పూర్తిస్థాయి ఆధిపత్యాన్ని సంపాదించి తొలి గేమ్‌ను చేజిక్కించుకుంది. ఇక రెండో గేమ్‌లో పోటీ మరింత పెరిగింది. ఆరంభం నుంచి 2-2, 8-8 వద్ద వరుస విరామాల్లో స్కోర్లు సమం కావడంతో ఇరు జోడీలు పైచేయి సాధించేందుకు శ్రమించారు. సాత్విక్ స్మాష్‌లతో రెచ్చిపోయాడు. వరుస పాయింట్లతో 11-8తో ఆధిక్యంలోకి వచ్చిన భారత జోడీ దీన్ని 14-9తో పెంచుకుంది. కానీ లియాంగ్, వాంగ్ క్రాస్‌కోర్టు షాట్లకు పదునుపెట్టడంతో పోటాపోటీ మళ్లీ మొదటికొచ్చింది. ఇక్కడినుంచి ఆఖరి దశ దాకా హోరాహోరీ కొనసాగడంతో 20-20, 22-22 వద్ద స్కోర్లు సమమయ్యాయి. తర్వాత నాలుగోసారి దక్కిన మ్యాచ్ పాయింట్‌ను ఈ సారి ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా సాత్విక్ తెలివిగా స్మాష్‌లతో ముగించాడు. నేడు జరిగే తుదిపోరులో భారత జోడీ టాప్ సీడ్ ఫజర్ అల్ఫియాన్-ముహమ్మద్ రియాన్ (ఇండోనేసియా) జంటతో తలపడుతుంది.

ఎంపికపై జోక్యం చేసుకోలేం: ఢిల్లీ హైకోర్టు

బజరంగ్, వినేశ్ ఆసియా క్రీడల వివాదం


అంతిమ్

న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు సెలక్షన్స్‌నుంచి మినహాయింపునిస్తూ నేరుగా ఆసియా క్రీడలకు ఎంపిక చేయడంపై నమోదైన రిట్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ సుబ్రహ్మణ్యం ప్రసాద్ తీర్పునిచ్చారు. బజరంగ్, వినేశ్‌లను రెజ్లింగ్ సమాఖ్య అడ్‌హక్ కమిటీ ట్రయల్స్ లేకుండానే ఆసియా క్రీడలకు ఎంపిక చేసింది. దీనిని సవాల్ చేస్తూ యువ రెజ్లర్లు అంతిమ్ పంఘాల్, సుజీత్ కల్కాల్ ఈ నెల 19న కోర్టును ఆశ్రయించారు.

సుప్రీం కోర్టుకు వెళతాం...

ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటలకే సెలక్షన్ ట్రయల్స్‌లో అంతిమ్ గెలిచింది. శనివారం నిర్వహించిన 53 కేజీల సెలక్షన్ ట్రయల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. అయితే ఇదే కేటగిరీలో వినేశ్‌ను ఇప్పటికే ఎంపిక చేయడంతో అంతిమ్ స్టాండ్‌బైగా మాత్రమే ఉండే అవకాశం ఉంది. కానీ తాను స్టాండ్‌బైగా కూర్చునేందుకు సిద్ధంగా లేనని ఆమె ప్రకటించింది. హైకోర్టులో ప్రతికూలంగా వచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో పోరాడతానని 19 ఏళ్ల పంఘాల్ తెలిపింది. 'కష్టపడి ట్రయల్స్ నెగ్గిన నేను ఎందుకు స్టాండ్‌బైగా ఉండాలి. దర్జాగా మినహాయింపు పొందినవారే కూర్చోవాలి' అని వినేశ్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించింది.

భారత మహిళలకు చేజారిన విజయం

- బంగ్లాదేశ్‌తో మూడో వన్డే 'టై'
- 1-1తో సిరీస్ సమం



మిర్పూర్: బంగ్లాదేశ్ మహిళలతో చివరి వన్డేలో భారత మహిళల జట్టు విజయలక్ష్యం 226 పరుగులు...41.1 ఓవర్లలో స్కోరు 191/4...చేతిలో 6 వికెట్లతో మరో 53 బంతుల్లో 35 పరుగులే కావాలి. కానీ ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్లీన్ డియోల్ (108 బంతుల్లో 77; 9 ఫోర్లు), దీప్తి శర్మ (1) ఒకే ఓవర్లో రనౌటయ్యారు. 34 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లను కోల్పోయిన భారత్ స్కోరును సమం మాత్రమే చేయగలిగింది. చివర్లో 19 బంతుల్లో 10 పరుగులు చేయాల్సిన స్థితిలో కూడా లక్ష్యాన్ని అందుకోలేక మూడు బంతులు మిగిలి ఉండగానే ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (45 బంతుల్లో 33 నాటౌట్) మరో ఎండ్‌లో ఉండగా...చివరి ఓవర్ మూడో బంతికి మేఘనా సింగ్‌ను మారుఫా అవుట్ చేసింది. దాంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. భారత్ 49.3 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ కాగా... అంతకు ముందు బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులే చేసింది. అప్పటికే నిర్ణీత సమయం దాటిపోవడంతో నిబంధనల ప్రకారం సూపర్ ఓవర్ నిర్వహించలేదు. తొలి రెండు వన్డేల్లో ఇరు జట్లు ఒక్కోటి గెలవడంతో సిరీస్ 1-1తో 'డ్రా' అయింది.

భారత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (85 బంతుల్లో 59; 5 ఫోర్లు) రాణించింది. స్మృతి, హర్లీన్ మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (14; 2 ఫోర్లు) నిరాశపర్చడంతో పాటు స్వల్ప విరామంలో ఓవర్‌కు రెండు చొప్పున నాలుగు వికెట్లు కోల్పోవడం భారత్ గెలుపురాతను మార్చింది. అంతకు ముందు ఫర్జానా హక్ (160 బంతుల్లో 107; 7 ఫోర్లు), షమీమా సుల్తానా (78 బంతుల్లో 52; 5 ఫోర్లు) బంగ్లా స్కోరులో కీలక పాత్ర పోషించారు. బంగ్లాదేశ్ తరఫున మహిళల వన్డేల్లో సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా ఫర్జానా నిలిచింది.

చివరి వన్డేలో అంపైరింగ్ ప్రమాణాలపై భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇన్నింగ్స్ 34వ ఓవర్లో నాహిదా బౌలింగ్‌లో అవుటయ్యాక హర్మన్ తన బ్యాట్‌తో స్టంప్స్‌ను బలంగా కొట్టి అంపైర్‌తో వాగ్వాదానికి దిగింది. 'ఈ మ్యాచ్‌తో మేం చాలా నేర్చుకున్నాం. అంపైరింగ్ ప్రమాణాలను కూడా చూశాం. చాలా ఘోరంగా ఉంది. మేం మళ్లీ బంగ్లాదేశ్‌కు వచ్చినప్పుడు దాని కోసం కూడా సిద్ధమై రావాలేమో' అని హర్మన్ వ్యాఖ్యానించింది.

హామిల్టన్‌కు పోల్



బుడాపెస్ట్: హంగేరియన్ గ్రాండ్‌ప్రిలో లూయిస్ హామిల్టన్ పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో మెర్సిడెజ్ డ్రైవర్ హామిల్టన్ ల్యాప్‌ను అందరికంటే వేగంగా 1 ని.16.609 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో వరుసగా ఆరు రేసుల్లో పోల్ పొజిషన్ సాధిస్తూ వచ్చిన వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఇక్కడి సర్క్యూట్‌పై 0.003 సెకన్ల తేడాతో రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నేడు జరిగే ప్రధాన రేసులో హామిల్టన్ ఒకటో స్థానం నుంచి పోటీ మొదలుపెడతాడు. 2021లోనూ అతను ఇక్కడ పోల్ పొజిషన్‌లో నిలిచాడు.

సినిమా

బాక్సాఫీస్ కలెక్షన్లు దండుకోవడానికి థియేటర్స్ స్టేషన్‌లో కొందరు స్టార్స్ పోలీసాఫీసర్స్‌గా చార్జ్ తీసుకోనున్నారు. కొందరు పోలీస్ యూనిఫామ్ వేసుకుని, సెట్స్‌లో లాఠీ తిప్పుతున్నారు. మరికొందరు కథలు విన్నారు.. యూనిఫామ్‌తో సెట్స్‌కి వెళ్లడానికి రెడీ అవుతున్నారు. ఇక ఆఫీసర్స్ ఆన్ డ్యూటీ వివరాలు తెలుసుకుందాం.

ఆఫీసర్స్ ఆన్ డ్యూటీ


● రజనీకాంత్ ● ప్రభాస్ ● నాని


● గోపీచంద్


● నితిన్ ● శ్రీకాంత్ ● ఆది ● జేడీ

మళ్లీ డ్యూటీ

'మూండ్రు ముగమ్' (1982), 'పాండియన్ ' (1992), హిందీలో 'హమ్' (1991), 'దర్బార్' (2020)... ఇలా ఇప్పటివరకూ రజనీకాంత్ ఏడెనిమిది చిత్రాల్లో పోలీసాఫీసర్‌గా నటించారు. మళ్లీ రజనీ పోలీస్‌గా చార్జ్ తీసుకోనున్నారట. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో ముస్లిమ్ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారని టాక్. సుభాస్కరన్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఇక ఆగస్టు 10న విడుదల కానున్న 'జైలర్' చిత్రంలో రజనీ జైలర్ పాత్రలో నటించిన విషయం తెలిసిందే.

పోలీస్ స్పిరిట్

పోలీసాఫీసర్‌గా ప్రభాస్ కటౌట్ స్క్రీన్‌పై సూపర్‌గా ఉంటుందని, సిల్వర్ స్క్రీన్‌పై ఖాకీ డ్రెస్ వేసిన ఫుల్ లెంగ్త్ పోలీసాఫీసర్ పాత్రలో ప్రభాస్‌ను చూడాలని ఆయన ఫ్యాన్స్ ఎప్పట్నుంచో ఆశపడుతున్నారు. వీరి ఆశ 'స్పిరిట్'తో తీరనుందనే టాక్ వినిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనే చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని తెలిసింది. భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందట.

పుష్కర కాలం తర్వాత...

'శౌర్యం (2008)', 'గోలీమార్ (2010)' వంటి చిత్రాల్లో గోపీచంద్ పోలీస్‌గా సిల్వర్ స్క్రీన్‌పై డ్యూటీ చేశారు. పుష్కర కాలం తర్వాత గోపీచంద్ మళ్లీ పోలీస్‌గా లాఠీ పట్టారు. హర్ష తెరకెక్కిస్తున్న 'భీమా' చిత్రం కోసమే పోలీస్‌గా డ్యూటీ చేస్తున్నారు గోపీచంద్. కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.


● వరుణ్ సందేశ్ ● జానీ

ఆఫీసర్ అర్జున్

పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు నాని. 'హిట్' ఫ్రాంచైజీలో 'హిట్ 3' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'హిట్ 1'లో విశ్వక్‌సేన్, 'హిట్ 2'లో అడివి శేష్ పోలీసాఫీసర్స్‌గా నటించారు. 'హిట్ 3'లో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటించనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభమవుతుందట.

కొన్ని సన్నివేశాల్లో...

హీరో నితిన్ పోలీసాఫీసర్‌గా చార్జ్ తీసుకున్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఎక్స్‌ట్రా' (ప్రచారంలో ఉన్న టైటిల్). శ్రీలీల హీరోయిన్. ఇందులో హీరోగా నటిస్తున్న నితిన్ కొన్ని సీన్స్‌లో పోలీస్‌గా కనిపిస్తారట.

అమరన్.. ఇన్ ది సిటీ

'బ్లాక్', 'సీఎస్ఐ: సనాతన్' వంటి చిత్రాల్లో ఆది సాయికుమార్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా సిల్వర్ స్క్రీన్ క్రైమ్స్‌ను ఛేదించారు. తాజాగా 'అమరన్: ఇన్ ది సిటీ చాప్టర్ 1' చిత్రంలో ఆది సాయికుమార్ పోలీసాఫీసర్‌గా ఓ కేసును పరిశోధిస్తున్నారు. ఎస్. బాలేశ్వర్ దర్శకత్వంలో ఎస్వీఆర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ది కానిస్టేబుల్

'హ్యాపీ డేస్', 'కొత్త బంగారు లోకం', 'కుర్రాడు' వంటి సినిమాల్లో హీరోగా నటించిన వరుణ్ సందేశ్ తాజాగా పోలీస్ డ్రెస్ వేసుకున్నారు. ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో రూపొందుతున్న సస్పెన్స్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ 'ది కానిస్టేబుల్'. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ కానిస్టేబుల్ పాత్ర చేస్తున్నారు. 'బలగం' జగదీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ ఏడాదే ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఎవరు?

హంతకులు ఎవరు? అనేది కనిపెట్టేందుకు జేడీ చక్రవర్తి ఓ స్కెచ్ వేశారు. పోలీసాఫీసర్‌గా జేడీ చక్రవర్తి వేసిన ఈ స్కెచ్ డీటైల్స్ 'హు' సినిమాలో తెలుస్తాయి. జేడీ చక్రవర్తి నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రెడ్డమ్మ కె. బాలాజీ నిర్మించారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తారు.

పోలీసులే ప్రధాన నిందితులైతే...

దోషులను పట్టుకునే పోలీసులే నిందులైతే ఏం జరుగుతుంది? అనే కథాంశంతో దర్శకుడు తేజా మార్ని ఓ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రంలో శ్రీకాంత్, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలు పోషించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ చిత్రంలోని ముఖ్య తారలంతా పోలీసులుగా నటిస్తున్నారని తెలిసింది. 'ఖడ్గం' (2002), 'ఆపరేషన్ దుర్యోధన' (2007), 'టెర్రర్' (2016) వంటి సినిమాల్లో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించిన శ్రీకాంత్ ఈ చిత్రంలో ఓ డిఫరెంట్ పోలీస్‌గా కనిపిస్తారు. 'బన్నీ' వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

పోలీస్ రన్నర్

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'రన్నర్'. విజయ్ చౌదరిని దర్శకుడిగా పరిచయం చేస్తూ విజయ్ భాస్కర్, ఫణీంద్ర, ఎం. శ్రీహరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పోలీస్ నేపథ్యంలో తండ్రీ కొడుకుల అనుబంధంతో సాగే ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్రలో జానీ మాస్టర్ నటిస్తున్నారని తెలిసింది.

వీరే కాదు... మరికొందరు కూడా పోలీసాఫీసర్లుగా కనిపించడానికి రెడీ అవుతున్నారు.

డబ్బింగ్ డన్


● తమన్నా

'భోళా శంకర్'కు సొంత డబ్బింగ్ చెప్పారు తమన్నా. చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. కాగా ఈ సినిమాలో తమన్నా డబ్బింగ్ వర్క్ పూర్తయింది. తన పాత్రకు తానే సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్నారామె. అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

రీల్స్

నమ్మాను... ఆఫర్లు వచ్చాయి


● విజయ్

ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన చిత్రం 'బేబీ'. ఈ సినిమా రూ. 50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ మాట్లాడుతూ– ''బింబిసార' దర్శకుడు వశిష్ఠ ద్వారా సాయిరాజేష్ పరిచయం అయ్యారు. అలా 'బేబీ'కి సంగీతం ఇచ్చాను. 'బేబీ' విజయం సాధిస్తుందని నేను బలంగా నమ్మాను. అందుకే రెండున్నరేళ్లుగా ఏ ప్రాజెక్ట్ ఒప్పుకోలేదు. ఈ సినిమా పాటలు రిలీజ్ కాగానే చాలా ఆఫర్స్ వచ్చాయి'' అన్నారు.

అనుకున్నవన్నీ జరిగాయి - అశ్విన్


● నందిత, అశ్విన్

అశ్విన్‌బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన చిత్రం 'హిడింబ'. ఈ సినిమా ఈ నెల 20న విడుదలైంది. శనివారం థ్యాంక్స్ మీట్‌లో అశ్విన్ మాట్లాడుతూ– ''హిడింబ' విషయంలో మేం అనుకున్నవన్నీ జరిగాయి. డిస్ట్రిబ్యూటర్స్ హ్యాపీగా ఉన్నారు'' అన్నారు. ''రెండు రోజులకే రూ. 3 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసిందీ చిత్రం'' అన్నారు అనిల్ కన్నెగంటి. ''వర్షాలు కురుస్తున్నప్పటికీ ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు శ్రీధర్.

నమ్మకం నిజమైంది


● రాజేష్

శ్రీ విష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా జూన్ 29న విడుదలైంది. తాజాగా ఈ సినిమా రూ. 50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా రాజేష్ దండా మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నప్పుడే చాలా నవ్వుకున్నాం. ఈ కథలో యూనిక్ పాయింట్ ఉంది. అందుకే ఆడియన్స్ బాగా కనెక్ట్ అయ్యారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'గీత గోవిందం' వంటి సినిమాల తరహా స్క్రిప్ట్ 'సామజ వరగమన' అని మేం నమ్మాం. మా నమ్మకం నిజమైంది. ఈ సినిమాను సొంతంగా రిలీజ్ చేయడం లాభించింది. ఈ చిత్రాన్ని ఇతర భాషల్లో రీమేక్ చేసే ఆలోచన ఉంది'' అన్నారు.

రాయలసీమ కథ


● రవితేజ, విషిక

హీరో నవదీప్ సమర్పణలో రవితేజ మహాదాస్యం, విషిక కోట జంటగా నటించిన చిత్రం 'సగిలేటి కథ'. రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వంలో నవదీప్ సమర్పణలో అశోక్ మిట్టపల్లి, దేవి ప్రసాద్ బలివాడ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ''రాయలసీమ ప్రాంతం నేపథ్యంలో ఒక గ్రామంలో జరిగే ఘటనలతో సాగే చిత్రం ఇది. రాయలసీమ నేటివిటీ, సంస్కృతీ సంప్రదాయాలతో వచ్చే సన్నివేశాలు సహజంగా ఉంటాయి. ఇందులో చికెన్ కూడా ఒక పాత్ర. ఈ నెల 31న ట్రైలర్ రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కల్తీ మద్యం అమ్ముతున్న వ్యక్తిపై పీడీ కేసు

సాక్షి, హైదరాబాద్: హరియాణా నుంచి హైదరాబాద్ నగరానికి కల్తీ మద్యం తెచ్చి విక్రయిస్తున్న ఓ పాత నేరస్తుడిపై సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు పీడీ కేసు నమోదు చేశారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌రాంసింగ్ మద్యాన్ని తెచ్చి విక్రయిస్తూ గతంలోనూ పట్టుబడ్డాడు. ఇటీవలే అతడిపై మరో మూడు కేసులు కూడా నమోదవగా.. తాజాగా పీడీ కేసు నమోదు చేశారు. ఈ వివరాలను ఎక్సైజ్ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాజారాం సింగ్ పాల్పడిన మూడు నేరాల్లో 123 మద్యం బాటిళ్లు, రెండు ఆటోలు సీజ్ చేశామని, ఈ ఏడాది మార్చి 3న మరో 216 బాటిళ్లు సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. రాజారాంతో పాటు ఆయనకు సహకరిస్తున్న అశోక్‌చౌదరి, బ్రిజ్‌కిశోర్ వర్మ, బిట్టూసింగ్, పింటూ సింగ్‌లపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు సరఫరా చేస్తున్న మద్యాన్ని పరీక్షించగా అది కల్తీదని తేలినట్లు చెప్పారు.

ఎంసెట్ తొలి విడతలో 54 వేల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. తొలివిడత కౌన్సెలింగ్‌లో 70,665 మంది విద్యార్థులు కన్వీనర్ కోటాలో సీట్లు దక్కించుకున్నారు. వీరిలో 54,467 మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత సాధించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇందులో 25,869 మంది విద్యార్థులు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతారని, మరో 28,598 మంది విద్యార్థులు మాత్రం పాక్షిక (గరిష్టంగా రూ.35వేల వరకు) ఫీజుకు మాత్రమే అర్హులవుతారని తెలిపారు. 10 వేల లోపు ర్యాంకు సాధించిన బీసీ విద్యార్థులకు మాత్రమే పూర్తి ఫీజును ప్రభుత్వం విడుదల చేస్తుండగా.. 10 వేల ర్యాంకు దాటిన వారికి మాత్రం పాక్షికం (రూ.35 వేల పరిమితి)గానే ఫీజులను రీయింబర్స్‌మెంట్ చేస్తోందని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత సాధించిన విద్యార్థుల్లో 11,555 మంది ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులున్నారని తెలిపారు. మరో 11,822 మంది ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు పొందిన వారుండగా.. 2,492 మంది విద్యార్థులు మాత్రం 10 వేల లోపు ర్యాంకు సాధించిన బీసీ విద్యార్థులున్నారన్నారు. కాగా, ఈనెలా ఖరులో రెండోవిడత ఎంసెట్-2023 సీట్ల కేటాయింపు జరగనుంది.

టీఆర్ఈఐఆర్‌బీకి కొత్త చైర్మన్!

- రొనాల్డ్ రాస్ బదిలీతో ఖాళీ అయిన గురుకుల నియామకాల బోర్డు చైర్మన్ కుర్చీ
- గురుకుల సొసైటీల్లో సీనియర్ కార్యదర్శికి బాధ్యతలివ్వాలని నిబంధన
- ప్రస్తుతం సీనియర్ కార్యదర్శిగా మైనారిటీ గురుకుల కార్యదర్శి షఫీయుల్లా
- ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ)కు కొత్త చైర్మన్ ఎంపిక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటివరకు చైర్మన్‌గా వ్యవహరించిన రొనాల్డ్ రాస్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో చైర్మన్ కుర్చీ ఖాళీ అయింది. ప్రస్తుతం గురుకుల నియామకాల బోర్డు పరిధిలో భారీగా ఉద్యోగ నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు 9 వేల ఉద్యోగాల భర్తీకి వివిధ ప్రకటనలు జారీ చేసిన గురుకుల బోర్డు... వచ్చే నెల నుంచి అర్హత పరీక్షలను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో బోర్డు చైర్మన్ బదిలీ కావడంతో ఆ స్థానాన్ని వీలైనంత త్వరగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే బోర్డు చైర్మన్‌కు సంబంధించి సొసైటీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. గత నాలుగు రోజులుగా వర్షాల నేపథ్యంలో నిర్ణయం కాస్త ఆలస్యం కాగా... ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది.

పెద్ద సొసైటీ... సీనియర్ కార్యదర్శికే పగ్గం...

టీఆర్ఈఐఆర్‌బీ చైర్మన్ విషయంలో ప్రత్యేక నిబంధనలున్నాయి. కేవలం గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు 2018లో ఏర్పాటైంది. ప్రస్తుతం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీలున్నాయి. ఈ ఐదు సొసైటీల్లోని కొలువుల భర్తీ గురుకుల బోర్డు నిర్వహిస్తోంది. ఈ బోర్డుకు చైర్మన్‌గా అత్యధిక పాఠశాలలున్న సొసైటీ కార్యదర్శి, అదేవిధంగా సొసైటీ కార్యదర్శుల్లో సీనియర్‌కు ఈ బాధ్యత అప్పగించాలనే నిబంధన ఉంది. ఇప్పటివరకు బోర్డు చైర్మన్‌గా మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆ తర్వాత రొనాల్డ్ రోస్ వ్యవహరించారు. ప్రస్తుతమున్న వారిలో ఒక కార్యదర్శికి బోర్డు చైర్మన్ బాధ్యత అప్పగించాలి. ఇప్పుడున్న కార్యదర్శుల్లో ఇద్దరు సివిల్ సర్వెంట్లు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఇ.నవీన్ నికోలస్ కొనసాగుతుండగా మైనారిటీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా షఫీయుల్లా ఉన్నారు. వారిద్దరిలో ఒకరు బోర్డు చైర్మన్ కానున్నారు. అయితే ఇద్దరిలో ఒకరు ఐఏఎస్ కాగా మరొకరు ఐఎఫ్ఎస్ అధికారి. ఐఎఫ్ఎస్ అధికారిగా ఉన్న షఫీయుల్లా దాదాపు 8 ఏళ్లుగా కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఐఏఎస్ అధికారి నవీన్ నికోలస్ గతంలో ఎస్టీ గురుకుల సొసైటీ అదనపు కార్యదర్శిగా, గురుకుల నియామకాల బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఇరువురి పని చరిత్రను పరిశీలించి ఒకరికి ప్రభుత్వం చైర్మన్ బాధ్యత అప్పగించనుంది. వచ్చే వారంలో చైర్మన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సిబ్బంది నియామకానికి ప్రత్యేక నోటిఫికేషన్

- సూర్యాపేట కోర్టును సందర్శించిన హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

చివ్వెంల (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టులో సిబ్బంది నియామకానికి ప్రత్యేక నోటిఫికేషన్ వేసేలా చూస్తానని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టును ఆమె సందర్శించారు. కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించి మొక్క నాటారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కోర్టులో అదనంగా రెండు ఫ్లోర్లు నిర్మించాలని, సిబ్బందిని నియమించాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న 7 వేల కేసుల పరిష్కారానికి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఫ్యామిలీ కోర్టు, లేబర్ కోర్టును మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్ పోర్టుఫోలియో కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ, సూర్యాపేట జిల్లా కోర్టుకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏ సమస్య ఉన్నా జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లాలని, ప్రధాన న్యాయమూర్తి తన దృష్టికి తీసుకువస్తారని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జిలు కామిశెట్టి సురేశ్, జె.ప్రశాంతి, శ్యాం సుందర్, మారుతి ప్రసాద్, జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్ సపోర్ట్ సెంటర్ ఏర్పాటు

- నేర పరిశోధన, దర్యాప్తులో పోలీసులకు సలహాలు, సాంకేతిక సహకారం
- ఉన్నతాధికారులతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: నేర పరిశోధన, దర్యాప్తులో పోలీసులకు సలహాలు, సాంకేతిక సహకారం అందించేందుకు తన కార్యాలయంలో ఇన్వెస్టిగేషన్, ప్రాసి క్యూషన్ సపోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. రాష్ట్రంలో నేరాలు, దర్యాప్తు తీరు.. తదితర అంశాలపై ఆయన పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, రాష్ట్రంలో నేరాల నమోదు పరిమిత స్థాయిలోనే ఉందని, నేరాల దర్యాప్తు పూర్తి అయి శిక్ష పడుతున్న కేసులలో మంచి పురోగతి ఉందని తెలిపారు. 2022లో 55 మందికి యావజ్జీవ శిక్ష పడగా ఈ ఏడాది ఇప్పటికే వివిధ కేసులలో 88 మందికి యావజ్జీవ శిక్షలు పడ్డాయని వివరించారు. తమ ప్రాంతాల్లో జరిగే నేరాలపై శాస్త్రీయపరమైన సమీక్ష జరపాలని, ఆయా నేరాలు ఎందుకు జరుగుతున్నాయో వాటి మూలాలు తెలుసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు డీజీపీ సూచించారు. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్‌ను ఉపయోగించడంపై స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు అడిషనల్ డీజీ శిఖా గోయల్ తెలిపారు. జూలై 1 నుంచి ప్రారంభించిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇప్పటి వరకు 1,710 మంది చిన్నారులను గుర్తించామని, చిన్నారుల అక్రమ నిర్బంధంపై 317 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు. సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్, అడిషనల్ డీజీ పర్సనల్ సౌమ్య మిశ్రా, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్, ఐజీ షానవాజ్ ఖాసీం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పాము కాటుతో తండ్రీకొడుకులు మృతి

- తొలుత పాము చేతిపైనుంచి వెళ్లిందనుకుని దేవుడికి ముడుపు
- కొద్ది సేపటికి కొడుకు మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రీ కన్నుమూత
- కామారెడ్డి జిల్లాలో పేదింట అర్ధరాత్రి విషాదం



రాజంపేట: పాము కాటుకు తండ్రీకొడుకులు బలయ్యారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం శేర్ శంకర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు మామిళ్ల తండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన ముద్రిచ్చ రవి (40) తనకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రవి తనభార్యతో కలసి రోజూలాగే శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి భార్యాపిల్లలతో కలసి భోజనం చేసిన అనంతరం అందరూ కలసి పడుకున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో నిద్రలోంచి లేచిన రవి తన చేతిపై నుంచి పాము వెళ్లినట్లు భార్య మంగినికి తెలిపాడు. దీంతో భార్యాభర్తలు దేవుని పేరు తలచుకుని ముడుపు కట్టారు. తర్వాత ఇంట్లో పామును గుర్తించిన రవి కర్రతో కొట్టి దానిని చంపాడు. ఇదిలా ఉండగా అర్ధరాత్రి 12 గంటల తర్వాత చిన్నకొడుకు వినోద్(11) ఛాతీలో నొప్పివస్తోందని చెప్పి.. అంతలోనే వాంతులు చేసుకున్నాడు. కొద్ది సేపటికే ప్రాణాలు కోల్పోయాడు. అదే సమయంలో తనకు కళ్లు తిరుగుతున్నాయని రవి భార్య మంగినికి తెలిపాడు. దీంతో వారు పాము కాటుకు గురైనట్లు గ్రహించిన మంగిని చుట్టుపక్కల వారి సహాయంతో రవిని శనివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో అంబులెన్సులో కామారెడ్డి ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ తెల్లవారు జామున 4 గంటలకు రవి సైతం మరణించాడు. ఒకే రోజు తండ్రీ కొడుకుల మరణంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రూ.712 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్

మేడ్ ఇన్ చైనా!


కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

- సూత్రధారులు చైనాలో, పాత్రధారులు దుబాయ్‌లో
- దేశవ్యాప్తంగా 15 వేల మందికి పైగా బాధితులు
- టెలిగ్రాం, వాట్సాప్ గ్రూపుల ద్వారా సాగుతున్న వైనం
- తొమ్మిది మందిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు
- టెర్రర్ ఫండింగ్‌లో సంబంధాలపై అనుమానాలు

సాక్షి, హైదరాబాద్: చైనాలో కూర్చున్న సూత్రధారులు కథ నడుపుతున్నారు... దుబాయ్‌లో ఉంటున్న పాత్రధారులు వీరి ఆదేశాలు పాటిస్తున్నారు. గుజరాత్‌లో నివసించే సహాయకులు ముందుండి పని చేస్తున్నారు. ఈ పంథాలో సాగిన రూ.712 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో బ్యాంకు ఖాతాలు, షెల్ కంపెనీలు అందించడం ద్వారా హైదరాబాదీయులు కీలకపాత్ర పోషించారు. ఈ వ్యవహారం గుట్టురట్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నగరంతోపాటు ముంబై, అహ్మదాబాద్‌లకు చెందిన 9 మందిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్, డీసీపీ స్నేహా మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్‌లతో కలిసి ఆయన శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు.

టాస్క్‌లకు రూపమిచ్చేది చైనాలో..

ఈ ఫ్రాడ్‌లో కథ టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా పార్ట్‌టైమ్ జాబ్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ వచ్చే ప్రకటనలతో మొదలవుతుంది. దీనికి ఆకర్షితులై స్పందించిన వారికి లింకులు పంపడం ద్వారా ఆ రెండు యాప్స్‌లోని గ్రూపుల్లో చేరుస్తారు. ముందు తమ వద్ద ఇన్వెస్ట్ చేసి, తాము పంపే టాస్క్‌లు పూర్తి చేసి లాభాలు పొందాలని. ఆ తర్వాత ఉద్యోగం ఇస్తామని నమ్మిస్తారు. వాళ్లు పంపే లింకులకు లైక్స్ కొట్టడం , నిర్ణీత విధానంలో షేర్ చేయడం వంటి తేలికపాటి టాస్క్‌లే ఉంటాయి. సూత్రధారులుగా ఉన్న చైనీయులు లీ లూ గువాంఘెజు, నాన్ ఏ, కివిన్ జున్ ఆ దేశంలోనే ఉండి ఆకర్షణీయమైన టాస్క్‌లు రూపొందిస్తున్నారు.

చిన్న లాభాలు ఇస్తూ ఉచ్చులోకి...

ఇందులో పెట్టుబడి రూ.5 వేల నుంచి మొదలవుతుంది. దీనికోసం ప్రత్యేక యాప్‌ను బాధితులు డౌన్‌లోడ్ చేసుకుంటారు. రూ.5 వేలకు రూ.వెయ్యి, రూ.10 వేలకు రూ.2 వేలు,రూ.15 వేలకు రూ.3వేల చొప్పున లాభం ఇస్తారు. అలా క్రమంగా పెద్ద మొత్తాల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు. ఆ డబ్బు డ్రా చేసుకోవడానికి ఆస్కారం లేకుండా మరికొంత పెడితేనే కుదురుతుందని చెబుతారు. ఇలా ఒక్కో బాధితుడితో రూ.లక్షల్లో పెట్టించిన తర్వాత ఆ యాప్ పని చేయడం మానేస్తుంది. టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల నుంచి వీరిని తొలగించేసి బ్లాక్ చేసేస్తారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 15 వేల మంది రూ.712 కోట్లు ఇన్వెస్ట్ చేసి నిండా మునిగిపోయారు.

రెండు యాప్‌ల ద్వారా దుబాయ్ నుంచి..

చైనీయుల ఏజెంట్లు అనిస్, ఆరిఫ్, శైలేష్, పీయూష్, ఖాన్, శెల్లీ దుబాయ్‌లో ఉంటున్నారు. అహ్మదాబాద్‌లో ఉన్న ప్రకాష్ ప్రజాపతి, కుమార్ ప్రజాపతి వీరితోపాటు చైనీయులతో టచ్‌లో ఉంటున్నారు. వాళ్లకు కావాల్సిన షెల్ కంపెనీలు, బ్యాంకు ఖాతాలు సమకూర్చడం, నగదును క్రిప్టోకరెన్సీగా మార్చడం వీరి విధి. ఇలా చేసినందుకు ఈ ద్వయానికి 3 శాతం కమీషన్ వస్తోంది. లక్నోకు చెందిన వికాస్, మనీష్, రాకేష్ తదితరులు దేశవ్యాప్తంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని షెల్ కంపెనీలు, వాటి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఖాతాల వివరాలను ప్రజాపతి ద్వయం దుబాయ్‌లోని వారికి పంపుతుంది. వీటికి లింకైన సిమ్‌కార్డులతో కూడిన ఫోన్లను తమ వద్దే ఉంచుకుంటున్నారు. వీరితోపాటు దుబాయ్‌లో ఉన్న వాళ్లు ఆ ఫోన్లలో కూల్‌టెక్, ఎయిర్‌డ్రాయిడ్ అనే యాప్స్ వేసుకుంటున్నారు. వీటి ద్వారా ఇక్కడి ఫోన్లకు వచ్చిన ఓటీపీలను దుబాయ్‌లోని వాళ్లు చూడగలుగుతున్నారు.

క్రిప్టో కరెన్సీగా మార్చి చైనాకు...

బాధితుల నుంచి కాజేసిన మొత్తాన్ని దుబాయ్‌లోని పాత్రధారులు అమెరికన్ డాలర్లతో సమానమైన క్రిప్టో కరెన్సీగా మారుస్తున్నారు. వీరికి ఒక్కో డాలర్‌కు రూ.10 కమీషన్‌గా వస్తోంది. వీళ్లు చైనాలోని సూత్రధారులకు వాలెట్స్ ద్వారా డబ్బు పంపేస్తున్నారు. ప్రజాపతులు వాడిన మూడు వాలెట్స్‌లో హిబ్బుల్ వాలెట్ కూడా ఉంది. దీని ద్వారా ఉగ్రవాదులకు నిధుల లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రజాపతి ద్వయానికి రావాల్సిన కమీషన్‌ను దుబాయ్‌లోని కేటుగాళ్లు ముంబైకి చెందిన ఏజెంట్లు గగన్, గుడ్డు, నయీమ్ ద్వారా హవాలా రూపంలో పంపిస్తున్నారు. ఈ ఫ్రాడ్‌లో బ్యాంకు ఖాతాలు, షెల్ కంపెనీలు అందించిన వారిలో హైదరాబాద్‌కు చెందిన మునావర్ మహ్మద్, అరుల్ దేవ్, సమీర్ ఖాన్, ఎస్.సుమేథ్ కూడా ఉన్నారు. ఈ భారీ మోసాన్ని ఛేదించిన పోలీసులు ఈ నలుగురితోపాటు ప్రజాపతి ద్వయం, గగన్, గుడ్డు, నయీమ్‌లను అరెస్టు చేశారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.10,53,89,943లను ఫ్రీజ్ చేశారు.

ఆన్‌లైన్ సెర్చ్‌లతో జాగ్రత్త..!


నకిలీ యూఆర్ఎల్ పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: ఏ సమాచారం కావాలన్నా మనం ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయడం పరిపాటి. అయితే అన్ని సెర్చ్ ఇంజిన్‌లు సురక్షితం కాదంటున్నారు పోలీసులు. మనం సాధారణంగా గూగుల్, బింగ్, యాహూ వంటి సెర్చ్ ఇంజిన్లను వాడుతూ కావాల్సిన సమాచారం పొందేందుకు ప్రయత్నిస్తుంటాం. అయితే మనం ఏదైనా సమాచారం సెర్చ్ చేయగానే..సెర్చ్ ఇంజిన్ మనకు సంబంధిత అంశానికి చెందిన యూఆర్ఎల్ (యూనిఫాం రిసోర్స్ లొకేటర్)లు ఇస్తుంటాయి. అలా వచ్చే యూఆర్ఎల్ సరైందా కాదా అని సరిచూసుకున్న తర్వాతే ఆ యూఆర్ఎల్‌పై క్లిక్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. కొన్ని అనుమానాస్పద యూఆర్ఎల్‌లపై క్లిక్ చేస్తే మాల్‌వేర్ రావడంతోపాటు వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లకు వెళ్లే ప్రమాదం ఉన్నట్టు వారు హెచ్చరిస్తున్నారు. ఫేక్ యూఆర్ఎల్‌లలో ప్రధానంగా అక్షర దోషాలు ఉండటం లేదా కొద్దిపాటి అక్షరాల తేడాతో ఉంటాయని, వీటిని నిశితంగా గమనిస్తేనే తెలుస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు. ఒకవేళ నకిలీ యూఆర్ఎల్ లేదా నకిలీ కాంటాక్ట్ నంబర్లు ఆన్‌లైన్‌లో గుర్తిస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో సూచించాలని వారు పేర్కొన్నారు.

కేటీఆర్ జన్మదినం సందర్భంగా 'ట్రై క్రీడా వేడుకలు'


సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 24న 'ట్రై క్రీడా' వేడుకలు నిర్వహించనున్నట్లు ఎక్సైజ్, యువజన క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సాట్స్, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ట్రై క్రీడా వేడుకలు–2023' బ్రోచర్‌ను శనివారం రవీంద్రభారతిలో సాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్‌తో కలిసి మంత్రి విడుదల చేశారు. 'స్పోర్ట్స్ ఫర్ ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్' నినాదంతో ఈనెల 24న నెక్లెస్‌రోడ్‌లో సైక్లింగ్, ఇందిరాపార్కులో స్కేటింగ్, యూసుఫ్‌గూడలో రెజ్లింగ్ క్రీడా పోటీలు ఉంటాయని వెల్లడించారు.



వివిధ దేశాల్లో ఉపాధ్యాయుల సగటు వార్షిక వేతనం (రూ.లలో)

లోన్ పట్టు.. టూర్‌కు జైకొట్టు

- ఐదుగురిలో ఒకరు హాలిడే టూర్ కోసమే వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్న వైనం
- నాన్ మెట్రో నగరాల నుంచి పెరుగుతున్న డిమాండ్
- తాజా సర్వేలో వెల్లడైన ఆసక్తికర అంశాలు



అభిరుచులు మారుతున్నాయి. సెలవులను ఎంజాయ్ చేసేందుకో లేదా కొత్త కొత్త ప్రాంతాలను చూసేందుకో వెళ్లాలనుకునే వారు పెరుగుతున్నారు. దేశంలోగానీ లేదా విదేశాలకు గానీ వెకేషన్లకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో వీటి కోసం చాలామంది డబ్బు పొదుపు చేసుకుని దాంతో టూర్లకు వెళ్లేవారు. ఇప్పుడు పర్సనల్ లోన్ తీసుకుంటుండటం ట్రెండ్‌గా మారింది.

సాక్షి, హైదరాబాద్: గతంలో మెడికల్ ఎమర్జెన్సీ, పిల్లల ఉన్నత విద్య వంటి వాటికి పర్సనల్ లోన్లు తీసుకునేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపేవారు. అందుకు భిన్నంగా ఇప్పుడు తమ ఇళ్లను ఆధునీకరించుకోవడం, ఇతర రెనోవేషన్ పనుల కోసమే కాకుండా హాలిడే టూర్‌కు వెళ్లేందుకు సైతం ఈ రుణాలు తీసుకుంటున్నట్టు వెల్లడైంది. మెట్రో నగరాలు, ప్రధాన పట్టణాలకు మించి నాన్ మెట్రో నగరాల నుంచి ఇలాంటి డిమాండ్ పెరుగుతోంది. వ్యక్తిగత రుణాలు పొందే ప్రతీ ఐదుగురిలో ఒకరు హాలిడే టూర్ కోసమే తీసుకుంటున్నట్టు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'పైసా బజార్' తాజా సర్వేలో వెల్లడైంది. 2023 జనవరి–జూన్ మధ్య పైసాబజార్ నుంచి హాలిడే లోన్స్ తీసుకున్న వారిలో.. దేశంలోని 97 నాన్ మెట్రో నగరాలకు చెందిన వారు 68 శాతం మంది ఉండటం విశేషం. జోధ్‌పూర్, పట్నా, కాన్పూర్, ఆగ్రా, సూరత్, పాటియాలా తదితర మెట్రోయేతర నగరాల వారే ఈ రుణాలపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే మెట్రో నగరాల విషయానికొస్తే... ముంబైలో 25 శాతం, బెంగళూరులో 22 శాతం, ఢిల్లీలో 20 శాతం మంది జాలీ ట్రిప్పుల కోసం రుణాలు తీసుకుంటున్నారు.

ఏ అవసరాల కోసం వ్యక్తిగత రుణాలు (శాతంలో)

గృహాల నవీకరణ	31	పెళ్లి ఖర్చులు	8
హాలిడే టూర్	21	విద్య	6
క్రెడిట్‌కార్డ్/లోన్ పేమెంట్	10	వ్యాపారం	5
మెడికల్	9	ఇతరాలు	10

నివేదికలోని ముఖ్యాంశాలివీ..

- గత ఆరు నెలల్లో హాలిడే టూర్ కోసం పర్సనల్ లోన్లు తీసుకున్న వారిలో 73 శాతం దేశంలోని పర్యాటక ప్రదేశాలకు, 27 శాతం విదేశాల్లోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లారు.
- విదేశాల్లో హాలిడే టూర్‌కు వెళ్లాలనుకుంటే ఎక్కువగా దుబాయ్ (28 శాతం)ని ఎంచుకోగా ఆ తర్వాత థాయ్‌లాండ్ (15 శాతం),యూరప్ (10 శాతం)ను ఎంచుకుంటున్నారు.
- దేశంలో అయితే గోవా (23 శాతం), హిమాచల్ ప్రదేశ్ 10శాతం), ఉత్తరాఖండ్ (9 శాతం), జమ్మూకశ్మీర్ (9 శాతం)లో హాలిడే ట్రిప్‌లకు మొగ్గుచూపుతున్నారు.
- 2023 జనవరి–జూన్ మధ్య కనీసం 21 శాతం మంది పర్యటనల నిమిత్తం పర్సనల్ లోన్లు తీసుకున్నారు. ఇది జనవరి–మార్చి మధ్య 16 శాతం ఉండగా, ఏప్రిల్–జూన్ కాలంలో 27 శాతంగా ఉంది.
- హాలిడే టూర్ లోన్లు తీసుకున్న వారిలో ఉద్యోగులు 74 శాతం ఉండగా, వివిధ రంగాల నిపుణులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు (డాక్టర్లు, లాయర్లు, సీఏలు, వ్యాపారులు) 26 శాతం.

ఖర్చు ఎక్కువైనా వెనుకాడట్లేదు..

హాలిడే టూర్లకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో పోల్చితే హాలిడేపై వెళ్లేటప్పుడు రవాణా, వసతి, ఆహారం, ఇతర సౌకర్యాల్లో మరింత నాణ్యతను కోరుకుంటున్నారు. అందుకోసం ఖర్చు ఎక్కువైనా భరించేందుకు సిద్ధమవుతున్నారు. దీనికోసం పర్సనల్ లోన్లు వంటి వాటిని ఎంచుకుంటున్నారు.

–అజయ్ రామిడి, ఎండీ, లార్వెన్ టూర్స్, ట్రావెల్స్

కాలేజీ ఫీజు కోసం గంజాయి అమ్ముదామని..

ఖమ్మంలో పట్టుబడిన ఒడిశా యువకుడు

ఖమ్మం అర్బన్: కళాశాల ఫీజు, ఇతరత్రా చదువు ఖర్చుల కోసం గంజాయి అమ్మకానికి సిద్ధపడిన ఓ యువకుడు ఖమ్మంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద ఖమ్మం అర్బన్ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సిమెంట్ బస్తాతో కనిపించిన ఓ వ్యక్తిని తనిఖీ చేయగా రూ.2 లక్షల విలువైన 10 కేజీల గంజాయి దొరికింది. దీంతో అతన్ని విచారించగా ఒడిశా రాష్ట్రం ఉదయగిరికి చెందిన డిగ్రీ విద్యార్థి మజీ అని తేలింది. కాలేజీ ఫీజు కోసం ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి విశాఖపట్నం మీదుగా ముంబైలో ఎక్కువ డబ్బుకు అమ్మేందుకు వెళ్తూ ఖమ్మం వచ్చినట్లు అంగీకరించాడు. దీంతో మజీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి వెల్లడించారు.

అరుణాచలం టు త్రివేండ్రమ్

భారత్ గౌరవ్ రైలు మూడో సర్క్యూట్ ప్రకటన

- 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర' పేరుతో ఐఆర్‌సీటీసీ సిద్ధం.. ఏడు ప్రాంతాలు.. తొమ్మిది రోజులు
- ఆగస్టు 9, 23, సెప్టెంబర్ 5వ తేదీల్లో టూర్లకు బుకింగ్స్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రైల్వే శాఖ ప్రారంభించిన భారత్ గౌరవ్ పర్యాటక రైలు మరో కొత్త సర్క్యూట్‌తో ముందుకొచ్చింది. దక్షిణ మధ్య రైల్వేకు ఇటీవలే ఇలాంటి రైలును కేటాయించి రెండు సర్క్యూట్ యాత్రలు ప్రారంభించిన ఇండియన్ రైల్వేస్ కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తాజాగా 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర' సదరన్ సర్క్యూట్‌ను శనివారం ప్రకటించింది. ఇది తమిళనాడు, కేరళల్లోని ప్రధాన పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం కల్పించనుంది.

ఏడు ప్రాంతాలు.. తొమ్మిది రోజులు..

ఈ కొత్త సర్క్యూట్‌లో మొత్తం ఏడు పర్యాటక ప్రాంతాలను చేర్చారు. అరుణాచలం, కన్యాకుమారి, మదురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచిరాపల్లి (తిరుచ్చి), త్రివేండ్రమ్ ప్రాంతాలను ఈ టూర్‌లో చుట్టేయచ్చు. ఆయా ప్రాంతాల్లోని నిర్ధారిత పర్యాటక ప్రాంతాలను చూపుతారు. ఈ అన్ని ప్రాంతాలను చుట్టి వచ్చేందుకు తొమ్మిది (ఎనిమిది రాత్రులు) రోజుల సమయం పట్టనుంది. రైలు మార్గం ఉన్న ప్రాంతాలకు రైలు ద్వారా, మిగతా ప్రాంతాలకు రోడ్డు మార్గం ద్వారా పర్యాటకులను తీసుకెళ్తారు. ఇందుకు అవసరమయ్యే బస, టీ, అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం, వసతిని పూర్తిగా ఐఆర్‌సీటీసీనే కల్పిస్తుంది. ఖర్చులన్నీ ప్యాకేజీ చార్జీలోనే సర్దుబాటు చేస్తారు. ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పిస్తామని, రైలులో నిరంతర పర్యవేక్షణకు సీసీటీవీలను ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని, ప్రయాణ బీమా ఉంటుందని పేర్కొన్నారు.

చార్జీలు ఇలా

- ఎకానమీ (నాన్ ఏసీ)– పెద్దలకు రూ. 14,300, 5–11 ఏళ్ల వయసు ఉన్న పిల్లలకు రూ.13,300
- స్టాండర్డ్ క్లాస్ (ఏసీ)– పెద్దలకు రూ. 21,900, పిల్లలకు రూ.20,800
- కంఫర్ట్ క్లాస్ (సెకండ్ ఏసీ)– పెద్దలకు రూ.28,500, పిల్లలకు రూ.27,100
- ఎకానమీ టికెట్ ఉన్న వారికి బస కోసం హోటళ్లలో నాన్ ఏసీ గది కేటాయిస్తారు. స్టాండర్డ్ టికెట్ వారికి ఏసీ షేరింగ్ రూమ్ ఇస్తారు. కంఫర్ట్ క్లాస్ వారికి ఏసీ వ్యక్తిగత గది కేటాయిస్తారు.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పది హాల్టులుంటాయి. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు రైలు ఎక్కేందుకు వెసులుబాటు ఉంటుంది. సికింద్రాబాద్‌లో బయలుదేరే రైలు కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతుంది. ఆయా స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కి..దిగొచ్చు.

తొలిరోజే 300 టికెట్ల అమ్మకం..

ఈ యాత్రకు సంబంధించి మూడు ట్రిప్పుల తేదీలను ఐఆర్‌సీటీసీ వెల్లడించింది. ఆగస్టు 9, 23, సెప్టెంబర్ 5 తేదీలకు సంబంధించి బుకింగ్స్ ప్రారంభించింది. తొలిరోజే 300 టికెట్లు అమ్ముడైనట్టు తెలిసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.